సంపుటి : 78 సంచిక : 46 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ శ్రావణ బహుళ తదియ
వెల : ₹20/-
31 ఆగస్ట్-06 సెప్టెంబర్ 2026



## హల్దీఘాటీ యుద్ధానికి 450 ఏళ్లు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

@Jagriti Tv
78 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక
www.jagritiweekly.com




# 'నిరంతర అప్రమత్తత అవసరం'

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నక్సల్స్ హింస, తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించే శక్తుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తతతో ఉండాలంటూ, నక్సల్ హింస, తీవ్రవాద భావజాలానికి వ్యతిరేకంగా పోరాడి, నిలిచిన సంఘ స్వయంసేవకులు, విద్యార్థుల త్యాగాలను త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి గుర్తు చేసుకున్నారు.

సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్ట్ 23న హైదరాబాద్‌లోని మామిడిపూడి వెంకటరంగయ్య హాలులో "ఆహుతి– దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులకు వ్యతిరేకంగా పోరాటం" అన్న పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన పాల్గొన్నారు.

గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ 1960 ప్రాంతంలో తెలంగాణ ఏబీవీపీ విస్తరణ, సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఏబీవీపీతో సంబంధం ఉండటం, తీవ్రవాద భావజాలాన్ని వ్యతిరేకించడం అన్న రెండు కారణాలతో అనేక మంది విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు దాడులకు, హత్యకు కూడా గురయ్యారని విచారం వ్యక్తం చేశారు.

ఈ సందర్భగా తన సొంత అనుభవాన్ని కూడా గుర్తు చేసుకున్నారు.. ఓ రోజు క్యాంపస్‌లో తనపై దాడి జరిగిందని, తాను తీవ్రంగా గాయపడ్డానని తెలిపారు. సకాలంలో అందిన వైద్యం కారణంగా తన ప్రాణాలు నిలబడ్డాయని ఆయన అన్నారు. ప్రస్తుత పరిస్థితిని ప్రస్తావిస్తూ, యువతను రెచ్చగొట్టి అరాచకాన్ని ప్రేరేపించాలని చూసే శక్తుల పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. అనేకమంది మావోయిస్టులు లొంగిపోయి ప్రధాన స్రవంతిలోకి తిరిగి రావడం, మావోయిస్టు సిద్ధాంతం విఫలమైందనడానికి, హింసామార్గం పట్ల ఆకర్షణ తగ్గిందనడానికి నిదర్శనమన్నారు.

ఆరెస్సెస్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ ప్రసంగిస్తూ.. ఆహుతి అన్న పుస్తకంలో నమోదు చేసిన పోరాటాలు కేవలం బీజేపీ– వామపక్షాలు లేదా సంఘ్– వామపక్షాల మధ్య రాజకీయ ఘర్షణగానో, హిందూ ముస్లిం సంఘర్షణగానో చూడొద్దని సూచించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతతో పాటు సంప్రదాయాలు, సాంస్కృతిక ఉనికికి తీవ్రవాద కార్యకలాపాలు ముప్పుగా పరిణమించాయని, అందుకే దానిపై వ్యతిరేకత తలెత్తిందన్నారు. దేశ మహనీయులను, సంప్రదాయాలను, వారసత్వాన్ని గౌరవించేలా విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు, 'భారత్ మాతా కీ జై' అనేదే తమ సందేశమని ఆయన తెలిపారు. విద్యార్థులు, స్వయంసేవకులు, కార్యకర్తలు తీవ్రవాద హింసకు వ్యతిరేకంగా ఏ పరిస్థితుల్లో నిలబడ్డారో యువత అర్థం చేసుకునేలా, పుస్తకాలలో నమోదైన ఆ త్యాగాల గురించి తెలియజేయాలని సూచించారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన పుస్తకాలలో, 'సాఫ్రాన్ శాక్రిఫైస్', దాని తెలుగు అనువాదమైన 'ఆహుతి' పుస్తకాలు, దేశాన్ని విభజించాలని ప్రయత్నించే శక్తులకు (ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో) వ్యతిరేకంగా నిలబడిన సంఘ్ స్వయంసేవకుల త్యాగాలకు సంబంధించినది కాగా, 'హ్యూమానిటీ బియాండ్ ఫియర్' అనేది మాజీప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన హింసాకాండలో సిక్కులను రక్షించడంలో సంఘ్ స్వయంసేవకులు పోషించిన పాత్రను పొందుపరిచిన పుస్తకం.



సమాచారభారతి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి సభకు అధ్యక్షత వహించారు.

కీర్తిశేషులు శ్రీ వడ్లమూడి రామమోహనరావు 1985 నుంచి
2007 వరకు 22 సంవత్సరాలు జాగృతి వారపత్రిక సంపాదకుడిగా
విశిష్ట సేవలు అందించిన ధన్యజీవి.

జాగృతి ఆధ్వర్యంలో

# స్వర్గీయ వడ్లమూడి రామమోహనరావు స్మారక

# 'నవలల పోటీ- 2026'

## రచనలను ఆహ్వానిస్తున్నాం..



**ప్రథమ బహుమతి రూ. 25,000**

**ద్వితీయ బహుమతి రూ. 20,000**

### సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి.
- నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు. ➜ తమ రచన డీటీపీ చేసిన పిదప అక్షర దోషాలు, వాక్య నిర్మాణం, ఫుల్‌స్టాప్, కామా గుర్తులు సరి చూచుకొనగలరు. అలాగే పదాలు, వాక్యాలు అల్లుకుపోకుండా చూసి పంపవలసిందిగా మనవి.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా, మొబైల్ నంబర్ సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు. నవలలు **jagriticompetition@gmail.com** కు కూడా మెయిల్ చేయవచ్చు.

నవలలు పంపవలసిన చిరునామా : **3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.**

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 15 సెప్టెంబర్, 2026**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

జాగృతి వారపత్రికను 'మ్యాగజైన్ పోస్ట్' ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140532 5, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

**మా**రుతున్న కుటుంబ వ్యవస్థ.. సోషల్ మీడియా ప్రభావం..పడిపోతున్న నైతిక విలువలు.. పెరుగుతున్న నేర ప్రవృత్తిని గమనిస్తుంటే సమాజం ఎటువైపు పయనిస్తోంది? అభివృద్ధివైపా? పతనం వైపా? అనే సందేహం కలగడం సహజం.

దేవుడికన్నా గురువుకు ఉన్నతస్థానం ఇచ్చే భారతీయ సంస్కృతిలో, ఒక విద్యార్థి తనకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రిన్సిపాల్‌నే హత్య చేయడం అత్యంత కలచివేసే ఘటన. దీనిని ఒక నేరంగా మాత్రమే చూసి మౌనం వహిస్తే సమస్య మూలాలను అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. నానాటికీ వెలుగులోకి వస్తున్న ఇలాంటి ఘటనలు సమాజంలో ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. సమాజానికన్నా ముందు కుటుంబం అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని తట్టి చెప్తున్నాయి.

ఒకప్పుడు కుటుంబమే పిల్లలకు తొలి పాఠశాల. తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలు చెప్పే మంచి మాటలు, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, తప్పు చేస్తే మందలింపు.. ఇవన్నీ పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేవి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలహీనపడటం, ఒకరిద్దరే సంతానం కావడంతో అతి గారాబంగా పెంచడం, తల్లిదండ్రులకు సమయం లేకపోవడం, పిల్లలతో సంభాషణ తగ్గిపోవడం వంటి పరిణామాలు వారి మనసులపై ప్రభావం చూపుతున్నాయి. డబ్బు, చదువు, సౌకర్యాలు ఇవ్వడం మాత్రమే బాధ్యత కాదు; విలువలు, విచక్షణ నేర్పడం కూడా తల్లిదండ్రుల కర్తవ్యమే. మొక్కై వంగనిదే మానై వంగునా అన్న రీతిలో బాల్యంలోనే మంచి అలవాట్లను నేర్పించాలి. బాల్యంలో వాళ్ల మనోఫలకం ఖాళీగా ఉంటుంది. ఆ సమయంలో పిల్లల మనసులలో మనం ఏ సంస్కారాలు నాటుతామో అవి పెరిగి జీవితాన్ని సార్థకం చేస్తాయనేది జగమెరిగిన సత్యం.

నేడు పిల్లలు, యువతపై సోషల్ మీడియా చూపుతున్న ప్రభావాన్ని విస్మరించలేం. ప్రతి విషయానికీ తక్షణమే స్పందించాలి, నచ్చనిదాన్ని సహించకూడదు, ఎదుటివారిని ఓడించాలి, 'నేనే గొప్ప' అనే భావనను పెంచే వాతావరణం పిల్లలపై విశేషంగా ప్రతికూల ప్రభావం చూపుతోంది. హింసను, అసభ్యతను వినోదంగా చూపించే కొన్ని వీడియోలు, కంటెంట్‌కు వారు బానిస అవుతున్నారు. అయితే సోషల్

**శాలివాహన 1948 శ్రీ పరాభవ ఆషాఢ బహుళ తదియ**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**హల్దీఘాటి యుద్ధానికి 450 ఏళ్లు**
6లో

ధారావాహిక నవల
4 ఏ వెలుగులకీ ప్రస్థానం ?
– గన్నవరపు నరసింహా మూర్తి
20లో



ప్రత్యేక వ్యాసం
**సరైన విద్య కావాలి**
26లో



# జాగృతి

## సంపాదకీయం

మీడియానే అన్ని నేరాలకు కారణమని చెప్పడం సరికాదు. దాన్ని ఎలా ఉపయోగించాలి, ఏది అనుసరించాలి, ఏది తిరస్కరించాలి అనే విచక్షణను కుటుంబం, విద్యాసంస్థలు నేర్పాలి.

మరోవైపు నైతిక విలువలు క్రమంగా బలహీనపడుతున్నాయనే ఆందోళన పెరుగుతోంది. ఓటమిని అంగీకరించడం, విమర్శను సహించడం, కోపాన్ని నియంత్రించుకోవడం, తప్పు జరిగితే క్షమాపణ చెప్పడం వంటి సాధారణ జీవిత మర్యాదలు, విలువలు కూడా కొందరికి భారంగా మారుతున్నాయి. చిన్న వివాదాలు పెద్ద ఘర్షణలకు, మాటల తగాదాలు హింసకు దారితీస్తున్నాయి.

## ప్రమాద ఘంటికలు

పెరుగుతున్న నేరాల సంఖ్య కూడా ఇదే ఆందోళనను తీవ్రం చేస్తోంది. అయితే ప్రతి నేరానికి ఒకే కారణం ఉండదు. కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత మానసిక స్థితి, మత్తు పదార్థాలు, సామాజిక ఒత్తిళ్లు, ఆర్థిక సమస్యలు, చెడు స్నేహాలు, డిజిటల్ ప్రభావం వంటి అనేక అంశాలు కలిసి నేర ప్రవృత్తికి దారి తీయవచ్చు. అందుకే పరిష్కారం కూడా బహుముఖంగా ఉండాలి.

పాఠశాలలు కేవలం మార్కులు, ర్యాంకులు ఇచ్చే వ్యవస్థలుగా కాకుండా వ్యక్తిత్వ వికాసానికి కేంద్రాలుగా మారాలి. విద్యార్థుల్లో కోప నియంత్రణ, భావోద్వేగ సమతుల్యత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, గురువుల పట్ల గౌరవం, చట్టం పట్ల అవగాహన వంటి అంశాలపై నిరంతర మార్గదర్శకత్వం అవసరం. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజూ కొంత సమయం మాట్లాడాలి. వారు ఎవరెవరితో తిరుగుతున్నారో, వారి ఆలోచనలేమిటో తెలుసుకోవాలి.

గురువును హతమార్చే స్థాయికి ఒక విద్యార్థి చేరడం అన్నది ఒక్కరోజులో జరిగే పరిణామం కాదు. అది వ్యక్తి జీవితంలో, కుటుంబంలో, విద్యా వ్యవస్థలో, సమాజంలో ఎక్కడో ఏర్పడిన పగుళ్లకు ప్రతిబింబం.

పిల్లలకు భవిష్యత్తు ఇవ్వడం అంటే మంచి ఉద్యోగం ఇవ్వడం కాదు; మంచి మనసు, మంచి విలువలు, తప్పు–ఒప్పులను గుర్తించే విచక్షణ ఇవ్వడం. గద్ద ఆకాశంలో ఎంతో ఎగరగలిగినా తిరిగి భూమిపై తన గూటికి చేరితేనే దానికి మనుగడ సాధ్యం. అదే విధంగా మనిషి కూడా సాంకేతికత ఆధారంగా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు, కాని తన మానవత్వాన్ని ఆధారం చేసుకుంటేనే మనుగడ సాధ్యం కాదు. విద్య ఎంత పెరిగినా సంస్కారం తగ్గకూడదు. స్వేచ్ఛ ఎంత పెరిగినా బాధ్యత మరవకూడదు.

ఇదే నేటి సమాజం ముందున్న అసలైన సవాలు.

'అతి సర్వత్ర వర్జయేత్' అన్నది అందరూ గుర్తించి, పాటించాల్సిన అద్భుత మంత్రం. పెద్దలు పిల్లల పెంపకం గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పూర్వులు ఏనాడో చెప్పారు. 'రాజవత్ పంచవర్షాణి' అంటూ ఆరంభమయ్యే ఆ బోధనా శ్లోకం– పిల్లల్ని అయిదేళ్లవరకు రాజమర్యాదలతో, పదేళ్ల వచ్చేవరకు దాసులుగా, పదహారేళ్ల నుంచి మిత్రులుగా చూడాల్సి ఉంటుందని చెబుతుంది.

తమ పిల్లలకు సుఖంగా జీవించేందుకు సరిపడా ఆస్తులు ఇస్తే చాలని అనేకమంది అనుకుంటారే తప్ప, సంస్కారమే గొప్ప ఆస్తి అనే సత్యాన్ని గ్రహించరు. బాల్యంలో మనసులో పడిన బీజాలు పెరిగి పెద్దవై జీవితకాలం ఉండిపోతాయి. అందువల్ల విషబీజాలు పడకుండా పెద్దలు జాగ్రత్త చూపాలి. ఆత్మశక్తి గలవారు, ఇతరుల ప్రభావాలకు లోనుకారు. ఇలాంటివారే సమాజ క్షేమంకోసం పాటుపడతారు. ★

31 ఆగస్ట్ 2026, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**మొలకెత్తిన విత్తనం**

– గుమ్మడి రవీంద్రనాథ్

ధరహాసం





| | | |
|---|---|---|
| సోషల్ మీడియా వేదికగా ఉగ్రకుట్రలు (జాతీయం) | - | 12 |
| రాష్ట్ర కాంగ్రెస్‌లో కుమ్ములాటలు (తెలంగాణ) | - | 14 |
| 'వికసిత్ భారత్'కు యువతే చుక్కాని (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| బంధాలను కాపాడే అజ్ఞాత రేఖ (మార్పు) | - | 18 |
| ప్రజాస్వామ్యానికి ప్రమాణం భారత్! (అంతర్జాతీయం) | - | 24 |
| కృష్ణ తత్వం మానవ జీవితపాఠం (ప్రత్యేక వ్యాసం) | - | 29 |
| … లైడెన్ తామ్ర శాసనాలు (గళమెత్తిన గతం) | - | 30 |
| యువతను పట్టించుకోవాలి (చర్చ) | - | 32 |
| గురూజీ రచనల వక్రీకరణ (ఆర్‌ఎస్‌ఎస్–100) | - | 34 |
| కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి (వివాదం) | - | 36 |
| జమ్మూ–కశ్మీర్‌లో క్రికెట్ పరిమళాలు! (క్రీడ) | - | 43 |
| ఆత్మాభిమానానికి నిలువుటద్దం షావుకారు జానకి! (నివాళి) | - | 50 |

# హల్దీఘాటీ యుద్ధ



ఉజ్బెకిస్తాన్‌కు చెందిన బాబర్ వంశజుడైన అక్బర్ దేశంలోని అనేక హిందూ రాజులపై విజయాన్ని సాధించి, తన అధికారాన్ని ప్రతిష్ఠించిన తర్వాత, మేవాడ్ రాజ్యంపై అతడి కళ్లు పడ్డాయి. అందుకే, 18 జూన్, 1576న మానసింగ్ నేతృత్వంలో అక్బర్ తన సామ్రాజ్యవాద సేనలను రాణా ప్రతాప్‌పైకి పంపాడు. వారు హల్దీఘాటీపై దాడి చేసి, ఘోర పరాజయాన్ని పొందారు.

**ఘోరంగా ఓడిన అక్బర్ సేనలు**

యుద్ధానంతరం అక్బర్ సేనలు గోగుందా కోటలో ఆశ్రయం తీసుకోవలసి వచ్చింది. సామ్రాజ్య వాద సేనలు ఎంతగా భయపడిపోయాయంటే, ఆకలి తీర్చుకోవడానికి గుర్రాన్ని నడిపే సైనికుడు మరణించడంతో, నడిపేవారు లేక ఉన్న గుర్రాలను తిన్నారుట. అక్బర్‌ను వెన్నంటి ఉండే ఈ సేనలకు, గోగుందా కోట నుంచి బయటకు వెళ్లి తమ అన్నపానాలకు ఏర్పాటు చేసుకునే సాహసం కూడా లేకపోయింది. తమపై ప్రతాపుడు గెరిల్లా దాడి చేస్తాడేమోనన్న అనుమానంతో కోటకు నాలుగు వైపులా కందకాలు తవ్వారు. భయం కారణంగానే యుద్ధమైన తర్వాత ఆ సేనలు నాలుగు మాసాల పాటు ఆ కోటలో బందీలుగా ఉన్నారు. హల్దీఘాటీ యుద్ధ పరాజయం అక్బర్‌ను తీవ్ర ఆగ్రహానికి లోనుచేసింది. అందుకే, తన ప్రధాన సేనాధ్యక్షుడైన మాన్‌సింగ్, అతడి సహచరుడు ఆసఫ్ ఖాన్‌లను బందీలను చేసి, ఆరు నెలల పాటు దర్బారుకు రావడానికి వీలులేకుండా ఖైదు చేశాడు.

**తొలి నుంచి చివరి వరకూ భయంతో వణికిన మొగల్ సేనలు**

హల్దీఘాటీ యుద్ధం మొదటి నుంచీ చివరి వరకూ మొగల్ సేనలు భయం నీడలో జీవించాయి. రాణాప్రతాప్ సేనల కంటే నాలుగు రెట్లు ఎక్కువున్నప్పటికీ, మొగల్ సేనలు వారి ముందు నిలవలేక భయపడి పారిపోయాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచే ముందు వరుసలోని సేనలకు నాయకత్వం వహించిన సేనాపతి హకీం

# ఖమ్‌నోర్ యుద్ధం

**జూన్ 18, 1576**

అది జూన్ 18, 1576... ఆ రోజు సూర్యుడు భిన్నమైన తేజస్సుతో ఉదయించాడు. యుద్ధ భూమిలో శూరవీరులతోపాటు భీతిల్లిన మనోబలం లేదా స్వభావం కలిగిన సేనలను గురించి కవిరాజు సూర్యమల్ మీసణ్ తన కవితల్లో అద్భుతంగా వర్ణించారు. పిరికితనం కలిగిన వారి శరీరం భయంతో ఎలా కంపిస్తుందో, వీరుల పరాక్రమం, తేజస్సు నాలుగు దిక్కులా అలా వ్యాపిస్తుందని అభివర్ణించాడు. యుద్ధంలో వీరుల కవచం ఎలా మెరుస్తుందో అలా రణభూమిలో వారి శౌర్యపు తేజస్సు సూర్యుడు ప్రకాశాన్ని కూడా మసకబారేలా చేస్తుందంటాడు.

ఖమ్‌నోర్ (హల్దీఘాటీ అని కూడా పిలిచే) మైదానంలో అటువంటిదే జరిగింది. భారతీయ వీరులు మొగలుల యుద్ధకౌశలాన్ని నిస్తేజం చేసి, వారిని వారి శిబిరం వరకూ తరిమికొట్టారు. కానీ అంతకుముందు రోజు మేవాడ్ వీరుడు మహారాణా ప్రతాప్ చూపిన నైతిక పరాక్రమం అద్భుతమైనది.

**మోసంతో శత్రువును వధించలేదు**

మహారాణా ప్రతాప్ కేవలం వీరుడైన ఒక సేనా నాయకుడే కాదు, యుద్ధంలో కూడా మానవీయ నైతిక విలువలకు కూడా అత్యున్నత స్థానాన్ని ఇచ్చిన ధీరోదాత్తుడు. యుద్ధం ప్రారంభమవడానికి ఒక రోజు ముందు మధ్యాహ్న సమయంలో మాన్‌సింగ్ కొందరు సైనికులతో పాటు వేటకు వెళ్లాడని, ఆ సమాచారం వేగుల ద్వారా మహారాణాకు అందిందనే ప్రస్తావనలు ఉన్నాయి. 'ఇది చాలా మంచి అవకాశం చేయిజారిపోకుండా శత్రువును చంపివేయాలని' హితులు చెప్పారు. కానీ, వీరుడైన మహారాణా తన క్షత్రియోచితమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ఇటువంటి మోసం, వంచనతో శత్రువును చంపడం నిజమైన క్షత్రియులు చేసే పని కాదంటూ జవాబిచ్చాడు. రేపు యుద్ధంలో మాన్‌సింగ్‌ను ముఖాముఖి ఎదుర్కొందాం. మోసంతో శత్రువును చంపడం వీరోచిత కార్యమని ఆయన భావించలేదు.

**యుద్ధ ప్రకటన**

అక్బర్ ఫతేపూర్ సిక్రీ నుంచి అజ్మీర్‌లోని మొయినుద్దీన్ చిస్తీ దర్గాను దర్శించేం దుకు వచ్చాడు. అక్కడే, ఆయన మహారాణా ప్రతాప్‌కు వ్యతిరేకంగా 1 మార్చి 1576లో అతడు యుద్ధ ప్రకటన చేశాడు. ఈ యుద్ధానికి నేతృత్వం వహించేందుకు మాన్‌సింగ్‌ను నియమించాడు. హల్దీఘాటీ యుద్ధంలో మాన్‌సింగ్‌ను సేనాపతిని ఎందుకు చేశాడన్నది ఒక ముఖ్యమైన విషయం. అంతకు ముందు, ఏ హిందువునూ మొగల్ సేనలకు అధిపతిని చేయలేదు. మాన్‌సింగ్‌ను సేనాపతిని చేయడంపై 'ఇక్బాల్‌నామా –ఎ– జహంగీరీ' రచయిత ముతమిద్ ఖాన్, ' దర్బారు తయారు చేసిన వీరుడు, ప్రత్యేకమైన వ్యక్తి మాన్‌సింగ్. అంతేకాదు, ప్రియమైన కుమారుడు అనే బిరుదు అతడికి ఇచ్చారు. అజ్మీర్‌కు చెందిన ముస్లిం, హిందూ సర్దారులతో కలిసి మహారాణాను ఓడించేందుకు అతడిని పంపారు. అతడిని పంపడం వెనుక అక్బర్ ఉద్దేశ్యం ఏమిటంటే, అతడు కూడా మహారాణా ప్రతాప్‌కు చెందిన జాతివాడు కావడం. మహారాణా ప్రతాప్‌ను అధీనం చేసుకోవడం. పన్నులు వసూలు చేయడం. ఇతడిని పంపడం వెనుక ఉన్న ఉద్దేశం, మహారాణా అతడిని తన ముందు

# విజయ వైభవం

**హల్దీఘాటి యుద్ధానికి 450 ఏళ్లు**

ఖాన్ సూరీ మొగల్ సేనలపై విరుచుకుపడి, వెంటాడటంతో వారు మొగల్‌రాజ్య శివార్లకు, టెరక్రోటకు ప్రసిద్ధమైన మోలేలా గ్రామం వరకూ పారిపోయారు.

అప్పుడు మొగల్ సైన్యం వెనుదిరగకుండా ఆపడానికి, సైన్యం చివరన ఉన్న సేనాపతి మహత్తర్ ఖాన్, మొఘల్ చక్రవర్తి అక్బర్ స్వయంగా ఒక భారీ సైన్యంతో యుద్ధభూమికి వచ్చాడనే పుకారును వ్యాపింపజేశాడు. అప్పుడు పారిపోతున్న మొగల్ సేనలకు కొంత ధైర్యం తిరిగి వచ్చి, పరుగులు ఆపారు. కేవలం మాన్‌సింగ్ మాత్రమే కాదు, ఆ సేనలలో అక్బర్‌కు చెందిన అనేక మంది సేనాపతులు ఉన్నారు. ఎందుకంటే, అక్బర్‌కు మాన్‌సింగ్ మీద పూర్తి విశ్వాసం కూడా లేదు.

### అక్బర్ సేనాపతి మాన్‌సింగ్‌కు అవమానం

యుద్ధం మధ్యలో దృశ్యం ఎలా తయారైందంటే, అనేకమంది సేనా నాయకులు కలిగిన ఆ విశాలమైన మొగల్ సేనల మధ్యలోకి రాణాప్రతాప్ తన గుర్రమైన చేతక్‌పై ఒంటరిగా ప్రవేశించాడు. అప్పుడు చేతక్ ఆ సేనలకు నేతృత్వం వహిస్తున్న మాన్‌సింగ్ కూర్చున్న ఏనుగు కుంభస్థలంపై తన పాదాలను విసిరింది.

అదే సమయంలో రాణా ప్రతాప్ ఈటెలతో మాన్‌సింగ్‌పై తీవ్ర దాడి చేశాడు. ఆ ఈటెల దాడి నుంచి తప్పించుకునేందుకు ఏనుగుపై కూర్చున్న మాన్‌సింగ్ మావటివాడి వెనుక దాక్కున్నాడు. తన దాడిలో మావటివాడితో పాటు మాన్‌సింగ్ కూడా మరణించాడనుకున్న రాణా ప్రతాపుడు తన లక్ష్యం పూర్తి అయిందనుకుని గాయపడిన చేతక్‌ను తీసుకుని యుద్ధభూమి నుంచి బయటకు వచ్చాడు. ఈ యుద్ధంలో ప్రతాపుడు అక్బర్ సేనాపతుల్లో ఒకడైన బహలోల్ ఖాన్‌ను అతడి గుర్రంతో సహా రెండుగా చీల్చేశాడు. యుద్ధమైన తర్వాత మాన్‌సింగ్ తిరిగి అక్బర్ వద్ద వెడుతుండగా, మార్గంలో ప్రజలు అతడిని ఓడిపోయిన ఒక సేనాపతిని చూసినట్టే చూశారు.

### సేనల ఓటమి, దీవేర్‌లో అక్బర్ సంపూర్ణ

### పరాజయం

హల్దీఘాటీ యుద్ధంలో మొగలుల వైఫల్యం పట్ల అక్బర్ ఆందోళన చెంది, 1582వరకు సేనాపతులను మార్చి మార్చి మేవాడ్‌పై అనేక విఫల దాడులు చేశాడు. లక్షమంది సైన్యంతో వచ్చి, స్వయంగా అక్కడ ఉన్నాడు. హల్దీఘాటీ యుద్ధం తర్వాత ఉదయపూర్ పేరును ముహమ్మదాబాద్‌గా మార్చేందుకు అక్టోబర్ 1576లో విఫలయత్నాలలో భాగంగా ఆ పేరుతో వెండి, బంగారు నాణేలను ముద్రించి జారీచేశాడు. అంతిమంగా, 1583లో దీవేర్ యుద్ధానంతరం మొగల్ సేనలు ఘోరంగా ఓడి పారిపోయాయి. ఈ యుద్ధంలోనే మొగల్ సేనాపతి చుట్టూ ఈటెలు, బల్లేలు వేసి అమర్‌సింగ్ బంధించాడు. దీవేర్ యుద్ధానంతరం 36 మొగల్ థాణాల నుంచి మొగల్ సేనలను తరిమికొట్టారు. దివేర్‌లో పరాజయానంతరం ప్రతాపుడు జీవించి ఉండగా, మేవాడ్‌ను ఆక్రమించే సాహసం ఎప్పుడూ చేయలేదు.

అల్లుడిగా, దాసుడిగా భావించడంతో, తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లిందనే దృష్టితో యుద్ధభూమిలో ముందుకు వచ్చి, హత్యకు గురికావాలన్నదే.’ అతడిని సేనాపతిని చేయడం వెనుక ద్వంద్వ నీతి పని చేస్తోందన్న మాట.

### హల్దీఘాటీ ఎంపిక

తన సేనలతో కలిసి మాండల్‌గఢ్ వెళ్లి అక్కడ ఆగిపోయాడు. అక్కడ అతడు మహారాణా ప్రతాప్ రాక కోసం ఎదురు చూస్తున్నాడు. వయోవృద్ధుడు, అనుభవజ్ఞుడైన రామ్ షా తావర్ వ్యూహాత్మక సలహాతో మహారాణా ప్రతాప్ మాండల్‌గఢ్ వెళ్లే ఆలోచనను విరమించుకున్నాడు. ఎందుకంటే, మొగల్ సేనలకు కొండ ప్రాంతంలో పోరాడే అనుభవం లేదు. అందువల్ల, శత్రువుల బలహీనత నుంచి లబ్ధి పొందేందుకు మహారాణా ప్రతాప్ మాండల్‌గఢ్ వంటి మైదాన భూభాగానికి వెళ్లకుండా, మొగల్ సేనలు కొండ ప్రాంతం వైపు వెళ్లే వరకూ నిరీక్షించాడు. దాదాపు రెండు నెలల పాటు వేచి ఉన్న తర్వాత మాన్‌సింగ్ మాండల్‌గఢ్ నుంచి బయలుదేరి మోహి గ్రామం గుండా ప్రయాణించి, ఖమణోర్ సమీపంలోని బనాస్ నది ఉత్తర ఒడ్డున ఉన్న బేస్ మోలేలా గ్రామంలో తన సైనిక శిబిరాన్ని స్థాపించాడు. మహారాణా ప్రతాపుడు కూడా తన



సైన్యంతో గోగుందా గ్రామం నుంచి బయలుదేరి హల్దీఘాటీ నుంచి కొద్ది దూరంలో ఉన్న లోసింగ్ గ్రామంలోని చెరువు సమీపంలో తన సేనలను నిలిపివేశాడు.

**ఖమణోర్ (హల్దీఘాటీ) యుద్ధం**

"మాన్‌సింగ్, ఆసఫ్ ఖాన్ గోగుందా నుంచి 7 కోసుల దూరంలో ఉన్న లోయ వద్ద షాహీ సేనల సహితంగా వెళ్లడంతో, మహారాణా యుద్ధం చేసేందుకు వచ్చాడు. ఖ్వాజా ముహమ్మద్ రఫీ బక్షీ, షియాబుద్దీన్ గురోహ్, పాయన్దా కజ్జాక్, అలీ మురాద్ ఉజ్బెక్, రాజా లూణకరణ, బహలోల్ ఖాన్ సహా మాన్ సింగ్, అనేకమంది రాచరిక అశ్వసైనికులతో కలిసి, మధ్యలో ఏనుగుపై ఉన్నాడు. అంతేకాదు, ప్రసిద్ధమైన యువకులు సేనలకు ముందు వరుసలో ఉన్నారు. ఎంపిక చేసిన 80మందికి పైగా యోధులను సయ్యద్ హాషీమ్ బారహాతో కలిపి సేనలకు ముందుకు భాగానికి పంపగా, సయ్యద్ అహ్మద్ ఖాన్ పన్నెండు మంది ఇతర సయ్యదులతో కలిసి దక్షిణం వైపు ఉన్నాడు. షేఖ్ ఇబ్రహీం చిస్తీ బంధువు అంటే సిక్రీ రాజకుమారులతో కలిసి లోయకు ఎడమవైపు సేనలకు వెనుక భాగంలో ఉన్నాడు, అంటూ ఖమణోర్ యుద్ధ మైదానంలో ఉన్న కరడు గట్టిన సున్నీ మౌల్వీ అబ్దుల్ కాదిర్ బదయూనీ తన పుస్తకంలో రాశాడు.

**మొగల్ సేనల్లో తొక్కిసలాట**

"మహారాణా కీకా (మహారాణా ప్రతాప్) హల్దీఘాటీ కనుమ ముఖద్వారం వరకు 3,000 మంది రాజపుత్రులతో ముందుకు సాగి, తన సైన్యాన్ని రెండు భాగాలుగా విభజించాడు. హకీం ఖాన్ సూర్ నేతృత్వంలో ఒక భాగం కొండల నుంచి బయలుదేరి, ముందువరుస సేనలపై దాడి చేసింది. భూమి ఎగుడు దిగుడుగా, రహదారి వంకర టింకరగా, ముళ్ల పొదలతో నిండి ఉన్న కారణంగా మొగల్ ముందు వరుస సేనల్లో గందరగోళం నెలకొంది. దీనితో ముందువరుసలో ఉన్న సేనలు చెల్లాచెదురైపోయాయి. మొగల్ సేనలోని రాజపుత్రులకు నాయకుడు రాజా లుణకరణ్. వీరిలో అత్యధికులు, ముఖ్యంగా ఉత్తరం వైపు ఉన్న వారు గొర్రెల మందల్లా పరుగులు ప్రారంభించి, ముందువరసలను చీల్చుకొని తమ రక్షణ కోసం దక్షిణంవైపు పరుగెత్తారు. ఈ సమయంలో ముందు వరుసలో ప్రత్యేక సైన్యంతో ఉన్న నేను (అల్ బదాయూనీ) ఇటువంటి అవస్థలో మనం మన, శత్రుసేనలకు చెందిన రాజపుత్రులను ఎలా గుర్తుపట్టగలం అని ఆసఫ్ ఖాన్‌ను అడిగాను. అందుకు అతడు, నువ్వైతే బాణాలు వేస్తూ ఉండు, ఏ పక్షానికి చెందిన వ్యక్తికి అవి తగిలి మరణించినా, అది ఇస్లామ్‌కే మంచిది అవుతుంది కదా? అన్నాడు. అందుకే, మేం బాణాలు వేస్తూనే ఉన్నాం. గుంపు ఎలాంటిది అంటే మేం వేసిన ఒక్క బాణం కూడా వృథాకాలేదు. అంతేకాదు, కాఫీర్లను (హిందువులు) ను చంపే సౌభాగ్యం నాకు కూడా లభించింది. యుద్ధ క్షేత్రం ఇరుపక్షాల వీరుల మృతదేహాలతో నిండి పోయింది" అంటూ బదాయూనీ రాసుకొచ్చాడు.



"మహారాణా ప్రతాప్ స్వయంగా నాయకత్వం వహిస్తున్న సైన్యంలోని రెండవ విభాగం, కొండల నుంచి బయటపడి లోయ ముఖ ద్వారం నుంచి కాజీ ఖాన్ సైన్యంపై దాడి చేశారు. అతడి సేనలను సంహరిస్తూ మహారాణా కీకా మధ్యవరకూ వెళ్లి పోయాడు. దానితో సిక్రీ వారసులు అంతా పారి పోయారు. వారి నాయకుడు, షేక్ ఇబ్రహీం అల్లుడు అయిన షేఖ్ మన్సూర్ పరుగులు తీస్తున్నప్పుడు ఒక బాణం రివ్వున వచ్చిగుచ్చుకుంది. అది ఎంత లోతుగా తగిలిందంటే, చాలా రోజుల వరకూ అతడి గాయం మానలేదు. కాజీ ఖాన్ ముల్లా అయినప్పటికీ, కొంత సమయం దృఢంగా నిలబడ్డాడు, కానీ కత్తితో అతని కుడి చేతి బొటనవేలు నరికివేయడంతో, అతను కూడా తన సహచరులతో పారిపోయాడు" అని యుద్ధ ఘటనలను బదయూనీ రాసుకొచ్చాడు.

**5-6 కోసుల దూరం పారిపోయిన మొగల్ సేనలు**

అక్బర్ ఆస్థాన రచయిత అబుల్ ఫజల్ అల్లామి తన అయిన్ -ఎ- అక్బరీలో "మొదటి దాడిలోనే పారిపోవడం ప్రారంభించిన మా సైనికులు, నదిని దాటి 5-6 కోసుల వరకూ పారిపోయారు. ఇంతటి విధ్వంసకర సమయంలో మిహతర్ ఖాన్ తన సహాయక సేనతో పాటుగా చందావల్ నుంచి బయలుదేరి వచ్చాడు. అతడు డప్పు వాయించి, బిగ్గరగా అరుస్తూ పారిపోతున్న సేనలను ఒకచోట చేరమని చెప్పాడు. అతడి చేసిన ఈ పని సేనల మనస్సుల్లో ఆశ పుట్టించి, వారు పారిపోకుండా చేసింది." మిహతర్ ఖాన్ బిగ్గరగా అరచి ఏమ న్నాడు అనే విషయం గురించి బదయూనీ ఏమీ రాయలేదు కానీ అబుల్ ఫజల్ తన అక్బర్‌నామాలో (ఇంగ్లీషు అనువాదం, జి. 3, పేజీ 246)ఏం రాశాడంటే, సాధారణంగా చూసేవారికి, రాణా విజయం ఖాయమైపోయినట్లుగా కనిపించింది. పైన వర్ణనలో రాణా ప్రతాప్ విజయం గురించి ఫజల్ స్పష్టంగా రాశాడు.

"మహారాణా ప్రతాప్ సేనల ముందు వరుసలో ఉండే గ్వాలియర్‌కు చెందిన రాజా మాన్ మనుమడు రామ్‌షా, వర్ణించడానికి అలివి కానంత వీరత్వాన్ని ప్రదర్శించాడు. కానీ, సైన్యం ముందు వరుసలో దక్షిణం వైపు ఉన్న మాన్‌సింగ్‌కు చెందిన సేనలోని రాజ్‌పుత్రులు పారిపోయారు. దీనితో ఆసఫ్ ఖాన్ కూడా పారిపోవడమే కాకుండా కుడివైపు ఉన్న సయ్యదుల ఆశ్రయం పొందాడు " అని అబుల్ ఫజల్ రాశారు.

**ఏనుగుల యుద్ధం**

ఇరుపక్షాలకూ చెందిన ఏనుగులు తమ తమ సైన్యం నుంచి బయటకు వచ్చి పోరాటం ప్రారంభిం చాయి. మాన్‌సింగ్ వెనుక ఏనుగుపై ఉన్న ఏనుగుల సంరక్షకుడు హుస్సేన్ ఖాన్, ఈ ఏనుగుల యుద్ధంలో పాలుపంచుకున్నాడు. అక్బర్ ఏనుగుల మందలో ప్రత్యేకమైన ఏనుగు, మహారాణాకు చెందిన 'రామ ప్రసాద్' అనే ఏనుగుతో గట్టి పోరాటం చేసింది. అది పరాజయం పాలు అయినప్పుడు మొగల్ సైనికుడు కమల్‌ఖాన్ ఆ ఏనుగును ఎదుర్కొన్నాడు. రాజ ఏనుగు గాయాలపాలైంది. రామప్రసాద్ ఏనుగు అనేకమంది మొగల్ సైనికులను చంపిపడేసింది. అప్పుడు, 'రామప్రసాద్'ను ఎదుర్కొని, పోరాడేం దుకు, మొగలు సైనికులు తమ గజరాజును ముందుకు తీసుకువచ్చారు. కానీ గజరాజు కూడా రామప్రసాద్‌తో పోటీపడలేక పోయింది. అప్పుడు రామ్ ప్రసాద్‌ను ఎదుర్కొనేందుకు మొగల్

## హల్దీఘాటి యుద్ధానికి 450 ఏళ్లు

మావటివాడు పంజూరామ్ మదావత్‌ను ఏనుగుతో తీసుకొని వచ్చారు. రెండు ఏనుగుల మధ్య భీషణ యుద్ధం జరిగింది. రామప్రసాద్ ఏనుగు కూడా వెనుకంజ వేయడం ప్రారంభించింది కానీ యుద్ధంలో శత్రువుల దంతాలను విరగొట్టే రామప్రసాద్ ఏనుగుకు చెందిన మావటివవాడు గాయపడడంతో పరిస్థితి పూర్తిగా తిరగబడింది. పరిస్థితిని గమనించిన రాచ ఏనుగుల నిర్వాహకుడు హుస్సేన్ ఖాన్, రామప్రసాద్ మావటివాడు మరణించగానే ఆ స్థానాన్ని తాను ఆక్రమించి, ఏనుగును తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. ఆ తర్వాత బదాయునీ కొందరు సైనికులతో కలిసి రామప్రసాద్ ఏనుగును తీసుకుని అజ్మీర్ వైపు ప్రయాణమయ్యారు. 'మొగల్ సైనికులు రామప్రసాద్‌ను తీసుకుని అజ్మీర్ వైపు ప్రయాణిస్తుండగా, మేవాడ్ నివాసులు దానిపై మట్టి విసిరి దానిని అవమానించడం ప్రారంభించారు' అని 'ముస్తాఖాబ్–ఉత్–తవారీఖ్'లో రాశారు.

**బహలోల్ ఖాన్‌ను చంపడం**

అదే సమయంలో మాన్‌సింగ్ సేనలకు ముందు వరుసకు నేతృత్వం వహించే వాడు, అతని తురుపు ముక్క. ఉజ్బెక్ బహలోల్ ఖాన్, మాధవ్‌సింగ్ కచ్చావాతో పాటు ఉన్నాడు. అతడు మానసింగ్ రక్షణ కోసం ముందుకు కదిలి, రాణాప్రతాప్ సమీపానికి వచ్చాడు. మహారాణా తన కత్తితో అతడి తలపై భీషణంగా దెబ్బకొట్టాడు. ఈ దెబ్బకు బహలోల్ ఖాన్ రక్షణ కవచం, గుర్రంతో సహా రెండు ముక్క లయ్యాడు. అక్బర్ సేనల్లో అత్యంత శక్తిశాలి అయిన ఉజ్బెక్ సైనికుడు బహలోల్ ఖాన్.

**మొగల్ సేనా నాయకుడు మాన్‌సింగ్‌పై ప్రతాప్ దాడి**

బహలోల్ ఖాన్‌ను వధించి, చేతక్‌పై సవారీ చేస్తున్న మహారాణా ప్రతాప్ యుద్ధంలో సేనలను వేగంగా సంహరిస్తూ, మాన్‌సింగ్ వైపు కదిలాడు. ఈ మధ్యలోనే దోడియా భీమ్‌సింగ్ తన బల్లెం తీసుకుని మాన్‌సింగ్ ఏనుగువైపు దూకి, గుర్రంపై నుంచి బల్లెంతో మాన్‌సింగ్‌ను తీవ్రంగా గాయపరుస్తూ, 'నిన్ను నువ్వు కాపాడుకో మాన్‌సింగ్, దోడియా భీమ్‌ను వచ్చాను' అన్నాడు. ఈ యుద్ధంలో మానసింగ్ ఏనుగు అంబారీలో కూర్చుని వచ్చాడు. అతడు కింద వంగి దోడియా భీమ్‌సింగ్ బల్లెపు దాడినుంచి తనను తాను కాపాడుకున్నాడు. భీమ్‌సింగ్ గుర్రం నుంచి కిందపడటంతో మొగల్ సైనికులు చుట్టుముట్టినా ప్రబలమైన పరాక్రమాన్ని చూపి వీరగతిని పొందాడు. మహారాణా ప్రతాప్ గుర్రమైన చేతక్ తన రెండు కాళ్లను మానసింగ్ ఏనుగు కుంభస్థలంపై ఉంచి, మాన్‌సింగ్‌పై తన యజమాని దాడి చేసే సౌకర్యాన్ని కల్పించింది. మహారాణా ప్రతాప్ గర్జిస్తూ, నీకెంత సాధ్యమైతే అంత సాహసాన్ని ప్రదర్శించు, ప్రతాప్‌సింగ్ వచ్చాడు అన్నాడు. ఆ మాట అన్న తర్వాత మహారాణా ప్రతాపుడు మాన్‌సింగ్‌పై బల్లెంతో దాడి చేశాడు. కానీ ఆ దాడి నుంచి తనను తాను కాపాడు కునేందుకు మాన్‌సింగ్ తన అంబారీలో వంగి కూచున్నాడు. దీనితో మహారాణా బల్లెం అంబారీకి తగిలి, మాన్‌సింగ్ బతికిపోయాడు. దీనితో గాయపడి, భీతిల్లిన మావటివాడు ఏనుగును వెనక్కి తిప్పి యుద్ధక్షేత్రం నుంచి మాన్‌సింగ్‌ను బయటకు తీసుకువచ్చాడు. దీని తర్వాత, మాన్‌సింగ్ తన సేనలను కలవడానికి సాయంత్రం మోలేలా చేరుకున్నాడు. కానీ అక్కడ ఎవరూ కలవలేదు. ఆ మరురోజు సాయంత్రం గుగేందూలోనే అతడు సేనలను కలుసుకోగలిగాడు. మాన్‌సింగ్ మరణించా డని భావించిన రాణా ప్రతాప్ తన గుర్రాన్ని అక్కడ నుంచి వెనక్కి తిప్పాడు. ఈ యుద్ధంలో జయమల్ మోడతియా కుమారుడు రామదాస్, గ్వాలియర్ మహారాజు రామ్‌షా తమ పుత్రులు శాలివాహనుడు, ఇతర కుమారులతో కలిసి ధైర్యంగా పోరాడి తమ సేవలను అందించారు. మాధవ్ సింగ్ కచ్చావాతో పోరాటం చేస్తుండగా మహారాణాపై బాణాల వర్షం కురిసింది. సయ్యద్‌లతో పోరాడుతున్న హకీం ఖాన్ సూర్‌జీ పరుగున వచ్చి మహారాణాను కలిశాడు. ఈ రకంగా, మహారాణా సైన్యంలోని రెండు విభాగాలు కలిసిపోయాయి. యుద్ధం కూడా ముగింపుకు రావడం ప్రారంభమైంది. దీనితో మొగల్ సేనలలోని రాజపుత్రులు చెల్లాచెదురయ్యి, వెనక్కి తగ్గడం ప్రారంభించారు. అంతేకాదు, సుమారు అర కోసు వెనక్కి వెళ్ల, బనాస్ దక్షిణ కొనకు చేరుకున్నారు. అలా వెనక్కి తగ్గుతున్న మొగల్ సేనల కారణంగా మేవాడ్ యోధులలో ఉత్సాహం తగ్గడం లేదు.

**యుద్ధ మైదానం నుంచి మహారాణా ప్రతాప్‌ను తప్పించడం**

ఆ సమయానికి మహారాణా ప్రతాప్‌కు గాయాలు అయ్యాయి. అలాంటి స్థితిలో మాన్‌సింగ్ (ఝాలా బీదా) అంతకుముందే పన్నిన వ్యూహం ప్రకారం మహారాణాప్రతాప్ మొగలులతో భవిష్యత్ యుద్ధ పోరాటాలను కొనసాగించ దానికి యుద్ధ ప్రాంతం నుండి తరలించాలని కోరాడు. చేతక్ పగ్గాలు పట్టుకొని, దాని ముఖం పక్కకు తిప్పమని హకీమ్ ఖాన్ సూర్‌ను ఝాలా బీదా చెప్పాడు. అతడితో పాటు భామా షా, తారాచంద్‌తో మీరు మీ సైనిక దళాలతో మహారాణా ప్రతాప్‌కు వెనుక నుంచి రక్షణ కల్పిస్తూ, అతడిని యుద్ధక్షేత్రం నుంచి బయటకు తీసుకువెళ్లండి అన్నాడు. దీనికి ముందు, ఈ అవకాశం చూసి, మొగల్ సైన్యం దృష్టిని సులభంగా మళ్లించేందుకు ప్రతాప్ ఛత్రాన్ని, మేవాడ్ ఇతర రాజ చిహ్నాలను ఝాలా బీదా స్వీకరించాడు. మహారాణా ప్రతాప్‌ను భామాషా, తారాచంద్ కావడియా ద్వారా, అతడి సైనిక విభాగం సహయోగంతో సురక్షితంగా యుద్ధ క్షేత్రం నుంచి బయటకు తీసుకువచ్చారు. 'ముంతఖాబ్–ఉత్–తవారీఖ్'లో అబ్దుల్ ఖాదిర్ బదాయూనీ ఈ ఘటాన్ని వర్ణిస్తాడు.

**స్వామిభక్త చేతక్ వీరోచిత కార్యం**

మాన్‌సింగ్ పై దాడి చేస్తున్న సమయంలో చేతక్ కాలు మాన్‌సింగ్ ఏనుగు తొండానికి ఉన్న కత్తి కారణంగా గాయమైంది. అయినప్పటికీ, గాయపడిన చేతక్ విశ్వసనీయమైన భాగస్వామిలా మహారాణా ప్రతాప్‌ను సురక్షితమైన చోటుకు చేర్చేవరకూ ఆయనను వీడలేదు. హల్దీఘాటీ నుంచి దాదాపు



రెండు మైళ్ల దూరంలో ఉన్న బలీచా గ్రామం సమీపంలో 20 నుంచి 25 అడుగుల మేర వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును గాయపడిన చేతక్ ఒక్క గంతులో దాటి, ఖోడి ఆమ్లి సమీపంలో ప్రాణాలు విడిచింది. అక్కడ నిర్మించిన సమాధి నేటికి కూడా స్వామిభక్త చేతక్ స్మృతులను సజీవంగా ఉంచుతోంది. చేతక్ ప్రాణాలు విడిచిన బలీచా గ్రామంలో, అక్కడి శివాలయానికి అత్యంత సమీపంలో స్వామి భక్త చేతక్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించాడు. చేతక్ స్మారక చిహ్నానికి, శివాలయం నిత్యపూజ, అర్చనలు లేదా నైవేద్యాదికాల కోసం మహారాణా ప్రతాప్ బలీచా గ్రామంలో శ్రీమాలీ బ్రాహ్మణుడు శ్రీధర్ జీ వ్యాస్‌కి భూమిని దానరూపంలో కాలక్రమంలో ఇచ్చివేశాడు. ప్రస్తుతం కమల నయన్‌జీ శ్రీమాలి కుటుంబం వద్ద దీనికి సంబంధించిన రాగి పలక అందుబాటులో ఉంది.

### మొగల్ సేనలలో వ్యాపించిన భయం

'మొగల్ సేనలు పూర్తి అలిసిపోయి ఉన్నాయ'ని తన అయిన్‌- ఎ-అక్బరీలో యుద్ధ వర్ణణ చేస్తూ అబుల్ ఫజల్ అల్లామీ పేర్కొన్నాడు. యుద్ధం ప్రాతఃకాలం నుంచి మధ్యాహ్నం వరకు సాగిందని బదయూనీ రాశాడు. అప్పుడు ఎండ మండిపోతోంది, తమ సైనికుల్లో నడిచి తిరిగేందుకు కూడా శక్తి లేదు. అటువంటి సమయంలో, మహారాణా పర్వతం వెనుక ద్రోహపూరితంగా మాటువేసి ఉంటాడనే వార్త సైన్యమంతటా వ్యాపించింది. ఇది విని మొగల్ సైనికులు భయపడ్డారు. ఈ భయం కారణంగానే తమ సేనలు మహారాణా వెంటపడలేదని బదయూనీ రాశాడు. వారు తమ డేరాల్లోకి తిరిగి వెళ్లి గాయపడిన వారికి చికిత్సచేయడం ప్రారంభించారు. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయడం అవసరం, విజయం సాధించిన సేనలలో భయం, ఓడిపోయామన్న భావన ఉండగా, ఓడిపోయిన సేనలలో ఉత్సాహం ఏమాత్రం తగ్గకపోవడం ఎలా సాధ్యం?

### పోరాట స్వభావం

ఈ మొత్తం యుద్ధం గురించి ఈ రకంగా వివరించవచ్చు-యుద్ధం దాదాపు ఐదుగంటలపాటు మూడు దశల్లో జరిగింది. మొదటి దశ ఉదయం 8 గంటల తర్వాత ప్రారంభమైంది. తొలి దశలో హల్దీఘాటీ ముఖద్వారం నుండి మేవాడ్ సేనలు ముందుకు సాగి దాడులు చేశాయి. తొలి దాడితో చెల్లా చెదురైన మొగల్ సేనలు దాదాపు 5 నుంచి 7 కోసల దూరంలో గల బనాస్ మీదుగా పరుగులు తీశాయి.

అటువంటి పరిస్థితుల్లో, రెండవ దశ యుద్ధం ప్రారంభమైంది. ఇది హల్దీఘాటీ ముఖద్వారం నుంచి మైలుంపావు దూరంలో జరిగింది. ఇక్కడ మొగలు సైనికుల స్థానంలో కచ్చ్వాహీ రాజపుత్ర సైనికులు, మేవాడ్ సైనికులతో తలపడ్డారు. ఇదే సమయంలో మేవాడ్ సేనల ఒత్తిడి కారణంగా మొగలులకు చెందిన రాజపుత్ర సైనికదళాలు దాదాపు ఒకటిన్నర కోసులు వెనక్కి తగ్గి, బనాస్ దక్షిణ తీరం చేరుకున్నాయి.

ఇక్కడ యుద్ధంలో మూడవదశ ఆరంభం అవుతుంది. మొగల సేనల సహాయం కోసం మహతర్ ఖాన్ పారిపోయిన సేనలు, సురక్షిత సేనలను తీసుకుని వస్తాడు. దీనితో చివరి దశ యుద్ధం భీషణంగా ప్రారంభమవుతుంది. ఇందులో రూలా బీదా (మాన్‌సింగ్), హకీం ఖాన్ సూర్‌కు వీరగతి లభిస్తుంది. అంతిమ దశ మధ్యాహ్నానికి యుద్ధం ముగిసిపోయింది. యుద్ధ సమయంలో మూడు దశల్లోనూ మొగల్ సేనలు వెనక్కి తగ్గుతూనే ఉన్నాయి. బనాస్ తీరంలో జరిగిన యుద్ధం సమయంలో తీవ్రమైన వాన కురవడంతో, యుద్ధ క్షేత్రమంతా నీరు నిండిపోయింది. ఆ నీటిలో సైనికుల రక్తం కలవడంతో ఆ జలాలు రక్తవర్ణంలోకి మారాయి. అప్పటి నుంచే ఈ ప్రదేశాన్ని 'రక్తతలాయీ' అని పిలవడం ప్రారంభించారు.

– డా॥ భట్నాగర్, ప్రతాప్ గౌరవ్ శోధన కేంద్రం, ఉదయ్‌పూర్

# హల్దీఘాటి యుద్ధం ఒక అంచనా

## మొగలులకు వ్యతిరేకంగా జరిగిన విజయవంతమైన పోరాటం

ప్రాతఃస్మరణీయుడైన మహారాణా ప్రతాప్ భారతీయ స్వేచ్ఛకు ఒక దార్శనిక, తాత్త్విక ప్రతీక. స్వదేశం, స్వధర్మ రక్షణ కోసం పరిమిత వనరులున్నప్పటికీ, నాడు అత్యంత శక్తిశాలి అయిన మొగల్ సమ్రాట్‌తో అతడు తలపడ్డాడు. అతడు పరాధీనతకు బదులుగా స్వేచ్ఛను ఎంచుకున్నాడు. అతడు కావాలనుకుంటే పరాధీనతను స్వీకరించి, ఇతర రాజులలా వైభవోపేతంగా జీవితాన్ని జీవించవచ్చు. ఈ అవకాశం అతడికి ఉంది. నాలుగు సంధి ప్రతిపాదనలను తోసిపుచ్చి అతడు స్వాతంత్ర్యాన్ని కాపాడుకునేందుకు సంఘర్షణ మార్గాన్ని ఎంచుకున్నాడు.

అక్బర్ సామ్రాజ్యవాద దురాశలో మేవాడ్ స్వాధీనత అన్నది అతి పెద్ద అడ్డంకి. దీనికి తోడు గుజరాత్ లేదా గుజరాత్ సముద్ర తీరం వరకు సజావుగా వాణిజ్య కార్యకలాపాలు జరగడానికి అతని సామ్రాజ్యంలో మేవాడ్ కలవడం అత్యవసరం. సామ,దాన, భేద దండోపాయాలను ఉపయోగించి ఎలాగైనా మేవాడ్‌ను స్వాధీనం చేసుకోవలన్నది అతడి కోరిక. అందుకే, 1572 నుంచి 1576 జూన్ వరకు, నాలుగు సంధి ప్రతిపాదనలను పంపాడు. కానీ, ప్రతాపుడు తనకు ప్రాణాలతో సమానమైన మేవాడ్‌ను అతడు అధీనం చేసుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు. దాని ఫలితమే 18 జూన్, 1576లో హల్దీఘాటి యుద్ధం.





హల్దీఘాటి యుద్ధం మహారాణా ప్రతాప్ విజయవంతమైన, కీర్తిదాయకమైన సంఘర్షణకు ప్రారంభం. ఈ యుద్ధం 7 సంవత్సరాలు జరిగింది. ఈ సంఘర్షణలో నిర్ణాయకమైన పరిష్కారం దివేర్ యుద్ధంలో లభించింది. హల్దీఘాటీ యుద్ధంలో ప్రతాపుడు తన శత్రువులపై పోరాటంచేశాడు. ఈ సంఘర్షణను కూడా ప్రతాపుడే ప్రారంభించాడు. దారుణమైన వేడి ఉండే ఎండాకాలం కోసం ఎదురుచూశాడు. మొగలులను లోయవరకు పిలిచాడు. ప్రతాపుడి ప్రచండమైన దాడి ఎంత భీకరంగా ఉందంటే, మొగల్ సేనల కాళ్లు కంపించాయి. శత్రు సైన్యం గందర గోళపడి, పట్టుకోల్పోయి ఆరుకోసల దూరం పారిపోయింది. ఆ తర్వాత భీషణ సంఘర్షణ ఖమణోర్‌లోని రక్త తలాయీ మైదానంలో జరిగింది. ఈ భీషణ సంఘర్షణలో ప్రతాపుడి అద్భుత పరాక్రమం సాక్షాత్కారమైంది. మొగల్ సేనాపతి మాన్‌సింగ్ తన ఏనుగు అంబారీలో దాక్కొని, ప్రాణాలు కాపాడుకున్నాడు. అక్కడ రోజంతా జరిగిన సంఘర్షణలో మొగల్ సేనలకు భారీగా నష్టం వాటిల్లింది. రాజపుత్రులలోని ఒక తరం అంతా ఇక్కడ ఒకరకంగా తుడిచిపెట్టుకుపోయింది. గ్వాలియర్ రాజవంశానికి చెందిన మూడు తరాలు ఒకేసారి బలిదానం చేయగా, భిల్లులతో పాటు ప్రతివర్గం కూడా ప్రాణత్యాగం చేసింది. రోజంతా యుద్ధం సాగిన తర్వాత, ప్రతాపుడు సేనలు కోల్యారీ చేరుకున్నాయి. నేడు బాద్షాహీ బాగ్ అని పిలిచే ప్రాంతంలో మొగల్ సేనలు నిలిచాయి.

హల్దీఘాటీ వద్ద మొగల్ దండయాత్రను విశ్లేషిస్తే, అది వారి వైఫల్యాలకు ఒక స్మారక చిహ్నం. దీని మూల్యాంకనం చూద్దాం –

**ప్రతాపుడి తల కోసం వచ్చి, ఒక ఏనుగును తీసుకువెళ్లారు**

మొగలుల యుద్ధం దాని లక్ష్యంలో విఫలమైంది. సజీవంగా లేదా నిర్జీవంగా అయినా ప్రతాపుడిని బందీని చేయాలన్నది అక్బర్ కోరిక. కానీ, అతడు ప్రతాపుడిని అధీనంలోకి తెచ్చుకోవడంలో లేదా ఖైదు చేయడంలో విఫలమయ్యాడు. అయితే, రామప్రసాద్ అనే ఏనుగును బందీని చేయడంలో మాత్రం సఫలమయ్యారు. ఆ ఏనుగును ఫతేపూర్ సిక్రీకి తీసుకువెళ్లి అక్బర్‌కు సమర్పించగా, ఆయన దాని పేరును రామ్‌ప్రసాద్ నుండి పీర్ ప్రసాద్‌గా మార్చారు. అయితే, ఆ ఏనుగుకు ప్రతాపుడి పట్ల ఎంత స్వామి భక్తి ఉండేదంటే, అది అన్నపానాలను సైతం ముట్టకుండా ప్రాణత్యాగం చేసిందని చెప్తుంటారు.

**స్వాతంత్ర్య సమరం వర్సెస్ మతయుద్ధం**

ప్రతాపుడికి హల్దీఘాటీ యుద్ధం ఒక స్వాతంత్ర్య సమరం కానీ, మొగలులకు అది ఒక మత యుద్ధం. మొగలుల చరిత్రను రచించిన బదయూనీ హల్దీఘాటీ యుద్ధ సమయంలో అక్కడ ఉన్నాడు. అతను తమ సేనాపతి ఆసఫ్ ఖాన్‌ను ఒకసారి ప్రశ్నించాడు, ఇరువైపులా ఉన్న రాజపుత్ర సైనికులు ఒకేరకమైన వేష భాషలను కలిగి ఉన్నారు, ఎవరిపై బాణం వేయాలో తెలియడం లేదు అన్నప్పుడు, నువ్వు బాణాలు వేస్తూ ఉండు, ఎవరు మరణించినా విజయం మతానిదే అవుతుందంటూ ఆసిఫ్ ఖాన్ జవాబిచ్చాడు.

**హల్దీఘాటీ యుద్ధం తర్వాత మొగలు సేనల దుర్దశ**

యుద్ధానంతరం మొగల్ సేనలు రహస్యంగా దాక్కొని దాక్కొని గోగుందా చేరుకున్నాయి. ప్రతాపుడికి ఎంత భయపడ్డారంటే, వారు తమ రక్షణ కోసం గోగుందా కోటకు నాలుగు దిక్కులా లోతైన కందకాలను తవ్వించి, తర్వాత ఎత్తైన గోడలు నిర్మింపచేశారు. సేనలు అందులో ఖైదీల్లాగా తమ జీవితాన్ని గడపడం ప్రారంభించారు. ముందుగా ఆ ప్రాంతంలో ఇబ్బడిముబ్బడిగా లభించే మామిడి కాయలు తిన్నారు. దానితో వారికి విరోచనాలు పట్టుకున్నాయి. వీటి కారణంగానే, చాలామంది సైనికులు మరణించారు. మామిడికాయలు అయిపోయిన తర్వాత గుర్రాలను చంపితిన్నారు. కుళ్లిన మాంసం కూడా తిన్నారు. దీనితో సైనికులు కలరా బారిన పడ్డారు. దీనివల్ల కూడా చాలామంది సైనికులు మరణించారు. హల్దీఘాటీలో జరిగిన ప్రత్యక్ష యుద్ధంలో మరణించిన సైనికులకన్నా ఎక్కువమంది విరోచనాలు, కలరా కారణంగా మరణించారు.

వారు మొత్తానికి ప్రాణాలు కాపాడుకొని, సెప్టెంబర్ మాసానికి ఫతేపూర్ సిక్రీ వైపు ప్రయాణిస్తుండగా, బదయూనీ ఏం రాశాడంటే, తాము ప్రతాప్‌ను ఓడించామని వీరు చెబుతుంటే, ఒక్క వ్యక్తి కూడా వారిని నమ్మలేదు!

**మాన్‌సింగ్, ఆసిఫ్ ఖాన్‌ల బహిష్కరణ**

సేనాపతి మాన్‌సింగ్, ఆసిఫ్ ఖాన్‌లు ఫతేపూర్ సిక్రీ చేరుకునే సమయానికి వారి వైఫల్యంపట్ల అక్బర్ ఎంత క్రోధుడై ఉన్నాడంటే, 6 నెలల పాటు దర్బార్‌లోకి వారి ప్రవేశాన్ని నిరోధించాడు.

**మేవాడ్‌పై అక్బర్ స్వయంగా దండయాత్రకు రావడం**

హల్దీఘాటీ యుద్ధ వైఫల్యానికి మరో ప్రమాణం ఏమిటంటే, స్వయంగా అక్బరే 1576 అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రతాపుడికి విరుద్ధంగా దండయాత్రకు రావలసి రావడం.

**యుద్ధం తర్వాత కూడా ప్రతాపుడి పాలన**

హల్దీఘాటీ యుద్ధం తర్వాత సంపూర్ణ మేవాడ్‌లో పాలన ప్రతాపుడిదే ఉం డేది. హల్దీఘాటీ యుద్ధం తర్వాత భూమి పట్టాలు, అనుమతులు, రాగి పలకలూ అన్నీ కూడా ప్రతాపుడి పేరుతోనే జారీ అవుతూ వచ్చాయి.

**శాసనాలపై ప్రతాపుడి విజయ వర్ణన**

ఖరసాన్ మందిరం, జగదీష్ మందిర్‌లలో ఉన్న శాసనాలలో హల్దీఘాటీ యుద్ధంలో ప్రతాపుడే విజేత అని పేర్కొన్నాయి.

హల్దీఘాటీ యుద్ధం మొగలులకు వ్యతిరేకంగా మహారాణా ప్రతాప్ చేసిన విజయవంతమైన సంఘర్షణ. ఆయన ఆ తర్వాత మొగలులపై చిన్న, పెద్ద కలిపి 40 యుద్ధాలలో పోరాడు. అందులో గోగుందా, మోహీ, కుంభల్‌గఢ్, దూంగర్‌పూర్ యుద్ధాలు ప్రస్తావించదగినవి. అంతిమంగా దివేరా యుద్ధంలో విజేతగా నిలిచాడు.

**– నారాయణ ఉపాధ్యాయ, మహారాణా విజయ స్మారక సంస్థాన్, దివేర్ వ్యవస్థాపకులు**

# సోషల్ మీడియా వేదికగా

**మత ఛాందసంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్.. భారత్ చేతిలో ఎన్నిసార్లు చావుదెబ్బతిన్నా వైఖరిలో మార్పు రావడం లేదు. భారత్‌తో జరిగిన పలు యుద్ధాల్లో పరాజయం పాలైన పాకిస్తాన్ ముఖాముఖి తలపడలేనని నిశ్చయించుకుని ఉగ్రవాదులను ప్రోత్సహిస్తోంది. అయితే గత కాంగ్రెస్ ప్రభుత్వాలతో పోలిస్తే బీజేపీ ప్రభుత్వం పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలకు దెబ్బకు దెబ్బ అన్నట్టుగా వ్యవహరిస్తుండడంతో పాలుపోని ఆ దేశం ఇప్పుడు కొత్త కొత్త సంస్థలను భారత్‌పై ఉసిగొల్పుతోంది.**



పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐ మద్దతుతో షహజాద్ భట్టి నెట్‌వర్క్ (ఎస్‌బీఎన్) సంస్థ ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశంలో రక్తపాతం సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందించగా, భారత భద్రతా దళాలు ముందుగానే గుర్తించి భగ్నంచేయడంతో దేశం పెనుముప్పు నుంచి బయటపడింది. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో భారీ ఆపరేషన్ నిర్వహించి 250 మందికిపైగా అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో మరోసారి పాకిస్తాన్ కుట్రలు బయటపడటమే కాకుండా దేశానికి పెను ప్రమాదం తప్పింది.

దేశ విభజనానంతరం జమ్మూకశ్మీర్ భూభాగంపై కన్నేసిన పాకిస్తాన్ సుదీర్ఘకాలంగా భారత్‌పై ప్రత్యక్షంగా యుద్ధాలు, పరోక్షంగా ఉగ్రదాడులు చేస్తోంది. వీటిలో ప్రత్యక్ష యుద్ధాలు పరిమిత స్థాయిలో ఉండగా పరోక్షంగా ఉగ్రవాద చర్యలు తరచూ జరుగుతున్నాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ఉగ్రవాదులదాడులు జరిగినప్పుడు ఖండించడం, చర్యలు తీసుకుంటామని హడావిడి ప్రకటనలు చేయడం తప్ప పెద్దగా చర్యలు కనిపించేవి కావు. అయితే దీనికి భిన్నంగా ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉగ్రవాదుల దాడులకు ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని ఉగ్ర శిబిరాలపై దాడులు చేయడంతో పాటు.. ప్రపంచానికి పాకిస్తాన్ నైజాన్ని, అది పోషిస్తున్న ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలను బహిర్గతం చేస్తూ చర్యలు తీసుకుంటోంది.

ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఉగ్రవాద దాడులకు భారత్ తీవ్రంగా స్పందించింది. అంతకుముందు 1993, 2008లో ముంబైలో ఉగ్ర ముష్కరులు చేసిన దాడుల్లో వందలాదిమంది బలైనా బదులు తీసుకోవడంలో మీన మేషాలు లెక్కపెట్టారు. 2016లో ఉరీ ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 19మంది భారత సైనికులు మృతిచెందారు. దీనికి ప్రతీకారంగా భారత సైన్యం పాకిస్తాన్ ఆక్రమిత ప్రాంతంలోని ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది. 2019లో పుల్వామాలో ఉగ్రవాదులు చేసిన దాడిలో 40మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతి చెందగా ప్రతీకారంగా భారత్ బాలాకోట్‌లోని ఉగ్రవాద శిక్షణశిబిరాలపై వైమానిక దాడులు నిర్వహించింది. 2025లో పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26మంది పౌరులను పొట్టనపెట్టుకున్న ఘటనకు ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుంది. మోదీ ప్రభుత్వం ఒకవైపు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేస్తూనే మరోవైపు పాకిస్తాన్ ఉగ్రవాదులకు అందిస్తున్న అండదండలను, వారి ద్వంద్వనీతిని ప్రపంచం ముందు బహిర్గతం చేయడంలో విజయవంతమవడంతో అంతర్జాతీయంగా పాకిస్తాన్‌పై ఒత్తిడి పెరిగింది.

పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలకు గట్టి బుద్ధి చెబుతున్నా ఆ దేశ వైఖరిలో మాత్రం ఎలాంటి మార్పురావడం లేదు. ఐఎస్ఐ అండతో లష్కరే తోయిబా, జమాత్ ఉద్ దవా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్, ది రెసిస్టెన్స్ ఫ్రంట్, హర్కత్ ఉల్ ముజాహిద్దీన్, హర్కత్ ఉల్ జిహాద్ అల్ ఇస్లామి, అల్ బదర్ తదితర సంస్థలు భారత్‌కు వ్యతిరేకంగా గతంలో క్రియాశీల పాత్ర పోషించాయి. ఇప్పుడూ అదే పంథాను కొనసాగిస్తున్నాయి. ప్రముఖ ఉగ్రవాద సంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆర్థికంగా ఆంక్షలు విధిస్తామని అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి రావడంతో పాకిస్తాన్ కొత్త మార్గాల్లో ఉగ్రవాదులను తయారు చేస్తోంది. వేర్వేరు పేర్లతో చిన్న సంస్థలను ఏర్పాటు చేయించి వాటికి ఆర్థిక, మౌలిక సహకారం అందిస్తున్నట్టు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. ఇందులో భాగంగానే షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను భారత్‌కు వ్యతిరేక అస్త్రంగా మార్చుకున్నట్టు దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్నాయి.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్‌లో అరాచకం సృష్టించాలని భారీ కుట్రలు పన్నిన ఎస్‌బీఎన్ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐకి అస్త్రంగా మారింది. సోషల్ మీడియా ఆపరేటర్ ముసుగులో షహజాద్ భట్టి ఒక నెట్‌వర్క్‌ను ప్రారంభించి భారత్‌లోని యువతను దేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు ప్రయత్నించినట్టు భద్రతాసంస్థల దర్యాప్తులో వెల్లడైంది. పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన షహజాద్ సోషల్ మీడియా వ్యాపారవేత్తగా, సేవాకార్యక్రమాలు నిర్వహించే వ్యక్తిగా, ఇస్లాం మత ప్రచారకుడిగా ఆ దేశంలో పరిచితుడయ్యాడు. అయితే అతనిపై గతంలో నేరారోపణలు కూడా నమోదైనట్టు పాకిస్తాన్ రికార్డులను ఉటంకిస్తూ కథనాలు వెలువడ్డాయి. దుబాయ్‌లో ఉన్న సమయంలో ‘333’ పేరుతో భారత్–పాక్ సంబంధాలు, ఇస్లాం మత విషయాలు, వివాదాస్పద అంశాలపై ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో వీడియోలు చేస్తూ యువతను ప్రభావితం చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇదే

# ఉగ్రకుట్రలు

సమయంలో అతనికి ఐఎస్ఐ నుంచి సహకారం అందినట్టు భారత భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి.

ఎస్‌బీఎన్ సంస్థ ప్రధానంగా ఢిల్లీ, పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో సోషల్ మీడియా నెట్‌వర్క్‌ను విస్తరించినట్టు దర్యాప్తులో తేలింది. వీరి ఏజెంట్లు దేశవ్యాప్తంగా వందలాది మొబైల్ నంబర్లు, సోషల్‌మీడియా ఖాతాలను ట్రాక్‌చేస్తూ వివాదాస్పద వీడియోలను ప్రసారం చేసినట్టు అధికారులు గుర్తించారు. తహ్రీక్ తాలిబన్ హిందుస్తాన్ వంటి నిషేధిత సంస్థలతో సంబంధాలు పెట్టుకుని భారత్‌లోని పోలీసు అధికారులపై దాడులు చేయాలనే లక్ష్యంతో పనిచేసినట్టు భద్రతా సంస్థల విచారణలో వెల్లడైంది.

ఆగస్టు 12న 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో 253మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై 80కిపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భద్రతా సంస్థల దాడుల్లో గ్రెనేడ్లు, పిస్టళ్లు, లైవ్ కార్ట్రిడ్జ్‌లు, ఐఈడీలకు సంబంధించిన సామగ్రి, సీసీ కెమెరాలు, ఇతర నిఘా పరికరాలు లభించాయి. కొన్ని గ్రెనేడ్లపై పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్నట్లు అధికారులు గుర్తించారు.

దేశంలో ఎక్కడ ఉగ్రవాద ఘటనలు, వార్తలు బయటపడినా వాటి మూలాలు హైదరాబాద్‌లో ఉండడం కూడా తెలుగు రాష్ట్రాలకు హెచ్చరికే. ప్రధాన మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్ ఉగ్రవాద నెట్‌వర్క్‌లకు అతీతం కాదని గత కొన్నేళ్ల పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో ప్రత్యేక రాజకీయ పరిస్థితులు కూడా ఉగ్రవాదులకు అనుకూలంగా మారుతున్నాయి. 2025లో హైదరాబాద్‌లో ఐఎస్ఐఎస్‌తో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న మాడ్యూల్ పేలుడు కుట్రను భద్రతా సంస్థలు భగ్నం చేశాయి. 2016లో పాతబస్తీలో నిర్వహించిన దాడుల్లో ఐఎస్ఐతో సంబంధాలున్న మాడ్యూల్‌కు చెందిన పలువురిని అదుపులోకి తీసుకుని ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీకి సంబంధించిన సామగ్రి, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. యువతను ఆన్‌లైన్ ద్వారా ప్రభావితం చేసి ఉగ్రవాద కార్యకలాపాల వైపు మళ్లించే ప్రయత్నాలు అప్పట్లోనే వెలుగులోకి వచ్చాయి. 2025 నవంబర్‌లో హైదరాబాద్‌లో ఒక వైద్యుడు రైసిన్ అనే విషపూరిత సైనైడ్‌ను తయారు దేశ వ్యాప్తంగా హిందూ దేవాలయాల్లోని ప్రసాదాల్లో కలపాలనే ప్రణాళికలు రూపొందించగా పోలీసులు భగ్నం చేయడంతో పెద్ద ముప్పు తప్పింది.

అలాగే హైదరాబాద్ కేంద్రంగా హిజ్బుత్ తహ్రీర్ (హెచ్‌యూటీ) నెట్‌వర్క్‌పైనా జాతీయ దర్యాప్తు సంస్థ చర్యలు చేపట్టింది. యువతను రహస్యంగా రిక్రూట్ చేసి తీవ్రవాద భావజాలం వైపు మళ్లించేందుకు ప్రయత్నాలు జరిగినట్టు దర్యాప్తులో తేలింది. ఇటీవల హైదరాబాద్‌లో భట్టి నెట్‌వర్క్‌తో సంబంధాలపై అనుమానాలతో ఒక యువకుడి అరెస్టు ఘటన కూడా ఈ కొత్త తరహా ఉగ్ర నెట్‌వర్క్‌లపై ఆందోళనను పెంచింది. సోషల్‌మీడియా ద్వారా పాక్‌కు చెందిన వ్యక్తులతో సంబంధాలు ఏర్పరచుకున్నట్టు, ఆయుధాల సమీకరణకు ప్రయత్నించినట్టు పోలీసులు ఆరోపించారు.

ఉగ్రవాదుల దాడులప్పుడు స్పందించడం మాత్రమే కాకుండా దేశంలో భద్రతావ్యవస్థ చేపట్టిన చర్యల ఫలితంగా ఉగ్రవాద ఘటనల్లో గణనీయమైన తగ్గుదల నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం గణాంకాలు చెబుతున్నాయి.

2004-2014 మధ్య 7,217 ఉగ్రవాద ఘటనలు నమోదుకాగా.. 2014-2024 మధ్య వాటి సంఖ్య 2,242కు తగ్గింది. ఇదే సమయంలో ఉగ్రవాద హింసలో మొత్తం మరణాలు 70శాతం, పౌరుల మరణాలు 81 శాతం, భద్రతా సిబ్బంది మరణాలు 50 శాతం తగ్గినట్లు కేంద్ర ప్రభుత్వం గణాంకాలు పేర్కొంటున్నాయి. నిత్యం ఉద్రిక్త పరిస్థితులు ఉండే జమ్మూకశ్మీర్‌లోనూ మార్పు కనిపిస్తోంది. 2018లో 228గా ఉన్న ఉగ్రవాద ఘటనలు 2025లో 12కి తగ్గినట్లు కేంద్ర గణాంకాలు పేర్కొంటున్నాయి.

అయితే గణాంకాలు తగ్గుతున్నాయన్న కారణంతో ఉగ్రవాదం ముప్పు పూర్తిగా తొలగిపోయిందని భావించడం ప్రమాదకరం. ఉగ్రవాద సంస్థలు తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. ఒకప్పుడు సరిహద్దు దాటి ఆయుధాలతో వచ్చే ఉగ్రవాదుల స్థానంలో ఇప్పుడు స్థానిక యువతను ఆకర్షించడం, ఆన్‌లైన్ ర్యాడికలైజేషన్, డ్రోన్ల ద్వారా ఆయుధాల సరఫరా, క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకోవడం, సోషల్ మీడియా ద్వారా రిక్రూట్‌మెంట్, స్లీపర్ సెల్స్ ఏర్పాటు వంటి పద్ధతులు పెరుగుతున్నాయి. ఉగ్రవాదానికి సరిహద్దు అవతల నుంచి మద్దతు ఉంటే కేవలం సరిహద్దు భద్రతను పెంచడం సరిపోదు. నిధుల ప్రవాహాన్ని అడ్డుకోవడం, ఆయుధాల సరఫరాను నిలిపివేయడం, సోషల్ మీడియా నెట్‌వర్క్‌లను పర్యవేక్షించడం, నకిలీ పత్రాలు, హవాలా మార్గాలను ఛేదించడం, సైబర్ నిఘాను బలోపేతంచేయడం, రాష్ట్ర, కేంద్ర దర్యాప్తు సంస్థల మధ్య సమాచారాన్ని వేగంగా పంచుకోవడం వంటి చర్యలు సమాంతరంగా సాగాలి. ఇందుకు తాజాగా బయటపడిన షహజాద్ భట్టి నెట్‌వర్క్ ఒక ముఖ్యమైన ఉదాహరణ. 14రాష్ట్రాల్లో వారి నెట్‌వర్క్ విస్తరించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

ముంబై 26/11 నుంచి పుల్వామా, పహల్గామ్ వరకు జరిగిన దాడులు ఒకే విషయాన్ని చెబుతున్నాయి. ఉగ్రవాదంపై పోరాటంలో ఒక విషయం ఎప్పటికీ మర్చిపోకూడదు. ఉగ్రదాడి జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడం కంటే దాడికి ముందే కుట్రను గుర్తించి, దాని వెనుక ఉన్న హ్యాండ్లర్‌ను, నిధుల మార్గాన్ని, ఆయుధాల సరఫరాను, సోషల్ మీడియా నెట్‌వర్క్‌ను, స్లీపర్ సెల్స్‌ను ఛేదించడమే అసలైన విజయం. ఆ దిశగా దేశ భద్రతా వ్యవస్థలు సాధిస్తున్న విజయాలు ప్రజలకు కనిపించకపోయినా వాటి ఫలితంగానే ఎన్నో కుటుంబాలు విషాదాన్ని చూడకుండా నివారిస్తున్నాయి.

ఉరీ, బాలాకోట్, ఆపరేషన్ సిందూర్ వంటి పరిణామాలు భారత్ ఇక ఉగ్రవాదాన్ని కేవలం ఖండనలతో ఎదుర్కొనే దేశం కాదనే సందేశాన్ని ఇచ్చాయి. అదే సమయంలో హైదరాబాద్‌లో వెలుగుచూస్తున్న చిన్నచిన్న మాడ్యూళ్లు మరో హెచ్చరికను ఇస్తున్నాయి. సరిహద్దు దాటి వచ్చే ఉగ్రవాదంతో పాటు సైబర్ ప్రపంచం ద్వారా దేశంలోకి చొరబడే ఉగ్రవాద భావజాలాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.

దేశ భద్రత అనేది కేవలం సైనికుల బాధ్యత కాదు. కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థల సమన్వయం, సైబర్ నిఘా, ఉగ్రవాద నిధుల నియంత్రణ, డ్రోన్లు, హవాలా నెట్‌వర్క్‌లపై నిఘా, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజల అప్రమత్తత.. ఇవన్నీ కలిసినప్పుడే ఉగ్రవాదాన్ని మూలాలు సహా నిర్మూలించడం సాధ్యమవుతుంది.

ఉగ్రవాదం రూపం మారవచ్చు.. దాని లక్ష్యం మాత్రం ఒక్కటే. దేశంలో భయాన్ని సృష్టించడం, దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడం. అందుకే ఉగ్రవాదంపై పోరాటం కూడా కాలానుగుణంగా మరింత ఆధునికంగా, మరింత సమన్వయంతో, మరింత కఠినంగా సాగాలి. స్వాతంత్ర్యం సాధించడం ఎంత గొప్ప విజయమో.. దాన్ని కాపాడుకోవడం అంతకంటే గొప్ప బాధ్యత.

– శ్రీపాద

# కాంగ్రెస్‌లో కుమ్ము

**అధికారంలోకి వచ్చి రెండేళ్లున్నరేళ్లు దాటినా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఏ మాత్రం తగ్గడం లేదు. సీనియర్ నేతల మధ్య వర్గపోరు, పార్టీ అధిష్ఠానంపై బహిరంగ విమర్శలు, నాయ కుల మధ్య ఆధిపత్య పోరు రోజురోజుకూ ముదురుతున్నాయి. గడిచిన కొద్ది నెలలుగా వరుసగా నెలకొంటున్న వివాదాలు, వాటిపై టీపీసీసీ క్రమశిక్షణ చర్యల కమిటీ జారీ చేస్తున్న షోకాజ్ నోటీసులు పార్టీ శ్రేణుల్లో అయోమయం సృష్టిస్తున్నాయి. హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి సస్పెన్షన్ నుంచి మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి, రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి వరకూ వరుసగా నోటీసులు అందుకుంటున్న నేతల జాబితా పెరుగుతూనే ఉంది. మరోవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పదేపదే పార్టీపై విమర్శలు గుప్పిస్తున్నా ఆయనపై మాత్రం ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ విస్తృతంగా చర్చ జరుగుతోంది.**

ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి తండ్రి జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని పార్టీ అధిష్ఠానం సస్పెండ్ చేయడంతో అక్కడ పార్టీలో వర్గపోరు బహిరంగమైంది. యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా సీనియర్ బీసీ నేత ఈశ్వరమ్మ యాదవ్‌కు అవకాశం లభించడంతో.. ఆమెపై సోషల్ మీడియాలో కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. ఈ వివాదానికి ఆ పరిణామాలే నేపథ్యంగా నిలిచాయి. బలమైన అనుచరవర్గం ఉన్న ప్రభాకర్‌రెడ్డిని సస్పెండ్ చేయడంపై ఆయన మద్దతుదారులు తీవ్రంగా స్పందించారు. మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌పై ఆరోపణలు గుప్పిస్తూ 'సేవ్ ఎల్బీనగర్ కాంగ్రెస్' పేరుతో గాంధీభవన్ మెట్ల వద్ద నిరసనలు కూడా చేపట్టారు. మరోవైపు, ఈశ్వరమ్మపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీసీ సంఘాల నేతలు, ఆమె మద్దతుదారులు ప్రభాకర్‌రెడ్డి, శివచరణ్‌రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం చేసి రోడ్డెక్కారు. తండ్రి సస్పెన్షన్ వ్యవహారంతోపాటు, ఒక మహిళా నేత పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలపై శివచరణ్‌రెడ్డికి కూడా జాతీయ యూత్ కాంగ్రెస్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

**సురేఖకు కూతురి వ్యాఖ్యల గండం**

మంత్రి కొండా సురేఖ అంశం అత్యంత చర్చనీయాంశంగా మారింది. వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైనా, పార్టీపైనా చేసిన తీవ్ర వ్యాఖ్యలు దుమారం రేపాయి. పరకాల నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి టికెట్ ఖరారు చేస్తున్నట్లు సీఎం రేవంత్ చేసిన ప్రకటనపై అసంతృప్తితో సుస్మిత ఈ వ్యాఖ్యలు చేసినట్టు స్పష్టంగా అర్థమవుతోంది. తాను కేవలం రేవంత్‌రెడ్డిని మాత్రమే లక్ష్యంగా



కొండా సురేఖ



సుస్మిత

చేసుకున్నానని, పార్టీని కాదని సుస్మిత తర్వాత వివరణ ఇచ్చినా, వివాదం చల్లారలేదు. దీనిపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ఆ నోటీసుపై స్పందించిన సురేఖ, తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమైనవని, కుటుంబ బాంధవ్యం కారణంగా ఒకరి మాటలకు మరొకరిని బాధ్యులను చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమంటూ కమిటీ చైర్మన్‌కు లేఖ పంపారు. పార్టీ నాయకత్వంపైనా, క్రమశిక్షణ నియమావళిపై తనకు పూర్తి గౌరవం ఉందని పేర్కొంటూనే, తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీని కోరారు. అయితే వివాదం ఇక్కడితో ఆగలేదు. తనపై, తన కుటుంబ సభ్యులపై కొందరు నేతలు ఒక పద్ధతిగా దాడి చేస్తున్నారని, దీని వెనుక అదృశ్య హస్తం ఉందని ఆరోపిస్తూ ఆమె మరో లేఖ రాశారు. తనపై విమర్శలు చేస్తున్నవారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ బీసీ మహిళా నేతగా తనపై నిత్యం మాటల దాడి జరుగుతున్నా పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు.

ఈ వ్యవహారం కేవలం నోటీసులు, వివరణలతోనే ఆగలేదు. కొందరు నేతల వ్యవహార శైలితో మరింత ముదిరింది. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమై, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కొండా దంపతుల వైఖరి, అధికారులపై పెత్తనం, ఇతర నియోజకవర్గాల వ్యవహారాల్లో జోక్యం వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని వారు ఏఐసీసీకి నివేదించనున్నట్లు తెలుస్తోంది.

ఈ పరిణామం రాజకీయంగా మరో కోణాన్ని కూడా తెరపైకి తెచ్చింది. సుస్మితకు ఏ పార్టీ పదవి, హోదా లేకపోయినా ఆమె వ్యాఖ్యలకు తల్లి అయిన మంత్రికి నోటీసులు ఇవ్వడాన్ని కొందరు తప్పుపడుతున్నారు. సీనియర్ బీసీ నేత సురేఖను అగ్రవర్ణాలకు చెందిన నేతలు ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆమెకు మద్దతుగా కొందరు ఓబీసీ నేతలు రంగంలోకి దిగి, అగ్రకుల నేతలపై విమర్శలు గుప్పించడం ఈ వివాదానికి కుల కోణాన్ని జోడించింది. దీంతో పార్టీలో అంతర్గత పోరు కాస్తా బీసీ వర్సెస్ అగ్రవర్ణాల చర్చగా మారింది.

ఈ పరిణామాల నేపథ్యంలోనే కొండా సురేఖ బెంగళూరు వెళ్లి.. పార్టీ జాతీయ అధ్యక్షుడు

# లాట

మల్లికార్జున ఖర్గేను కలిశారు. ప్రస్తుత పరిణామాలపై వివరణ ఇచ్చారు.

**చిన్నారెడ్డికీ తప్పని అసంతృప్తి**

ఇంకోవైపు.. తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డి వ్యవహారం కూడా పార్టీలో చర్చనీయాంశంగా మారింది. వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు కారణంగానే తనకు టికెట్ దక్కలేదని ఆరోపించడంతో పాటు పార్టీ అధిష్ఠానంపైనా, సీఎం రేవంత్‌రెడ్డిపైనా, స్థానిక ఎమ్మెల్యేపైనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనకు టికెట్



చిన్నారెడ్డి

ఇవ్వాలని అప్పటి పార్టీ అధినేత్రి సోనియా గాంధీ స్వయంగా రేవంత్‌రెడ్డికి సూచించినా, డబ్బు ఆశతో టికెట్ ఇవ్వలేదని ఆరోపించారు. తనను భరిస్తున్నందుకే ఇంకా పార్టీలో ఉన్నానని, లేదంటే మరో జీవన్‌రెడ్డి అయ్యేవాడినని హెచ్చరిక ధోరణిలో మాట్లాడారు. పార్టీలో 'తప్పుడు గాళ్ల'ను తరిమి వేస్తామని కూడా వ్యాఖ్యానించారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు కూడా షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనికి సమాంతరంగా, చిన్నారెడ్డిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు నేరుగా ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో చిన్నారెడ్డి అంశంపైనా పార్టీలో సందిగ్ధం నెలకొంది.

ఇక, తనకు ఇచ్చిన నోటీసుపై స్పందించిన చిన్నారెడ్డి, 1978 నుంచి తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానని, పార్టీకి ఎప్పుడూ బద్ధుడిగానే ఉన్నానని, ఏనాడూ పార్టీ గీత దాటలేదని లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. తాను ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, తన వివరణను పరిగణనలోకి తీసుకొని నోటీసును ఉపసంహరించాలని కమిటీని కోరారు. మరోవైపు, ఈ వ్యవహారంలో ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డిని కూడా క్రమశిక్షణ కమిటీ మళ్లీ పిలిచి వివరణ తీసుకోనున్నట్టు కమిటీ చైర్మన్ మల్లు రవి వెల్లడించారు.

**కోమటిరెడ్డి అంశంపై దుమారం**

రాష్ట్ర కాంగ్రెస్‌లో అసమ్మతి స్వరాలు వినిపిస్తున్న సీనియర్ నేతల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురించి ప్రముఖంగా చెప్పుకోవచ్చు. తనకు మంత్రి పదవి ఇస్తానన్న అధిష్ఠానం హామీ నెరవేరలేదని ఆయన పలుమార్లు బహిరంగంగా ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైనా అనేకసార్లు నేరుగానే విమర్శలు గుప్పించారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల ఆధిపత్యం పెరిగిందని, పాత కాంగ్రెస్ కార్యకర్తలు, నిజమైన నేతలు



మహేష్ గౌడ్

అణచివేతకు గురవుతున్నారని ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన హెచ్చరికలకు అంతే ఘాటుగా బదులిస్తూ, తాను పార్టీ గీత దాటలేదని, తన మాటలను రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లినా ఫర్వాలేదని సవాలు విసిరారు. చేరికల విషయంలో గతంలో బీఆర్ఎస్ చేసిన తప్పిదాన్నే కాంగ్రెస్ కూడా చేస్తోందని విమర్శించారు.

రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, వాటిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని టీపీసీసీ నేతలు హెచ్చరించినా, ఇప్పటివరకూ ఆయనకు ఎలాంటి షోకాజ్ నోటీసూ జారీ కాలేదు. దీనిపై పార్టీ వర్గాల్లోనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు కొండా సురేఖ కుమార్తెకు ఎలాంటి పదవి లేకున్నా ఆమె వ్యాఖ్యలకు తల్లికి నోటీసులు జారీ చేసిన పార్టీ, ఎమ్మెల్యేగా ఉంటూ పదేపదే పార్టీని, నాయకత్వాన్ని బహిరంగంగా విమర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డికి మాత్రం ఇంతవరకూ ఒక్క నోటీసు కూడా ఇవ్వకపోవడం, మంత్రి పదవిలో కొనసాగుతున్న ఆయన సోదరుడిని పార్టీ ప్రశ్నించకపోవడం ద్వంద్వ ప్రమాణాలుగా కొందరు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇది కూడా పార్టీలో బీసీ వర్సెస్ అగ్రవర్ణాల కోణంలో జరుగుతున్న చర్చకు మరింత ఆజ్యం పోస్తోంది.

కాగా, మరికొందరు నేతలు కూడా ఇటీవలి కాలంలో టీపీసీసీ క్రమశికణ కమిటీ నోటీసులు అందుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేటర్ ఇజ్జగిరి సంజయ్‌లకు నోటీసులు జారీ అయ్యాయి. ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలోనే నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం క్రమశిక్షణ ఉల్లంఘనగా పరిగణించారు. ఇక సీనియర్ నేత షబ్బీర్‌అలీకి కూడా గతంలో ఇదే కమిటీ నోటీసులు జారీ చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని, తమ వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్దొద్దని, ఎంతటి వారైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఊరుకోబోమని కమిటీ చైర్మన్ మల్లు రవి పలుమార్లు హెచ్చరించారు.

**ఇదీ పార్టీ ప్రతిష్ఠ**

సొంత పార్టీ నేతల బహిరంగ విమర్శలు, పరస్పర దూషణలు కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని ఏఐసీసీ తీవ్రంగా పరిగణిస్తున్నట్టు సమాచారం. అందుకే వరుసగా నోటీసుల పరంపర కొనసాగుతోందని రాజకీయవిశ్లేషకులు అంటున్నారు. అయితే, ఏ నేతపై ఎప్పుడు, ఎంత కఠినంగా చర్యలు తీసుకుంటారన్న దానిపై స్పష్టత లేకపోవడం, కొందరి విషయంలో వేగంగా స్పందిస్తూ, మరికొందరిని పట్టించుకోకపోవడం పార్టీలో అసంతృప్తికి కారణమవుతోంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాత్రం, పార్టీలో క్రమశిక్షణే ప్రధానమని, ఎంతటివారైనా హద్దులు దాటి మాట్లాడితే క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు ఉంటాయని సందర్భంవచ్చినప్పుడల్లా ఖదీ హెచ్చరిస్తున్నారు. మొత్తంగాచూస్తే, ఈ వివాదాల పరంపర బీసీ వర్సెస్ అగ్రవర్ణాల చర్చగా మారింది. మరోవైపు.. రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. హైదరాబాద్ మహానగరపాలక సంస్థకు ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. సొంత పార్టీ నేతల రాజకీయ సవాళ్లు, నోటీసుల నేపథ్యంలో ఈ అంతర్గత కుమ్ము లాటలను ఎలా చక్కదిద్దుకుంటుం దన్నది తెలంగాణ కాంగ్రెస్ అధిష్ఠానం ముందున్న అతిపెద్ద సవాలుగా చెప్పుకోవచ్చు.

**సుజాత గోపగోని**

**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**



# 'వికసిత భారత్'కు యు

**విశాఖపట్నంలో ఆగస్టు 18, 2026న జరిగిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా పాల్గొని చేసిన ప్రసంగం పార్టీ శ్రేణులకు ఒక స్పష్టమైన దిశానిర్దేశాన్ని, నూతనోత్సాహాన్ని కలిగించింది. ప్రసంగం రాజకీయాలకు సంబంధించినది మాత్రమే కాకుండా, పార్టీ భవిష్యత్ కార్యాచరణకు, సైద్ధాంతిక నిబద్ధతకు స్పష్టమైన మార్గదర్శిగా నిలిచింది. పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర అభివృద్ధి, యువతపాత్ర, క్షేత్రస్థాయి వ్యూహాలు తదితర కీలక అంశాలను తమ ప్రసంగంలో స్పృశించారు. తిరుమల వేంకటేశ్వర స్వామి, సింహాచలం నరసింహస్వామిలకు ప్రణామాలు అర్పిస్తూ, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల త్యాగాలను స్మరిస్తూ ప్రసంగాన్ని ప్రారంభించారు.**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేవలం అధికార దాహంతో కాక 'దేశం ముందు' (నేషన్ ఫస్ట్) అనే జాతీయవాద భావనతో ఆవిర్భవించిందని పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పునరుద్ఘాటించారు. 2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణంలో కార్యకర్తలే అత్యున్నత సేనాపతులని, వికసిత భారత్ సాధనకు యువతే చుక్కాని అని అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జాతీయవాదం, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 'అంత్యోదయ', అటల్ బిహారీ వాజ్‌పేయి సుపరిపాలన...అనే మూడు మూలస్తంభాలపై నేడు ప్రధాని మోదీ నాయకత్వంలో పార్టీ నడుస్తోందని విశ్లేషించారు. పార్టీ సైద్ధాంతికతను ప్రస్తావిస్తూ, పార్టీలో కష్టించే కార్యకర్తలకు, వారసత్వ రాజకీయాలకు భిన్నంగా అత్యున్నత గుర్తింపు ఉంటుందనే బలమైన సందేశాన్ని శ్రేణులకు పంపారు. సామాన్య కార్యకర్తగా పార్టీ ప్రచారాన్ని గోడల మీద రాసిన వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదగడాన్ని ఉదహరించారు.

**డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ప్రగతిబాట**

2024 ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సాధించిన చారిత్రక విజయాన్ని (21 ఎంపీ, 164 ఎమ్మెల్యే స్థానాలు) ప్రస్తావిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కలయికను నితిన్ నబిన్ 'డబుల్ ఇంజిన్ సర్కార్'గా అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల భాగస్వామ్యంతో రాష్ట్రంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసే మోదీ ప్రభుత్వ విధానాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అమరావతి పునర్నిర్మాణానికి భారీ ప్యాకేజీ, భోగాపురం విమానాశ్రయం, రాయ్‌పూర్–విశాఖ ఎక్స్‌ప్రెస్‌వే, పుట్టపర్తిలో 5వ తరం స్టెల్త్ ఫైటర్ జెట్ టెస్టింగ్ సెంటర్ వంటి కేంద్ర ప్రభుత్వ భారీ ప్రాజెక్టులు, కేంద్రానికి రాష్ట్రం పట్ల గల చిత్త శుద్ధికి నిదర్శనమని విశ్లేషించారు.

**యువ సాధికారతతో నవభారతం**

'దేశ భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉంది. ఎన్డీఏ ప్రభుత్వం మౌలిక సదుపాయాల బడ్జెట్‌ను రూ. 2 లక్షల కోట్ల నుంచి రూ. 8 లక్షల కోట్లకు పెంచింది. సెమీకండక్టర్, ఐటీ రంగాల్లో దేశం పురోగతి సాధిస్తోంది. ఒకప్పుడు కశ్మీర్‌లో రాళ్లు రువ్వే యువత, నేడు 'ఖేలో ఇండియా' ద్వారా దేశానికి పతకాలు సాధించడం వారిలో వచ్చిన గుణాత్మక మార్పునకు అద్దం పడుతోంది. యువత కేవలం ఉద్యోగార్థులుగా మిగిలిపోకుండా స్టార్టప్‌లు, యూనికార్న్‌ల ద్వారా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడం ప్రశంసనీయం. సామాజిక మాధ్యమాలలో చురుకుగా ఉంటున్న యువత వద్దకు నాయకులు వెళ్లి, వారి ఆకాంక్షలను అర్థం చేసుకోవాలి' అని సూచించారు.

**తీరు మారని విపక్షాలు**

ప్రతిపక్ష కాంగ్రెస్ వైఖరిని నబిన్ తీవ్రంగా తప్పుబడుతూ, కేంద్ర ప్రభుత్వం, 'దేశం ముందు' అనే నినాదంతో పనిచేస్తుంటే, కాంగ్రెస్ సహా విపక్షాలు 'స్వార్థం ముందు...దేశం చివర' అనే రీతిలో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కశ్మీర్‌లోని లాల్‌చౌక్‌లో త్రివర్ణ పతాకం ఎగరడం ప్రతిపక్షాలకు కంటగింపుగా మారిందని, కశ్మీర్ అభివృద్ధిని ఓర్వలేకపోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రతికూల వ్యాఖ్యలకు కార్య కర్తలు గట్టి సమాధానం చెబుతారని హెచ్చరించారు. జాతీయవాద విధానాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల్లో గెలవడం మాత్రమే ముఖ్యం కాదని, నిస్వార్థ ప్రజాసేవ ద్వారా బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడమే అసలైన కర్తవ్యమని దిశానిర్దేశం చేశారు.

అధికారం దక్కించుకోవడం కన్నా ప్రజలకు సేవ చేస్తూ సంస్థను బలోపేతం చేసుకోవడమే అసలైన కర్తవ్యమని, 'వికసిత భారత్', 'వికసిత ఆంధ్రప్రదేశ్' లక్ష్యాల సాధనకు బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గొలుసుకట్టుగా పనిచేయాలని





# వతే చుక్కాని

నితిన్ నబిన్ పిలుపునిచ్చారు. పార్ట్ టైమ్ నాయకుల విమర్శలను తిప్పికొడుతూ, ఫుల్ టైమ్ కార్యకర్తలుగా కేంద్ర పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని ఉద్బోధించారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే, కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, క్షేత్రస్థాయిలో పార్టీని తిరుగులేని సామాజిక, రాజకీయ శక్తిగా మలచుకోవాలని అన్నారు.

**సేవతోనే రాజకీయం**

పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రసంగం 'ప్రతి గ్రామంలో కమలం వికసించాలి' అనే ప్రధాన లక్ష్యంతో సాగింది. పార్టీ కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా,'దేశం ముందు, పార్టీ తర్వాత, వ్యక్తి చివర' అనే సిద్ధాంతంతో పనిచేస్తుందని అన్నారు. కేంద్ర నిధులతో (14, 15వ ఆర్థిక సంఘాల ద్వారా) గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని (రోడ్లు, మరుగుదొడ్లు, తాగునీరు) ప్రస్తావిస్తూ, ప్రతి



గ్రామంలో 'మన ఊరు-మన జెండా' పేరుతో పార్టీ పతాకం ఎగరాలని పిలుపునిచ్చారు. రాబోయే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమితో కలిసి పోటీ చేస్తూనే, వార్డు మెంబర్ స్థాయి నుంచి మేయర్ స్థానం వరకు ప్రతి చోటా పార్టీ అభ్యర్థులు గెలిచేలా క్షేత్రస్థాయి పునాదులు బలోపేతం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ప్రగతిని ఆయన సోదాహరణంగా వివరిస్తూ, 'దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు మంజూరైన కేంద్ర నిధుల్లో 25 శాతం రాష్ట్రానికి దక్కాయి. రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోంది. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ చొరవతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ11,414 కోట్ల పునరుద్ధరణ ప్యాకేజీ అందించడంతో అది లాభాల బాట పట్టింది. సౌత్ కోస్ట్ రైల్వే జోన్, గూగుల్ డేటా సెంటర్, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ లాంటి ప్రాజెక్టులతో విశాఖ ఆర్థిక కేంద్రంగా మారుతోంది. పోలవరం ద్వారా ఉత్తరాంధ్ర, రాయలసీమలకు త్వరలోనే జలాలు అందుతాయి. ప్రజా సమస్యలను వేగంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించ డానికి మండల స్థాయిలో 'జనతా దర్బార్'లు నిర్వహించాలి. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి నెల రోజుల పాటు రక్తదానం, వైద్య శిబిరాలు లాంటి భారీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం. 'సర్వ స్పర్శ' ఆలోచనతో ఎస్సీ, ఎస్టీ, చేనేత, నాయీ బ్రాహ్మణ, రజక వర్గాలతో పాటు కల్లుగీత కార్మికుల కోసం 'తాటిచెట్టు కల్పవృక్షం' పేరుతో తీర్మానం చేసి అన్ని సామాజిక వర్గాలకు పార్టీ అండగా నిలుస్తుంది' అని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై నుంచి ప్రకటించిన 'సప్తపది' కార్యాచరణ 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యానికి బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

47 ఏళ్లకే జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబిన్‌కు స్వాగతం పలుకుతూ, ఆయన నాయకత్వ లక్షణాలను కొనియాడారు. రాష్ట్రానికి చెందిన పురందేశ్వరి, రామ్‌మాధవ్‌లకు పార్టీ జాతీయ ఉపాధ్యక్ష పదవులు దక్కడం రాష్ట్ర కార్యకర్తలందరికీ గర్వకారణమని మాధవ్ అన్నారు.

అత్యంత వైభవంగా జరిగిన బీజేపీ రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా, పార్టీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో జరిగిన ఈ మహా సమావేశానికి, జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, జాతీయ సహ సంఘటనా మంత్రి శివప్రకాష్ వంటి ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపారు. కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేష్, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, ఆర్‌కృష్ణయ్య, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మోర్చాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మండలాల అధ్యక్షులు హాజరయ్యారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బలిదానాలతో ఎదిగిన ఈ పార్టీ, 'దేశం ముందు, పార్టీ తర్వాత, మనం చివర' అనే నిస్వార్థ సిద్ధాంతాన్ని పునాదిగా చేసుకుని, 2047 నాటికి దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపి, "వికసిత భారత్"గా మార్చాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్య సాధనకు ఈ సమావేశం బలమైన దిశానిర్దేశం చేసింది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో పూర్తిగా దేశీయంగా తయారైన ఆయుధాలతో ఎర్రకోటపై స్వాతంత్ర్య దినోత్సవ గౌరవ వందనం సమర్పించడం, మోదీ ప్రకటించిన 'సప్తపది' కార్యక్రమాలు దేశ స్వావలంబనకు గీటురాళ్లని నాయకులు కొనియాడారు.

దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా బీజేపీకి మేయర్ స్థానాన్ని అందించిన విశాఖ గడ్డ, నేడు ఈస్టర్న్ నేవల్ కమాండ్‌తో రక్షణ పరంగానూ, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఆర్సెలర్ మిట్టల్, గూగుల్ డేటా సెంటర్ల రాకతో ఆర్థిక రాజధానిగా వేగంగా అభివృద్ధి చెందుతున్న తీరును జిల్లా అధ్యక్షులు పరశు రామరాజు తమ స్వాగత ఉపన్యాసంలో వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మిగిలిన రాష్ట్రాల కంటే 25 శాతం అదనంగా రాష్ట్రానికి రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు రావటం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగడంపై ధన్యవాదాలు చెబుతూ తీర్మానం చేశారు. రాష్ట్రంలో జలవనరుల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయటం, పోలవరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి భద్రత కల్పించటంపై రెండో తీర్మానం చేశారు. రాష్ట్రంలో ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో మృతిచెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

# బంధాలను కాపాడే

సమాజంలో ప్రాథమిక యూనిట్ కుటుంబం. అది సవ్యంగా నడవకపోతే, సమాజం అల్లకల్లోలమైపోతుంది. విచ్ఛిన్నమైపోతుంది. కుటుంబపు నాలుగు గోడల మధ్య ఉండవలసిన విషయాలు మోడర్నిటీ పేరుతో సోషల్ మీడియా వరకూ చేరడం, కలహాలు పరాకాష్టకు చేరడం నిత్యం చూస్తున్నాం. సరైన కుటుంబ మార్గదర్శనం లేని యువత సోషల్ మీడియా వ్యామోహంలో పడి తమ వ్యక్తిగత జీవితాన్ని బయటపెట్టుకొని, సమాజ అవహేళనకు గురై మతిస్థిమితం కూడా తప్పే పరిస్థితికి చేరుకుంటున్న ఘటనలు ఉన్నాయి.

ముఖ్యంగా వివాహిత జంటల మధ్య విభేదాలు రావడానికి కారణం కేవలం మోసం, హింస, ప్రేమలేమి మాత్రమే కాదు, కొన్ని సందర్భాల్లో వారి మధ్య విషయాలు బహిరంగమై ఇతరుల జోక్యం ఎక్కువ కావడమే. ఇటీవలే యూపీలో చోటు చేసుకున్న ఒక కేసులో అత్తగారు(గిరిబాల) తన కుమారుడి జీవితంలో అతిగా జోక్యం చేసుకోవడం, చివరికి కోడలి హత్య/ ఆత్మహత్యకు దారి తీసింది. కొందరు అత్తగారు కుటుంబంలో భాగమని వాదించ వచ్చు. కానీ, ఇక్కడ ప్రాథమికంగా పరిశీలించాల్సిన ప్రశ్నలు వివాహంలో హద్దులు అంటే ఏమిటి? ఒక బంధాన్ని గౌరవించడం అంటే ఏమిటి? అన్నవి.

నిజానికి ఆధునిక కుటుంబాలలో వస్తున్న సమస్యలు కేవలం కుటుంబ స్థాయిలోనే కాదు, సమాజ స్థాయిలో ఆందోళన కలిగించేలా మారుతున్నాయి. భారతీయ వైవాహిక వ్యవస్థలో వివాహం అంటే కేవలం ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన బంధమే కాదు, ఇరు కుటుంబాల మధ్యది. ఈ క్రమంలో, ఆడపిల్ల ప్రతి విషయాన్నీ తన తల్లితో పంచుకుంటే, అబ్బాయి తన తల్లితో పంచుకుంటున్నాడు. ఇందులో ఎవరి తప్పూ లేదు. ఇరువైపు తల్లిదండ్రులూ తమ పిల్లల యోగక్షేమాలు తెలుసుకోవాలనుకుంటారు. పిల్లలు కూడా వారు తమను పెంచినవారికి అన్నీ చెప్తుంటారు. దీనికారణంగా, భార్యా,భర్తల మధ్య గోప్యంగా ఉండవలసిన విషయాలు బయటకు వెడతాయి.

ఇటు పిల్లలు, తల్లిదండ్రులు కూడా ఇంటి విషయాలు బయటకు వెళ్లకూడదనే సంగతి విస్మరించారు. ఏదో ఒక భావోద్వేగంతో అక్కసుగా పంచుకున్న మాటలు వివాహబంధాన్నే విచ్ఛిన్నం చేయవచ్చు. ఇక సోషల్‌మీడియా వచ్చాక హద్దులేవి చెరిగిపోయాయి. అందులో తమ భాగస్వామిని అవమానిస్తూ పరోక్ష పోస్టులు పెట్టడం, వాట్సాప్ సందేశాలను ఇతరులకు చూపడం వంటివన్నీ కూడా దుష్ఫలి తాలనే ఇస్తున్నాయి. ముఖ్యంగా, తమ పిల్లల వివాహ జీవితాన్ని పూర్తిగా నియంత్రించాలని ప్రయత్నించే తల్లిదండ్రులతో పెద్ద సమస్య ఎదురవుతోంది. ఈ అతి జోక్యం చిన్న చిన్న విషయా లను కూడా రెండు కుటుంబాల మధ్య యుద్ధంలా మారుస్తోంది. ఇటీవల మీడియాలో వచ్చిన వార్తలు ఈ విషయాన్నే రుజువు చేస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు సర్దుబాటు గురించి చెప్పకుండా, వారి అసంపూర్ణ భావాలను ప్రోత్స హించడంతో, అది పలుసార్లు విడాకులు, మానసిక హింస, ఆత్మహత్యలు, హత్యలకు కూడా దారి తీస్తున్న సంగతి మనం చూస్తున్నాం.

తల్లిదండ్రులతో అన్నీ చెప్పుకోవడం మంచిదే. కానీ వారు సరైన దిశలో ఆ జంటకు మార్గదర్శనం చేయకపోతే, అది చివరికి ఇరువురి మధ్య అనుమానాలకు దారితీస్తుంది. తాను తన జీవిత భాగస్వామితో చెప్పిన మాటలు అవతలివారి తల్లిదండ్రులకు తెలుస్తుందేమోనన్న భావనతో తనలోనే దాచుకోవడంతో, ఇద్దరి మధ్య దూరం కూడా పెరుగుతుంది. నిజానికి తల్లిదండ్రులు కూడా పూర్తి పరిణితితో ప్రవర్తించడం లేదనిపిస్తుంది. తమ పిల్లల మీద ప్రేమతో విషయాలను తెలుసుకుని, పరిష్కరించే యత్నం చేస్తున్నామనుకుంటారే తప్ప వారి వ్యక్తిగత జీవితాల్ని తెలియకుండానే దూరం తీసుకువస్తున్నామని గ్రహించరు.

భార్యాభర్తల మధ్య వ్యక్తిగత జీవితం ప్రారంభ మయ్యేందుకు తోడ్పడే పాత్రను తల్లిదండ్రులు పోషించాలే తప్ప, వారి జీవితం బట్టబయలు చేసేది కాదు. ఇక స్నేహితుల విషయం చెప్పనవసరం లేదు. అడిగే వారికి ఎంత పరిణితి ఉంటుందో, చెప్పేవారికీ అంతే ఉంటోంది. కానీ, నేటితరానికి ప్రతి విషయాన్నీ స్నేహితులతో పంచుకోవడం పరిపాటిగా మారింది. అయితే, ఇద్దరు వ్యక్తుల మధ్య స్నేహం సవ్యంగా ఉన్నంతకాలం బానే ఉంటోంది, ఏదో ఒక సమస్య వచ్చినప్పుడు ఒకరి వ్యక్తిగత విషయాలను మరొకరు బయట పెట్టుకోవడంతో, అది కుటుంబం లోకి జొరపడి బంధాలను విచ్ఛిన్నం చేస్తోంది. మోసాలు, బ్లాక్‌మెయిళ్లు, ఆర్థిక దోపిడీ, వివాహేతర సంబంధాలు వంటి విషయాలన్నీ దాని పర్యవ సానమే.

ఒకప్పుడు దాంపత్యజీవితంలో విషయాలు ఆ దంపతుల మధ్యే ఉండేవి. కానీ, ఇప్పుడవి గ్రూప్

## మానవ సంబంధాల సంక్షోభం

ఇది సరిహద్దులు దాటిన సామాన్యుడి సమస్య. ఒకవైపు సాంకేతిక పురోగతి, వ్యక్తిగత స్వేచ్ఛ, ఆర్థిక అవకాశాలు పెరుగుతుంటే, మరోవైపు కుటుంబాలు విచ్ఛిన్నమై, మానవ సంబంధాలు బలహీనపడి, విలువలు ప్రశ్నార్థకంగా మారు తున్నాయి. ఈ పరిణామాలన్నీ చాపకింద నీరులా ప్రవేశించాయి. గత నాలుగు దశాబ్దాల కాలంలో ఈ మార్పుల కారణంగా మానవ జీవితం, కుటుంబం, సామాజిక వ్యవస్థల్లో అనేక మార్పులు వచ్చాయి. టీవీ రాకతో కుటుంబ నాలుగు గోడల మధ్య సమాజం ప్రవేశించగా, విద్య, ఉద్యోగాల కోసం పట్టణాలు, నగరాలు, విదేశాలలో స్థిరపడడంవంటి కారణాలు కుటుంబవ్యవస్థలో అనేక మార్పులు తెచ్చాయి.

ఒకనాడు వివాహం జీవితానికి పునాది, కుటుంబం ఒక ఆశ్రయం, పిల్లలే భవిష్యత్తు. కానీ నేడు వివాహం అవసరమా? పిల్లలను ఎందుకు కనాలి? కుటుంబ జీవితం బోరింగ్ కాదా? వంటి ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇవి వ్యక్తిగత ఎంపికలే అయినా, వాటి వెనుక ఉన్న సామాజిక, మానసిక కారణాలను విస్మరించ లేం. నేడు వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో వివాహేతర సంబంధాలు కూడా చెలామణి అవుతున్నాయి. భావోద్వేగ అసంతృప్తి, ఆకర్షణ లేకపోవడం, ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడమే ఇందుకు కారణమంటున్నారు కానీ ఇదే నిజమా? దీనిపై లోతైన పరిశీలన అవసరమా?

నేటి యువతలో ఎటువంటి కట్టుబాటు లేకుండా తక్షణ సంతృప్తిని అందించే కోరిక పెరుగుతోంది. నిజానికి, భార్యాభర్తల మధ్య ఆకర్షణ హఠాత్తుగా అదృశ్యం కాదు. కమ్యూనికేషన్ తగ్గినప్పుడు, చిన్న విషయాలను కూడా విస్మరించినప్పుడు ఆ సంబంధంలో ఒక శూన్యం ఏర్పడుతుంది. దీనిని భర్తీ చేసుకునేందుకు బయట వెదుకులాట మొదలవుతుంది. భార్యాభర్తల మధ్య ఆకర్షణ

# అజ్ఞాత రేఖ



డిస్కషన్లుగా మారుతున్నాయి. ఇక సోషల్ మీడియా, ఒకవైపు మనుషులను దగ్గర చేస్తున్నట్టు కనిపిస్తున్నప్పటికీ, వాస్తవ జీవితంలో వారిని దూరం చేస్తోంది. ఇది కుటుంబంలో పరాయీ కరణకు దారితీస్తోంది. భార్య లేదా భర్త ఏం చేసినా, ఎక్కడికి వెళ్లినా కుటుంబం కూడా సోషల్‌మీడియా ద్వారా తెలుసుకునే పరిస్థితి వస్తోంది. విషయం ఏమిటంటే, ఒకసారి బయటకు వెళ్లిన వ్యక్తిగత సమాచారం చిలువలుపలువలై, చర్చలై, సంబంధం లేనివారు కూడా వ్యాఖ్యానించే స్థాయికి వెళ్లి జీవితాంతం వెంటాడతాయి.

దంపతుల మధ్య ప్రేమ తగ్గితే తిరిగి పెరగవచ్చు, డబ్బుపోతే తిరిగి సంపాదించవచ్చు, కానీ విశ్వాసం లోపిస్తే మళ్లీ దాన్ని నిర్మించుకోవడం కష్టం. ఈ విశ్వాసహీనతకు పైన పేర్కొన్న కారణాలలో ఏదో ఒకటి ఉంటుంది. విశ్వాసంతో చెప్పిన ఒక మాట మూడవ వ్యక్తికి చేరడం చెప్పిన వారి మనసును విరిచేయవచ్చు. ఇద్దరి మధ్య దూరాన్ని పెంచి, అంతిమంగా విడిపోయేందుకు దారి తీయవచ్చు. ఈ క్రమంలోనే స్వేచ్ఛకు కూడా హద్దులు ఉంటాయనే విషయాన్ని తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలి. నిజమైన కష్టకాలంలో పిల్లలకు అండగా నిలబడడం తల్లిదండ్రుల బాధ్యత. కానీ, అవసరం లేని సమయంలో కూడా వారి విషయాలలో జోక్యం చేసుకుంటే, ఆ బంధం ఉక్కిరిబిక్కిరి అవుతుంది.

ఇద్దరి మధ్య ఏర్పడే సమస్యలను కాస్త ఓపికతో వ్యవహరించి వారు పరిష్కరించుకోవచ్చు. అందుకు తల్లిదండ్రుల జోక్యం అవసరంలేదు. ఇరువైపుల తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని తెలుసుకుని, తమ పిల్లలకు చెప్పాలి. తమ బంధాన్ని కాపాడుకునేందుకు భార్యాభర్తలు కొన్ని విషయాలను తెలుసుకొని, పాటించాలి. క్షణికావేశంలో బయటివారి ముందు జీవితభాగస్వామిని పల్చన చేయడం, చెడుగా మాట్లాడడం మానుకోవడం, ప్రతి సమస్యనూ తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లక పోవడం, స్నేహితుల సలహా తీసుకునేముందు, అవతలి వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం, సోషల్ మీడియాలో వ్యక్తిగత జీవితాన్ని ప్రదర్శించకపోవడం, ఆవేశం తగ్గిన తర్వాతే తమ మధ్య ఏర్పడిన సమస్యల గురించి మాట్లాడుకోవడం, నీకన్నా నేనే గొప్ప అన్న అహాన్ని పక్కనబెట్టడం, ఇవన్నీ కుదరనప్పుడు కుటుంబ కౌన్సిలింగ్‌కు వెళ్లడం ఉత్తమం.

వివాహం అనేది ఇద్దరు మనుషుల కలయికే కాదు, రెండు హృదయాల మధ్య నిర్మించుకునే విశ్వాసం. దీనికి ఆధారం ప్రేమ అయితే, ద్వారం గోప్యత. దానిని ఎప్పుడు తెరవాలో తెలుసుకోవాలి. నేటి దంపతులకు అవసరమైంది పరస్పర ప్రేమ మాత్రమే కాదు, ఏది బయటకు చెప్పాలి? ఏది తమ మధ్యే ఉంచుకోవాలి? అనే పరిపక్వత. ఎందుకంటే, బయటకు వెళ్లిన విషయాల వల్ల వివాహాలే కాదు జీవితాలు కూడా ధ్వంసం అవుతాయి.

తగ్గిందనే నమ్మకం కూడా ఈ మనస్తత్వంలో భాగమే. ఆకర్షణ కేవలం భౌతికం కాదన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. పరస్పర గౌరవం, స్నేహం, నమ్మకం, ఓపిక ఉన్నప్పుడు అది కొనసాగుతుంది. సోషల్ మీడియాలో కనిపించే జీవితమే నిజమని వ్యక్తులు నమ్మడంవల్ల విచక్షణను కోల్పోతున్నారు.

ఇతరులతో పోలికపెట్టి మాట్లాడడం అసంతృప్తికి దారితీసి, తప్పుడు నిర్ణయాలకు బీజాలుగా మారుతుంటాయి. చిన్న వాదనలు పెద్ద నిర్ణయాలకు దారి తీస్తున్నాయి. కాస్త ప్రశాంతతో పరిష్కరించుకోవలసిన చిన్న విషయాలు కూడా అహం కారణంగా విడాకులకు దారితీస్తోంది. నేడు మతం విభజనకు కారణమవుతోంది. ముఖ్యంగా మతాంతర వివాహాలలో చిన్న బేధాలు కూడా భార్యభర్తల మధ్య పెద్ద చీలికలకు దారితీస్తోంది.

నేడు సమాజంలో ప్రతివారికీ సులవైన జీవితం కావాలి. పని పట్ల ఆసక్తి తగ్గుతోంది. ఏం చేసి అయినా డబ్బు సంపాదించాలనే వ్యామోహం పెరుగుతోంది. ఇది యువత పక్కదారి పట్టేలా చేస్తోంది. తమ సుఖం కోసం, బాధ్యతలను తప్పించుకోవడం కోసం నేటి యువతలో అనేకమంది పిల్లలను వద్దనుకుని, కుక్కల్ని,పిల్లుల్ని పెంచు కుంటూ తృప్తి పడటం కూడా సులువైన జీవితం కోసమే.

ఈ క్రమంలో విలువలు, సంస్కృతి పాతపడుతున్నాయా? ఇవి అవసరమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ, ఇవే సామాజిక జీవితానికి పునాదులని వారికి తల్లిదండ్రులు చెప్పడం లేదు. ఆధునికత పేరుతో పిల్లలు వాటిని వదిలి పెట్టడాన్ని తల్లిదండ్రులు మౌనప్రేక్షకుల్లా చూస్తూ, వారిని సరిచేయకపోవడంతోనే సమస్య వస్తోంది. సంబంధాలు భారంగా అనిపించినప్పుడు వాటిని వదిలించు కోవడం సులువు, వాటిని సరిచేసుకునేందుకు సాహసం కావాలి. నేటి కాలంలో ఆ ధైర్యం అత్యంత అవసరం. మనస్తత్వ శాస్త్ర నిపుణులు, కుటుంబ సలహాదారులు, విద్యావేత్తలు, వివిధ రంగాలలో బాధ్యతాయుతమైన వ్యక్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర సామాజిక కార్యకర్తలు ఈ సమస్యను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేయాలి. ఇది ఒక సామాజిక సమస్య. సరిహద్దులు దాటిన సామాన్యుడి సమస్య.



**డా॥ జె.పి. భారతి కాజా**
ఫ్యామిలీ- స్టూడెంట్ కౌన్సిలర్

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

ఆ పిల్లల్లో కొందరు స్కూలుని తుడిస్తే మరో ఇద్దరు పిల్లలు నీళ్లు తెచ్చారు.ఆ సాయంత్రం కొండ దిగి అక్కడికి దగ్గర్లోని బీసుపురం వెళ్లి కొన్ని సామాన్లు కొనుక్కొన్నాను. ఆ ఊరు కొద్దిగా పెద్దది. అక్కడ కూరలు, కిరాణా సామాన్లు దొరుకుతాయి.

ఆ మర్నాటి నుంచి స్కూలుకి పిల్లలు రావడం మొదలు పెట్టారు. ఆ పిల్లల తల్లితండ్రులు ప్రతిరోజూ కూలిపనులకు, పొలం పనులకు వెళ్లిపోతుండటంతో సాయంత్రం వరకూ వాళ్లంతా స్కూల్లో ఉండాలి.

చాలా గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తుంటారు. విప్పసారాకు, మద్యానికి బానిసలు. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోరు.

వాళ్లు పండించే పంటలను దళారులే చాలా తక్కువ ధరకి కొని మోసం చేస్తుంటారు.

దళారుల, భూస్వాముల దోపిడీని అరికట్టి గిరిజనుల హక్కుల పరిరక్షణ పేరుతో పశ్చిమ బెంగాల్లోని నక్సల్‌బరీ ప్రాంతంలో నక్సల్ ఉద్యమం మొదలైంది. అనంతరం అది రెడ్ కారిడార్‌గా తమిళనాడు వరకు వ్యాప్తి చెందింది. తెలుగు నేలపై తూర్పు కనుమల ప్రాంతంలోని ఏజన్సీ గ్రామాల్లో నక్సల్స్ కదలికలు ఎక్కువ. అమాయకులైన గిరిజనులను దళారుల, వ్యాపారస్థుల, ధనవంతుల బారి నుంచి కాపాడేందుకు అక్కడ స్థావరాలు ఏర్పరచుకున్నారు.

గిరిజనులు నక్సలైట్లకు మద్దతు ఇస్తున్నారన్న అనుమానంతో పోలీసులు, తమ కదలికలను పోలీసులకు చేరవేస్తున్నారనీ నక్సలైట్లు.. ఇరుపక్షాలు గిరిజనులను హింస్తుంటాయి. మరోవంక పోలీసులు గిరిజనులను ఇన్ఫార్మర్లుగా చేసుకొనీ నక్సల్స్ స్థావరాలపై దాడులు చేసిన సంఘటనలు ఎన్నో... అలా ఆ ఏజన్సీ ప్రాంతమంతా రావణ కాష్టంలా మండిపోయేది.

ఆ సమయంలో నేను ఉపాధ్యాయుడిగా ఆ గ్రామం వెళ్లాను. నేను పనిచేస్తున్న కెంగువ తండాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(తొండంగి)లో గౌరి అమ్మాయి నర్సుగా, ఆమె చెల్లెలు ధరణి అంగన్‌వాడీ టీచరుగా పనిచేసేవారు.

గౌరి మొగుడు భీమన్న తాగుబోతు. ఏ పనీ చేసేవాడు కాదు. రెండేళ్ల క్రితం పోలీసులతో జరిగిన గొడవ, కాల్పుల్లో చనిపోయాడు. ధరణి భర్త సోమన్న ఇంటర్ చదివి ఒక కాంట్రాక్టర్ దగ్గర మేస్త్రీగా పనిచేసేవాడు. అతనికి పార్వతి అనే చెల్లెలుండేది.

పార్వతి ఒకరోజు కట్టెల కోసం అడవికి వెళ్లి వస్తోంది. ఆ ప్రాంతంలో నక్సల్స్ ఏరివేత కోసం ఏర్పాటైన పోలీసు అవుట్ పోస్ట్‌లో పనిచేస్తున్న మురళి అనే కానిస్టేబుల్ ఆమెను బలవంతంగా పోలీసు పోస్టులోకి లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు.





# ఏ వెలుగులకీ ప్రస్థానం?

4

పార్వతి తన అన్న సోమన్నకి ఈ ఘోరం గురించి చెప్పి అర్ధరాత్రి చెట్టుకి ఉరివేసుకొని చనిపోయింది.

దాంతో సోమన్న పోలీసుల మీద రగిలి పోయాడు. ఆ దారుణం గురించి ఊళ్లో తన చుట్టాలకు, స్నేహితులకు చెప్పాడు. పాతికమంది యువకులతో పోలీస్ అవుట్ పోస్ట్ మీద దాడిచేసి కానిస్టేబుల్ మురళిని కర్రలతో కొట్టి చంపేసాడు. అక్కడ డ్యూటీలో ఉన్న ముగ్గురు పోలీసులు వాళ్లని అడ్డు కున్నారు. అయితే సోమన్న మనుషులు ఎక్కువ మంది ఉండటంతో ముగ్గురు పోలీసులు ఆ దాడిలో చనిపోయారు. సోమన్న బృందం పోలీసు అవుట్ పోస్ట్‌ను తగులపెట్టింది. పార్వతిపై కానిస్టేబుల్ అత్యాచారం, ఆమె ఆత్మహత్య వార్తలు మన్యం అంతా దావానంలా వ్యాపించాయి. మన్యం అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గిరిజనుల్లో పోలీసుల మీద కసి పెరిగింది. ఆ సమాచారంతో జిల్లా యంత్రాంగం ఉలిక్కిపడింది. కలెక్టర్, ఎస్పీ సంఘటనా స్థలికి బయల్దేరారు. పోలీసు ప్రధాన కార్యాలయం రెండు వందల మంది సాయుధ పోలీసులను అక్కడికి పంపింది.

పోలీసులు మన్యం మీద విరుచుకుపడ్డారు. సోమన్న సహా చాలామంది గిరిజన యువకులను పోలీసు స్టేషన్‌కి తీసికెళ్లి హింసించడం మొదలు పెట్టారు.

సోమన్నను పోలీసు స్టేషన్లో అరెస్ట్ చూపించ కుండా హింసించి, నాలుగు రోజుల తరువాత వదిలిపెట్టారు. అతని ఒంటినిండా గాయాలు. అప్పటికి ధరణి బాలింతరాలు. మూడు నెలల క్రితం ఒక ఆడపిల్ల(వనజ)కి జన్మనిచ్చింది. ఆమె విధులకు వెళ్లక పోవడంతో జీతం రావటంలేదు. దానికి తోడు పోలీసుల ఫిర్యాదుతో సోమన్నని కాంట్రాక్టరు ఉద్యోగం నుంచి తీసివేసాడు.

దాంతో ఇల్లు గడవని పరిస్థితి. పోలీసుల భయంతో గిరిజన గ్రామాల్లో యువకులు కనిపిం చటం లేదు. వాళ్లు ఎక్కడెక్కడికో పారిపోయారు. వస్తే పోలీసులు హింసిస్తారనీ భయం.

* * *

వారం రోజుల తరువాత ఒకరోజు చింతపల్లి వెళుతున్న పోలీసుల వాహనాన్ని నక్సలైట్లు పేల్చి వేసారు. ఆ దుర్ఘటనలో పాతికమంది పోలీసులు మృత్యువాత పడ్డారు. 'గిరిజనుల మీద అత్యాచారాలకు, హింసాకాండలకు ప్రతీకారంగా పోలీసుల బస్సుని మేమే పేల్చేశాం' అని నల్లకొండ దళం ఒక ప్రకటనలో తెలిపింది.

మళ్లీ మన్యం అంటుకుంది. ఈసారి చాలా ఘోరంగా.

దాంతో గ్రేహౌండ్స్ పోలీసు దళం నక్సల్స్ వేట మొదలు పెట్టింది. ప్రతి గిరిజన గ్రామానికి వచ్చి వెతకడం ప్రారంభించారు. అనుమానంతో చాలామంది యువకులను అరెస్ట్ చేసారు. కెంగువలో పది మంది యువకులను అరెస్ట్ చేసారు.కానీ వారిలో సోమన్న లేడు. ఎందుకంటే వారం రోజుల క్రితం అతను హఠాత్తుగా అదృశ్యం అయ్యాడు. పోలీసులే అతన్ని తీసికెళ్లారని కొందరు అంటే... అతను నక్సలైట్లలో చేరిపోయాడనీ మరికొందరు అన్నారు.

సోమన్నే తమ గురించి నక్సలైట్లకు సమాచారాన్ని చేరవేశాడని పోలీసుల అనుమానం.అందుకే మరింత పట్టుదలతో అతని ఆచూకీ కోసం చుట్టుపక్కల గ్రామాలను జల్లెడ పట్టసాగారు. కెంగువలో మకాం వేశారు.

ఈ హడావిడి, ఉద్రిక్త పరిస్థితుల్లో జనం బయటకు రావడం లేదు. పిల్లలు బడికి రావడం లేదు. నాకెందుకో అక్కడ ఉద్యోగం నచ్చలేదు. ఉద్యోగం వచ్చి నప్పుడు, ఏజన్సీ ప్రాంతం అని భయపడ్డా... గిరిజనుల పిల్లలకు విద్యాదానం గొప్ప విషయంగా భావించి ఆనందంగా వెళ్లాను. కానీ ఈ పోలీసులు, నక్సలైట్ల పరస్పర ఘర్షణ వల్ల పరిస్థితులు చదువు చెప్పేటందుకు అనువుగా లేవు. కొన్నాళ్లు అక్కడే ఉంటే నన్ను కూడా పోలీసులు అనుమానించే ప్రమాదం ఉంది.

అలా అని ఉద్యోగం మానేసే పరిస్థితి లేదు. చాలా కష్టపడితే కానీ ఉద్యోగం దొరకలేదు. దానికి తోడు నాకు ఇంకో రెండు నెలల్లో కౌసల్యతో పెళ్లి. ఉద్యోగం రాగానే మా నాన్న పెళ్లి కోసం తొందర పెట్టాడు. ఉద్యోగం వస్తే గాని పెళ్లి చేసుకోననీ అప్పటి వరకూ చెబుతుండేవాడిని. ఇప్పుడు పెళ్లి వద్దన డానికి నాకు కారణం దొరకలేదు. ఇక తప్పక పెళ్లి చూపులకు మా పక్క ఊరు వెళ్లి కౌసల్యను చూసాను. ఆమె నచ్చడంతో ఆమెతో నా పెళ్లి నిశ్చయమైంది.

ఆ తరువాతి వారం నేను ఊరు వెళ్లినపుడు, పెళ్లికి ముహూర్తాలు పెట్టించానని మా నాన్న చెప్పారు. పెళ్లైతే ఈ ఏజన్సీ ప్రాంతంలో కొండల మీద గ్రామంలో కాపురం పెట్టడం కష్టమనీ, కౌసల్య అక్కడ ఉండలేదనీ నా భావన. అందుకే పెళ్లి అనగానే నాకు భయం వేయసాగింది. ఈ లోపల ఈ గొడవలు మొదలయ్యాయి.

వారం రోజులైంది. సోమన్న జాడలేదు. రోజూ రాత్రి పూట పోలీసులు అతని ఇంటికి వచ్చి, అతని ఆచూకీ చెప్పాలంటూ భార్య ధరణిని ఒత్తిడి చేయ సాగారు. నిత్యకృత్యమైన ఈ గొడవకు భయపడి పోయింది. భర్త నక్సలైట్లలో చేరిపోయాడని ఊళ్లో వాళ్లంతా అనుకోవడం ఆమె చెవిన పడింది. ఈ విషయం తెలిస్తే పోలీసులు అసలు ఊరుకోరు. తనని విపరీతంగా హింసిస్తారు. నక్సలైట్లకు ఆశ్రయం ఇచ్చాడని తన బావ (గౌరి మొగుడు) భీమన్నను పోలీస్‌స్టేషన్‌కి తీసికెళ్లి విపరీతంగా కొట్టడంతో అతను అక్కడే చనిపోవడం, అయినప్పటికీ పోలీసులు గౌరిని ఎన్నో సార్లు స్టేషన్‌కి తీసికెళ్లి విచారణ పేరిట వేధించడం ధరణికి గుర్తుకొచ్చాయి.

అందుకే ఆమె గౌరి ఇంటికి వెళ్లిపోయింది. సోమన్న లేక పోవడంతో ఆర్థిక పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. చేతిలో డబ్బులు లేవు.



గన్నవరపు నరసింహమూర్తి

హాస్పిటల్లో రోజువారీ వేతనపై పనిచేస్తున్న గౌరి జీతం కూడా తక్కువే. నెలకి 5000 రూపాయలకు మించి జీతం రాదు.దీనికి తోడు ధరణికి చంటిపిల్ల వనజ. దానికి పాలడబ్బాలు కొనవలసిన పరిస్థితి.

* * *

సోమన్న ఎక్కడ ఉన్నాడో అతని భార్య ధరణికి తెలుసని ఒక ఇన్ఫార్మర్ చెప్పడంతో..రెండు రోజుల తరువాత పోలీసులు ఆమెను పోలీసు అవుట్ పోస్టుకి తీసికెళ్లి ప్రశ్నించడం మొదలు పెట్టారు. ధరణి తన కూతురు వనజని అక్కకు అప్పగించి పోలీసుల వెంట వెళ్లింది.

ఆ రోజు ఆమెను ప్రశ్నించడానికి కొండగిరి పోలీసు స్టేషన్ నుంచి ఎస్సై రంగారావు వచ్చాడు. అతను చాలా క్రూరమైన వ్యక్తి, ఎందర్నో ఎన్కౌంటర్ చేసి చంపాడన్న పేరున్నవాడు.

అతని ఆధ్వర్యంలో ధరణిని ప్రశ్నించడం మొదలు పెట్టారు పోలీసులు. అతని చేతిలో లాఠీ, జేబులో పిస్టల్ కూడా ఉంది.

“ఏమే! ఎక్కడ నీ మొగుడు సోమన్న?”గద్దించి అడిగాడు రంగారావు. అతను బాగా తాగి ఉండటంతో కళ్లు ఎర్రగా ఉన్నాయి.

“నాకు తెలీదు బాబు. పది రోజుల క్రితం ఆడిని మీ పోలీసులు తీసికెళ్లారు. ఆ తరువాత ఏటయ్యేడో నాకు తెలవదు. ఆ రోజు నుంచి ఆడు ఇంటికి రానేదు” చెప్పింది ధరణి.

“నువ్వు ఏం చెబితే అది నమ్మడానికి నేనేమీ ఎదవని కాను. ఆడు మొన్న రాత్రి ఇంటికి వచ్చి నీ పక్కన తొంగున్నాడని మాకు తెలిసింది. నువ్వేమో నాకేటీ తెలియదని నంగనాచి కబుర్లు సెబుతున్నావు. వాటిని మేము నమ్మాలా? మర్యాదగా ఆడెక్కడున్నాడో సెప్పు? లేకపోతే ఎముకలు యిరగ్గొడతాను” అంటూ లాఠీ తీసి ఆమె కాళ్ల మీద నాలుగుసార్లు గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బలు ఆమె కాళ్ల ఎముకకు తగిలాయి. దాంతో ఆమె గట్టిగా అరుస్తూ కింద పడి పోయింది.

“బాబూ! నాకు ఆడెక్కడున్నాడో తెలవదు, నా మాట నమ్మండి. నన్నొది లేయండి.” అంది ఏడుస్తూ.

“ఆడు ఎక్కడున్నాడో సెప్పేస్తే, నేనే మీ ఇంటికి దగ్గరుండి దిగబెడతా. అప్పుడు ఈ దెబ్బలూ ఉండవు... ఈ ఏడుపూ ఉండదు’ అన్నాడు మళ్లీ లాఠీతో కాళ్ల మీద కొడుతూ.

కొట్టిన దగ్గరే మళ్లీ కొట్టడంతో ఈ సారి ఆమెకు విపరీతంగా నొప్పి కలిగింది. దాంతో ఆమె గట్టిగా అరుస్తూ ...

“బాబూ! నాకేటీ తెలవదు. నన్ను కొట్టొద్దు. నేను సచ్చిపోతే నా పిల్లను సూసేవాడెవ్వడూ నేడు. మీకు దండం ఎడతాను..నన్నొగ్గేయండి” అంది రంగారావు కాళ్లు పట్టుకుంటూ.

“నిన్నొగ్గేస్తే ఆడి గురించి ఎవరు చెబుతారే? నువ్వు నాటకాలాడకుండా నిజం చెప్పు? నువ్వు చెప్పకపోయినా ఆడినెలా పట్టుకోవాలో మాకు తెలుసు. నా గురించి, నా లాఠీ దెబ్బల గురించి నీకు తెలిసినట్లు లేదు. ఈ లాఠీ దెబ్బలు తిన్న తరువాత బతికి బట్ట కట్టినోడెవ్వడూ ఈ భూమ్మీద లేదు. మర్యాదగా చెప్పు” అంటూ ఈసారి చేతుల మీద, నడుం మీద గట్టిగా కొట్టడం మొదలు పెట్టాడు.

ఆ దెబ్బలకు ఆమె గట్టిగా అరుస్తూ నేల మీద పడిపోయింది. రంగారావు కొట్టడం ఆపి ఆమెను చూసాడు. అప్పటికే ఆమె స్పృహ కోల్పోయింది. అతను కానిస్టేబుళ్లను పిలిచి ముఖం మీద నీళ్లు జల్లించాడు.అయినా ఆమెకు తెలివి రాలేదు. అప్పటికి సమయం సాయంత్రం ఐదు గంటలైంది. ఏజన్సీ ప్రాంతం కాబట్టి చీకటి పడుతోంది.

ఆమెతో పాటు వచ్చి బయట ఉన్న కెంగువ గ్రామ యువకులు ఆమె అరుపులు విని పోలీస్ అవుట్ పోస్ట్ లోపలికి రాబోతుండగా, పోలీసులు వాళ్లని లాఠీలతో కొట్టారు. అక్కడ చాలా సేపు గొడవ జరిగింది. ఈ విషయం చుట్టు పక్కల గ్రామాల వాళ్లకి తెలిసి వందమంది గిరిజనులు కర్రలు, గునపాలతో అవుట్ పోస్టుని చుట్టు ముట్టారు.

ఈ విషయాన్ని రంగారావు సర్కిల్ ఇనస్పెక్టర్కి చేరవేయడంతో,మరి కొంతమంది పోలీసులు వ్యాన్లలో బయలుదేరారు.వాళ్ల రాక విషయం తెలుసుకున్న కొందరు యువకులు వాళ్లొచ్చే దారిలో చెట్లు కొట్టేసి రోడ్డుకు అడ్డంగా పడేశారు దాంతో పోలీసు వాహనం అక్కడే ఆగిపోయింది.

ఈ లోపు యువకులు అవుట్ పోస్ట్ మీద దాడి చేసి అడ్డొచ్చిన నలుగురు పోలీసులపై దాడి చేశారు. పోలీసులు చనిపోయారు.

ఎదురు పడ్డ పోలీసులందర్ని కర్రలతో బాది రక్తం వచ్చేలా కొట్టారు. ఇంతలో వాళ్లకి రంగారావు ఒక గదిలో కనిపించాడు. అంతే! వాళ్లలో ఆవేశం పొంగింది. ఒక్కసారిగా విరుచుకు పడ్డారు. పదిమంది కర్రలతో దాడి చేసి బయటకు తీసుకు వచ్చి కొట్టడంతో రంగారావు రక్తం కక్కుకొని అక్కడికక్కడే చనిపోయాడు.

గ్రామస్తులు ధరణిని తీసుకొని వెళ్లిపోయారు.

పోలీసు స్టేషన్ దగ్గర శ్మశాన వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా పోలీసు శవాలే. ఆరుగురు పోలీసులు, ఎస్సై రంగారావు ఆ దాడిలో చని పోయారు.

‘‘గిరిజనులకు, పోలీసులకూ మధ్య తీవ్రమవుతున్న రణం. చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం” అంటూ టీవీ ఛానల్లలో బ్రేకింగ్ న్యూస్ మొదల య్యాయి.

పోలీసులు, దారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించుకొని అవుట్ పోస్ట్కి చేరుకున్నారు.

ఆ రాత్రి ఇంటికి వచ్చిన మొగుడు సోమన్నను చూసి ఆశ్చర్యపోయింది ధరణి.

“ఇన్నాళ్లూ ఎక్కడున్నావు మావా? నీ గురించి పోలీసులు వెతుకుతున్నారు. నువ్వు కనిపిస్తే కాల్చేస్తారు. ఎందుకీ పని చేసావు?”అడిగింది ఏడుస్తూ.

“ఆరోజే వాళ్లు నన్ను కాల్చేయ్యాలనీ చూసారు. ఇప్పుడు వాళ్లకి దొరికితే నన్ను బతకనివ్వరు. ఎన్కౌంటర్ పేరుతో కాల్చేస్తారు.ఈ రోజు ఉదయాన్నే నిన్ను పోలీస్ స్టేషన్కి తీసికెళ్లి నా గురించి చెప్పాలని కొడుతున్నారని మన ఊరు మారీచుగాడు చెప్పాడు. అందుకే నిన్ను, పిల్లనీ చూద్దామనీ వచ్చా” అన్నాడు సోమన్న.

“పిల్ల అక్క గౌరి దగ్గరుంది మావా! నువ్వు లేకుండా బతకడం కష్టమైతోంది. ఏటైతే అది అవుతాది. పోలీసులకు లొంగిపోతేనే మంచిదేమో. నేకపోతే నిన్ను ఏటాడేటట్టున్నారు.ఒకవేళ నువ్వు తప్పించుకున్నా నన్ను సంపుకు తింటారు. నువ్వెక్కడున్నావో నాకు తెలుసనీ వాళ్లు నన్ను నానా బాధలూ పెడు తున్నారు. పోలీసులు మనింటికాడే కాపలా ఉంతన్నారు. ఇయాళ ఉదయం పోలీసులు సనిపోవడంతో ఆళ్లు ఇక్కడికి రానేదు. పోలీసులు మన ఊరోళ్లని యేటాడి మరీ సంపుతునారు. ఏటి సెయ్యాలో అర్థం కావటం నేదు. ఎలా బతకాలోననీ భయం ఏత్తాంది” అంది ధరణి ఏడుస్తూ.

(సశేషం)

**“నువ్వు ఏం చెబితే అది నమ్మడానికి నేనేమీ ఎదవని కాను. ఆడు మొన్న రాత్రి ఇంటికి వచ్చి నీ పక్కన తొంగున్నాడని మాకు తెలిసింది. నువ్వేమో నాకేటీ తెలియదని నంగనాచి కబుర్లు సెబుతున్నావు. వాటిని మేము నమ్మాలా? మర్యాదగా ఆడెక్కడున్నాడో సెప్పు? లేకపోతే ఎముకలు యిరగ్గొడతాను” అంటూ లాఠీ తీసి ఆమె కాళ్ల మీద నాలుగుసార్లు గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బలు ఆమె కాళ్ల ఎముకకు తగిలాయి. దాంతో ఆమె గట్టిగా అరుస్తూ కింద పడి పోయింది.**



భాగం-51

# మార్క్సిజం-శ్రీరామరాజ్యం



అధిగమించిన తత్త్వవేత్తలకు ప్రపంచం బ్రహ్మమయంగా ఉంటుంది.

పేదరికంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమైన మార్క్స్ మనస్సు ఏవిధంగా ప్రతిక్రియలను ఆలోచించి పెట్టుకుందో, ఆ విధంగానే, మార్క్సీయ తత్త్వం పుట్టింది. ఆర్థిక బాధల్లో ఉన్నవాడికి డబ్బు అన్నింటికంటే విలువైనది అనిపిస్తుంది. ఆకలితో ఉన్నవాడికి ఆహారం, దాహంతో ఉన్నవాడికి నీళ్ల విలువ అర్థమవుతుంది. అందుకే మార్క్సుకు డబ్బే ప్రపంచంలో అతి ముఖ్యమైనదిగా తోచింది. బ్రహ్మం, చైతన్య మయమైన ఆత్మ, ఉత్తమమైన మానవత్వం, ధార్మిక, సామాజిక, శాశ్వత నియమాలు… ఇవన్నీ డబ్బు ముందు అతనికి తుచ్ఛంగా అనిపించాయి.

సంయమన మనస్సు, ఇంద్రియాలు, భోగాలు, పరిస్థితులను జయించి వాటికి యజమాని అవుతుంది. అనేకమంది రాజులు, ధనవంతులు… పరోపకారం కోసం, పుణ్యం, ఆధ్యాత్మికత కోసం ధనం, శరీరం, ప్రాణాలను సైతం త్యజించారు. రామచంద్రుడు, హరిశ్చంద్రుడు, రంతిదేవుడు, శిబి, దిలీపుడు వంటి వారిని ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. రంతిదేవుడు,

**న త్వహం కామయే రాజ్యం న స్వర్గం నాపునర్భవమ్**
**కామయే దుఃఖతప్తానాం ప్రాణినామార్తినాశనమ్** (మహాభారతం)

# మార్క్సవాదంలోని లోపాలు

**మార్క్సవాదాన్ని చాలామంది తెలుగులో సామ్యవాదం అని తర్జుమా చేస్తుంటారు. కానీ అది తప్పు. సమాజవాదం, సామ్య వాదం మార్క్స్ కంటే పూర్వం నుంచి ప్రచారంలో ఉన్నాయి. మార్క్స్ ప్రకారం ఆయా కాలాల్లో చరిత్ర గతిని మార్చినది ఆనాటి ఆర్థిక పరిస్థితులే. డబ్బు చుట్టూ తిరగడం మార్క్స్ వాదంలోని ప్రధాన లోపం కాగా, ఇంకా అనేకం ఉన్నాయి.**

చరిత్రకారులు ప్రాచీనకాలం నుంచి మనిషిని అత్యున్నతంగా చూశారు. చరిత్రలో మార్పులు గొప్ప బుద్ధిగల వ్యక్తుల వల్లనే జరుగుతాయని భావించారు. చరిత్ర మార్పులో మనిషి ముఖ్యం, కానీ అతను పరిస్థితులకు లోబడి ఉంటాడు. అతని ఆలోచనలు కూడా ఆ పరిస్థితులపై ఆధారపడతాయి. ఒక వ్యక్తి నాయకుడు కావాలంటే అతని ప్రణాళికలు నాటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి.

ఆధునిక తత్త్వవేత్తల ఆలోచనలు వారు ఎదుర్కొన్న పరిస్థితులు, సంపద, కష్టాలకు ప్రతిస్పందనలుగానే ఉంటాయి. వారు తమ సుఖాలు, దుఃఖాలు, ఇష్టాయిష్టాలు, సంస్కారాలతో చుట్టుముట్టి ఉంటారు. ఎరుపు లేదా పసుపు కళ్ళద్దాలు ధరించిన వారికి ప్రపంచం ఆ రంగుల్లో కనిపించినట్లే, వీరి సిద్ధాంతాలు, తర్కాలు కూడా వీరు ఎదుర్కొన్న పరిస్థితులు, భావోద్వేగాల ప్రకారం రూపొందుతాయి. కాముకుడికి ప్రపంచం అంతా కాంతామయంగా కనిపిస్తుంది. పరిస్థితులను

మన ప్రాచీన గ్రంథాలు, శాస్త్రాలు అనేక వచనాల ద్వారా డబ్బు గొప్పతనాన్ని చెప్పాయి. ‘డబ్బుకంటే గొప్పది మరేదీ లేనే లేదు అని చెప్పడం సరైనదే. ‘ధార్మిక, ఆధ్యాత్మిక, నైతిక ఉన్నతులు, వాటికి అనుకూలించే అన్ని నియమాలు వీటన్నిటికీ ముఖ్యాధారం డబ్బే. అట్టి డబ్బే అత్యుత్తమం’ అని భావించి, శాశ్వత సత్యం – న్యాయం, నిత్యమైన ఆత్మ – పరమాత్మ, ధార్మిక నియమాలను డబ్బు కోసం వదిలేయడం… ఇవన్నీ పేదరికం, దరిద్రం తాలూకు స్పష్టమైన ఫలితాలే.

పేదరికంలో ధనవంతులపై ఈర్ష్య, ద్వేషం కలుగుతాయి. వారిని నాశనం చేయాలనే ఆలోచనవస్తుంది. దానికి తగిన ఉపాయాలు, తర్కాలు కనుగొంటారు. ఈవిధంగా చాలా పాశ్చాత్య తత్త్వాలు, ముఖ్యంగా మార్క్స్ తత్త్వం, ప్రతిస్పందనాత్మ కమైనవి. ఏదైనా ఒక వస్తువుకు భోక్త ద్వారా డిమాండ్ ఉంటేనే దానికి విలువ ఉంటుంది. లేకపోతే అది విలువ లేనిది. చైతన్యవంతుడైన మానవుడే డబ్బును సృష్టిస్తాడు, పెంచుతాడు, కాపాడతాడు. అలాంటప్పుడు ఆ మనిషి విలువను తక్కువచేసి, అతన్ని ఆర్థిక వ్యవస్థలకు బానిసగా చేయడం ఎంతవరకు సమంజసం? సాధారణంగా గొప్పవారు కూడా డబ్బుకు బానిసలుగా కనిపిస్తుంటారు– ‘అర్థస్య పురుషో దాసః’. సామాన్యుడు మనస్సుకు దాసుడు. పరిస్థితులకు లోబడతాడు. ఇంద్రియాలకు కింకరత్వం చేస్తాడు. విషయాలకు బానిస. కానీ ఇంద్రియాలను అదుపులో ఉంచిన

‘నాకు రాజ్యం, స్వర్గం, మోక్షం వద్దు, ప్రాణుల దుఃఖ నివారణమే కావాలి’ అన్నాడు.

రామచంద్రుడు, హరిశ్చంద్రుడు రాజ్యాన్ని, దిలీపుడు, రంతిదేవుడు స్వర్గాన్ని సైతం త్యజించిన సంగతి ప్రసిద్ధం. సమర్థ విద్వాంసుడు, మహాతపస్వి, మహాత్యాగి చరిత్ర దిశను మార్చగలడు, ఇది ప్రత్యక్ష సత్యం. తర్కంతో ఈ సత్యాన్ని తప్పుగా నిరూపించే వారు, ప్రత్యక్ష సూర్యుడిని కూడా తమ బుద్ధివైభవంతో చీకటిగా చూపగలరు. పరిస్థితులు, అవకాశాల ప్రవాహంలో కొట్టుకుపోవడం శవం నదిలో తేలడంలాంటిది. బుద్ధిమంతుడు, ధైర్యవంతుడైన మహాపురుషుడు ప్రవాహాన్ని చీల్చుకుని బయటకు వస్తాడు, ప్రవాహ దిశను మారుస్తాడు. నదిలో పడిన వ్యక్తి ప్రవాహాన్ని ఛేదించి, ఆనకట్ట కట్టి, కాలవలు తీసి దిశ మార్చినట్లు. ఈర్ష్య, ద్వేషం సామాన్యుల స్థితి. ఉత్తములు, కష్టపడి సంపాదించిన కొద్ది డబ్బుతో సంతృప్తి చెందుతారు. దోపిడీ, హత్యలతో ధనవంతుడు కావడం మంచిది కాదు. ఈర్ష్య, ద్వేషం మనిషిలో లోపాలే, గుణాలు కావు. మార్క్సవాదులు ఈ లోపాలను రెచ్చగొట్టి రాజకీయ సమస్యలను పరిష్కరించాలనుకుంటారు. స్వార్థం కోసం కూడా కొంత నీతిని పాటిస్తారు, అపహరణ నీచమని భావిస్తారు. కానీ మార్క్స్ ప్రకారం ఇతరుల ఆస్తిని అపహరించడం న్యాయమే, అన్యాయం కాదు.

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**
**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

# ప్రజాస్వామ్యానికి ప్రమా

**అమెరికాలో కఠినమైన ఓటర్ గుర్తింపు నిబంధనల కోసం వాదిస్తూ, భారత్‌లో ప్రతి ఓటరుకు ఫొటో ఐడీ ఉండటం, పోస్టల్ ఓటింగ్ ఒక శాతం కన్నా తక్కువగా ఉండటాన్ని తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసిం చడం, ప్రపంచవేదికపై భారత ఎన్నికల వ్యవస్థ పటిష్టతకు, విశ్వసనీయతకు పెద్దగుర్తింపు. భారత్‌లో వందల కోట్లమంది ఓటర్లతో కూడిన అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరుగుతుందో ప్రపంచ దేశాలకు మరోసారి తెలిసింది. మనదేశంలో ఎన్నికల సంఘం పనితీరుపై కొందరు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడు మన విధానాన్ని ఆదర్శంగా తీసుకోవడం అధికారవర్గాలకు నైతిక బలాన్నిచ్చింది. దీనివల్ల రెండు దేశాల ఎన్నికల నిర్వాహకుల మధ్య పరస్పర సహకారం, సాంకేతికత శిక్షణ విభాగాల్లో సంబంధాలు బలపడే అవకాశం ఉంది.**

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశానికి అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంప్, అమెరికా ఎన్నికల విధానంలో మార్పులు తెచ్చేందుకు భారత్ వైపు చూడటం ఇక్కడ కీలకం! దాదాపు 100 కోట్ల ఓటర్లు ఉన్న భారత్‌లో.. ప్రతి ఒక్కరికీ ఫొటో గుర్తింపు కార్డు ఉండటం, పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిం చడం ఒక అద్భుతంగా ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నా యనడానికి గొప్ప ఉదాహరణ. ఇప్పటికే అనేక చిన్న దేశాలు భారత ఈవీఎం సాంకేతికతను, ఎన్నికల నిర్వహణ పద్ధతులను వాడుతున్నాయి. ఇప్పుడు అగ్రరాజ్యం కూడా మన ఓటర్ ఐడీ పద్ధతిని ప్రశంసించడంవల్ల భారత ఎన్నికల సంఘం ప్రతిష్ట పెరగడమే కాదు మనది ఎంత పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థో ఇది నిరూపిస్తోంది. దేశీయంగా ఎన్నికల నిర్వహణపై వచ్చే కొన్ని రాజకీయ విమర్శలకు, ఇలాంటి అంతర్జాతీయ ప్రశంసలు సమాధానంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

**చర్చకు దారితీసిన ట్రంప్ ప్రశంస**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎన్నికల విధానాన్ని, ముఖ్యంగా ఓటర్ ఐడీ కార్డ్, తక్కువ పోస్టల్ ఓటింగ్ పద్ధతులను ప్రశంసించడం యుఎస్‌లో పెద్ద ఎత్తున రాజకీయ, సామాజిక చర్చలకు దారితీసింది. అమెరికాలో రాబోయే ఎన్నికల కోసం కఠినమైన ఓటింగ్ నిబంధనలు తేవాలని, ఓటు వేయడానికి ఫొటో ఐడీ తప్పనిసరి చేయాలని ట్రంప్ భావిస్తున్నారు. 'భారత్ అంత పెద్ద దేశంలోనే ప్రతి ఒక్కరికీ ఓటర్ ఐడీ సాధ్యమైనప్పుడు, అమెరికాలో ఎందుకు కాదు?' అనే అంశాన్ని రిపబ్లికన్లు బలంగా వాడుకుంటున్నారు. అమెరికా విశ్లేషకులు భారత్‌కు, అమెరికాకు ఉన్న తేడాలను చర్చిస్తున్నారు. భారతదేశంలో 'ఎన్నికల సంఘం అనే ఒకే కేంద్ర వ్యవస్థ ఉంటుంది. కానీ అమెరికాలో ఎన్నికల నిర్వహణ అధికారం ఆయా రాష్ట్రాల చేతుల్లో వికేంద్రీకృతంగా ఉంటుంది. ట్రంప్ ప్రతి పాదిస్తున్న ఈ నిబంధనల వల్ల అమెరికాలోని పేదలు, వలస దారులు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని అక్కడి డెమొక్రాట్ పార్టీ నేతలు వాదిస్తున్నారు.

**దౌత్య సంబంధాలపై సానుకూల ప్రభావం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎన్నికల విధానాన్ని ప్రశంసించడం భారత్-అమెరికా దౌత్య, వ్యూహాత్మక సంబంధాలపై కూడా సానుకూ ల ప్రభావాన్ని చూపుతుంది. భారత్, అమెరికాలను 'ప్రపంచంలోనే అతిపెద్ద, పురాతన ప్రజాస్వామ్య దేశాలు' అంటారు. ట్రంప్ వ్యాఖ్యలు ఈ ప్రజాస్వామ్య బంధాన్ని మరింత గౌరవప్రదంగా మార్చాయి. వ్యూహాత్మక రంగాలలోనే కాకుండా, భారతదేశంలోని అంతర్గత పాలన, ఎన్నికల వ్యవస్థల పటిష్టతను అమెరికా అగ్రనాయకత్వం అధికారికంగా అంగీకరించినట్లయింది. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న డిజిటల్ ఓటర్ ఐడీ, బయో మెట్రిక్ ఆధారిత వ్యవస్థలపై అమెరికా అధ్యయనం చేసే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం గురించి చర్చలు జరిగినప్పుడు, భారత్ ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుంది. ఇది గ్లోబల్ సౌత్ దేశాలకు నాయకత్వం వహిస్తున్న భారత్‌కు అంతర్జాతీయంగా మరింత ప్రాబల్యం ఇస్తుంది. ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రస్తావన కూడా తెచ్చారు. దీనివల్ల భారత ప్రభుత్వ విధానాలు అమెరికాలోని రిపబ్లికన్ పార్టీకి మరింత దగ్గరయ్యాయి. ఇది భవిష్యత్తులో వాణిజ్య, రక్షణ రంగాల చర్చల్లో భారత్‌కు కొంత అనుకూలంగా మారవచ్చు.అమెరికా రాయబారి సెర్గియో గోర్ కూడా ట్రంప్ వ్యాఖ్యలను సమర్థిస్తూ భారత్‌ను ఒక అంతర్జాతీయ ప్రమాణంగా అభివర్ణించారు. ఇది రాబోయే రోజుల్లో భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడానికి ఒక సానుకూల సంకేతం.

**విపక్షాల విమర్శలు**

ట్రంప్ ప్రశంసలపై దేశీయంగా కాంగ్రెస్ వంటి ప్రతిపక్షాలు భిన్నంగా స్పందించాయి. 'భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను అమెరికా అధ్యక్షుడు అంతగా మెచ్చుకుంటే, ఆయనను అమెరికాకే తీసుకెళ్లి అక్కడ ఎన్నికలు జరిపించుకోమనండి" అంటూ కాంగ్రెస్ నేత పవన్ ఖేరా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విదేశాంగ శాఖ దీనిపై స్పందిస్తూ, భారత ఎన్నికలవ్యవస్థ పారదర్శకత, పటిష్టత అంతర్జాతీయంగా మరోసారి నిరూపితమైన నిజమని, ఈ వ్యాఖ్యలు వ్యవస్థకు దక్కిన గౌరవమని పేర్కొంది. మన దేశంలో ఈవీఎంలపై నిరంతరం ఆరోపణలు చేసే కొందరు




నెటిజన్లు, 'ట్రంప్‌కు మన ఓటర్ ఐడీ మాత్రమే నచ్చింది కానీ, ఇక్కడి ఈవీఎం విధానం కాదు కదా,' అంటూ సామాజిక మాధ్యమాల్లో చర్చలు లేవనెత్తుతున్నారు.

**ప్రజాస్వామ్యానికి బ్రాండ్ అంబాసిడర్**

భారతదేశం ప్రజాస్వామ్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఎదగడానికి డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రశంసలు ఒక బలమైన మైలురాయిగా నిలిచాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యవిలువలు, ఎన్నికల పారదర్శకత గురించి చర్చ వచ్చినప్పుడల్లా ఇప్పుడు అందరి చూపు భారతదేశం వైపు మళ్లుతోంది. భారత దేశాన్ని కేవలం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగానే కాకుండా, 'మదర్ ఆఫ్ డెమోక్రసీ' అని మన ప్రభుత్వం తరచూ చెబుతుంటుంది. అమెరికా వంటి అగ్ర రాజ్యం మన ఎన్నికల పద్ధతులను (ఓటర్ ఐడీ విధానాన్ని) ప్రమాణంగా తీసుకోవడం వల్ల ఈ మాటకు అంతర్జాతీయంగా అధికారిక ముద్ర పడినట్లయింది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్

# ణం భారత్!

అమెరికాలోని అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారత్ ఒక ఆదర్శంగా నిలుస్తోంది. వనరులు తక్కువగా ఉన్నప్పటికీ, వందల కోట్లమంది జనాభా ఉన్న దేశంలో ఇంత క్రమశిక్షణతో, పారదర్శకంగా ఓటింగ్ నిర్వహించడం సాధ్యమేనని భారత్ ప్రపంచానికి నిరూపించింది. ఇది ఇతర దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడానికి స్ఫూర్తినిస్తుంది. కొన్ని పాశ్చాత్య థింక్–ట్యాంక్‌లు (ఉదాహరణకు వీ–డెమ్ లేదా ఫ్రీడమ్ హౌస్ వంటి అంతర్జాతీయ సంస్థలు) భారతదేశంలో ప్రజాస్వామ్య సూచీలు తగ్గుతున్నాయంటూ గతంలో కొన్ని నివేదికలు ఇచ్చాయి. కానీ, స్వయంగా అమెరికా అధ్యక్షుడే భారత ఎన్నికల సంఘం పద్ధతులను,




ఓటింగ్ భద్రతను ప్రశంసించడంతో, ఆ విమర్శలన్నిటికీ గట్టి సమాధానం లభించినట్లయింది. ప్రపంచంలో ఏ దేశంలోనైనా ఎన్నికల సంస్కరణలు చేపట్టాలనుకుంటే, ఇప్పుడు వారు ఆదర్శంగా తీసుకునే దేశాల జాబితాలో భారత్ మొదటివరుసలో ఉంటుంది. డిజిటల్ ఓటర్ ఐడీలు, పటిష్టమైన భద్రతాప్రమాణాలతో కూడిన మన వ్యవస్థ ఇతర ప్రజాస్వామ్య దేశాలకు ఒక పాఠ్యపుస్తకంలా మారింది. భారత ఎన్నికల సంఘం ఏ ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగకుండా, ఇంతటి భారీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించగలదని అంతర్జాతీయంగా నిరూపితమైంది. వందలకోట్లమంది ఓటర్ల డేటాను భద్రపరుస్తూ, ప్రతి ఒక్కరికీ డిజిటల్, ఫొటో గుర్తింపుకార్డులను కేటాయించడంలో మన సాంకేతిక వ్యవస్థలు ఎంత పటిష్టంగా ఉన్నాయో ప్రపంచానికి వెల్లడైంది. ఎన్నికల ఫలితాలు ఏవైనా, ప్రజల తీర్పును వ్యవస్థలు గౌరవిస్తాయనే నమ్మకం పటిష్టపడింది. అమెరికావంటి దేశమే మన విధానాలను ఒక ప్రమాణంగా చూస్తోందంటే, అది మన రాజ్యాంగ నిర్మాతలు అందించిన వ్యవస్థల విజయమే!

### నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనం

భారతదేశ ఎన్నికల విధానం ప్రపంచ దేశాలకు నేర్పిన ‘ఎన్నికల పాఠాలు’ మన దేశ ఎన్నికల సంఘం అద్భుతమైన నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు భారత్ అనుసరిస్తున్న పద్ధతులను అధ్యయనం చేస్తున్నాయి. భారతదేశంలో ప్రతి ఓటరుకు ఫోటోతో కూడిన గుర్తింపు కార్డు (ఎపిక్) ఉండడం వల్ల బూత్ లెవెల్‌లో మోసాలను అడ్డుకోవచ్చు. అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో ఓటు వేయడానికి కఠినమైన ఫోటో గుర్తింపు కార్డులు అవసరం లేదు. ట్రంప్ ప్రధానంగా ప్రశంసించింది భారత్‌లోని ఈ ‘వన్ ఓటర్–వన్ ఐడీ’ కచ్చితత్వాన్ని. పేపర్ బ్యాలెట్లతో పోలిస్తే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, ఓటు ఎవరికిపడిందో చూపే వీవీప్యాట్‌ల వల్ల కౌంటింగ్ వేగంగా, పారదర్శకంగా జరుగుతుంది. భారత్ ఈవీఎంలు ఇంటర్నెట్‌కు అనుసంధానం కావు. ఈ భద్రతా విధానాన్ని ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. కొండ ప్రాంతాలు, అడవులు, ఎడారులలో ఉన్న ఒక్క ఓటరు కోసం కూడా పోలింగ్ బూత్ ఏర్పాటుచేసే నిబంధన భారత్‌లో ఉంది. కోట్లసంఖ్యలో ఉన్న సిబ్బంది, రక్షణ బలగాలను సమర్థవంతంగా మోహరించి, విడతల వారీగా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడం ప్రపంచంలోనే అతిపెద్ద లాజిస్టికల్ టాస్క్!

### ఇండొనేషియాతో ఎంఓయూ

భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని ‘ఇండియా ఇంటర్నేషనల్ ఇన్ట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్స్ (ఐఐఐడీఈఎం)ద్వారా ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాల ఎన్నికల అధికారులకు భారత్ శిక్షణ ఇచ్చింది. భూటాన్, నేపాల్, నమీబియా వంటి దేశాలు మన దేశ ఈవీఎంలను, ఎన్నికల సాఫ్ట్‌వేర్‌లను నేరుగా ఉపయోగించాయి. భారతదేశంలో తయారైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను (ఈవీఎం) వివిధ దేశాలు తమ ఎన్నికలలో నేరుగా ఉపయోగించాయి లేదా మన సాంకేతికతను తీసుకున్నాయి. భారత ప్రభుత్వ రంగ సంస్థలైన బెల్ (బీఈఎల్), ఈసీఐఎల్ సంస్థలు వీటిని తయారు చేస్తాయి. తాజాగా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండోనేషియా, తమ ఎన్నికల విధానాన్ని ఆధునీకరించడానికి భారతదేశంతో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా భారత్ తన ఈవీఎం సాంకేతికతను ఆ దేశానికి బదిలీచేస్తోంది. కెన్యా, ఆస్ట్రేలియా, రష్యా, నైజీరియా, ఆఫ్ఘనిస్తాన్ దేశాలు ఎన్నికల సంస్కరణల్లో భాగంగా భారత ఈవీఎంల పనితీరును, వాటి సురక్షిత విధానాలను




పరిశీలించాయి. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, విదేశాలకు ఎగుమతిచేసే ఈవీఎంల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కోడింగ్, రంగులు, భారతదేశంలో మనం వాడే ఈవీఎంలకంటే భిన్నంగా ఉంటాయి. అలాగే మన దేశంలో వాడే సిరాని కూడా చాలా దేశాలకు భారత్ ఎగుమతి చేస్తుంది.

### విదేశీ ప్రతినిధులకు శిక్షణ

భారత ఎన్నికలసంఘం విదేశీ ఎన్నికల అధికారులకు, ప్రతినిధులకు అందించే అంతర్జాతీయ శిక్షణ, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇందుకోసం ఈసీఐ ప్రత్యేకంగా ఒక అడ్వాన్స్‌డ్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. న్యూఢిల్లీ వేదికగా పనిచేసే ఐఐఐడీఈఎం (ఇండియన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్) ద్వారా ఈ అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయి. ఇప్పటివరకు దాదాపు 141 కంటే ఎక్కువ దేశాల ఎన్నికల అధికారులకు ఈ సంస్థ సామర్థ్య పెంపుదలకు శిక్షణిచ్చింది. ప్రజల్లో ఓటు హక్కుపై చైతన్యం తెచ్చేందుకు భారత్ అమలు చేస్తున్న ‘స్వీప్’ కార్యక్రమాలను విదేశీయులకు ఈ సందర్భంగా వివరిస్తారు. ఈసీ సుమారు 28 కంటే ఎక్కువ దేశాల ఎన్నికల సంస్థలతో, ఐరాస, ఇంటర్నేషనల్ ఐడియా వంటి అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని ఈ ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలను నడుపుతోంది. ఆవిధంగా ప్రపంచంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా అందులో భారత ఎన్నికల సంఘం నైపుణ్యం, సాంకేతికత భాగస్వామ్యం అవుతుండటం విశేషం.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# సరైన విద్య

**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువులకు వందనాలు. ఉత్తమ గురువు సమాజానికి వెన్నెముక వంటివాడు. నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించేవాడు. అందుకే మన సనాతన భారతంలో పిల్లలను విద్యనభ్యసించటానికి గురుకులాలకు పంపేవారు. అలా గురుకులాలలో మొదలైన మన విద్యా వ్యవస్థ తదనంతరం అనేక మార్పులు చెంది ప్రస్తుత ఎలక్ట్రానిక్ యుగంలో ఆధునిక విద్యా వ్యవస్థగా రూపాంతరం చెందింది. విద్యా వ్యవస్థలో, ఉపాధ్యాయులలో, విద్యార్థులలో, సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్నప్పటికీ విద్యార్థులను భావి భారత బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల స్థానం, పాత్ర మారలేదు. ఇప్పటికీ అలాగే ఉంది. ఎప్పటికీ అలాగే ఉంటుంది. ఈ సత్యాన్ని విద్యార్థులకు గుర్తు చేయాలనే ఉద్దేశంతో ప్రతియేటా మనం ఉపాధ్యాయుల దినోత్సవం జరుపుకుంటున్నాము.**

ప్రస్తుత విద్యా వ్యవస్థ చాలా యాంత్రికంగా మారిపోయింది. అటు స్కూలు యాజమాన్యాలు, ఇటు ఉపాధ్యాయులు చాలామటుకు విద్యను వ్యాపార ధోరణితోనే చూస్తున్నారు. ఉపాధ్యాయులు విద్య నేర్పడాన్ని సామాజిక బాధ్యతగా కంటే, జీవనోపాధిగా ఎక్కువ భావిస్తున్నారనుకోవచ్చు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యను మంచి ఉద్యోగం సంపాదించే మాధ్యమంగానే చూడడం మొదలు పెట్టారనుకో వచ్చు. ఫలితంగా విలువలతో కూడిన విద్య ప్రస్తుతం విద్యార్థులకు అందడంలేదు. వ్యక్తిగత లాభం తప్ప సామాజిక ప్రయోజనాన్ని విద్యలో చూడలేక పోతున్నారు. విద్య సనాతన వైభవం నానాటికీ దిగజారుతోంది. ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దిగజారుతున్న విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడానికి, ప్రభుత్వం, సమాజం, విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకోవలసిన చర్యలను గుర్తించడం, వాటి గురించి విస్తారంగా చర్చించు కోవడం ఎంతైనా అవసరం.

మొదటగా, నాటి గురుకుల వ్యవస్థ ఎందుకు ఏర్పడింది అన్నది చూద్దాం. మోహమును తొలగించేది, వివేకమును కలిగించేదీ శాస్త్రము అన్నారు. శాస్త్రమును తెలుసుకోవాలంటే సద్గురువును ఆశ్రయించాలి. అలాంటి సద్గురువు సన్నిధిలో ఆనాడు అందుబాటులో ఉన్న శాస్త్రాలను భక్తి శ్రద్ధలతో, ఇతర చింతనలు చేయకుండా అధ్యయనం చేసేవాడే ఉత్తమ శిష్యుడుగా వెలుగొందేవాడు. అసలు విద్యకు, జీవనోపాదికి ఆ రోజుల్లో విద్యార్థి దశలో సంబంధముండేది కాదు. అలా వ్యక్తిత్వ వికాసానికి ఏర్పడిన గురుకులాలలో అధ్యయనం జరిగేది. వాటినే ఇప్పుడు మనం పాఠశాలలు, కళాశాలలు అని అంటున్నాం. శిష్యులను విద్యార్థులు అని,గురువులను ఉపాధ్యాయులు అని అంటున్నాం. విద్య అంటే శాస్త్రాధ్యయనము . శాస్త్రమును రెండు రకాలుగా చెప్పుకోవచ్చు. ఒకటి కర్మమును బోధించేది. అంటే జీవితాన్ని సాఫీగా గడపడానికి కావలసిన విజ్ఞానము, మెళుకువలు నేర్పేది. ఇది లౌకికము. ఇక రెండవ శాస్త్రము బ్రహ్మమును బోధించేది. అంటే జీవితకాలంలో నీతిగా, నిజాయతీగా, గౌరవ ప్రదంగా, భగవంతుని పట్ల భక్తి, సమాజము, దేశము పట్ల సేవాభావము, గౌరవంతో బతకడానికి కావలసిన ఆత్మ జ్ఞానము సమకూర్చేది. ఈ రెండింటిని సమపాళ్లలో గురుకులాలు, ఆశ్రమాలు బోధించేవి. అందుకే అక్కడ చదువుకున్న విద్యార్థులు అఖండ భారతావనిలో మహా పురుషులుగా వెలుగొందారు. ఇది సనాతన, ప్రాచీన, మధ్య యుగ భారతంలోని అధ్యాయం అలా పవిత్ర ఉద్దేశ్యాలతో మొదలైన మన విద్యావిధానం కాలక్రమేణా అనేక మార్పులు చెంది ఈరోజు విద్య అనేది ఒక అంగడి సరుకుగా మారింది.

ఎక్కడ కావాలంటే అక్కడ ఎంత కావాలంటే అంత కొనుక్కోవచ్చు. విద్యావిధానం మీద ఎవరి పూర్తి నియంత్రణ లేదు. ప్రభుత్వంలో విద్యా మంత్రిత్వ శాఖ ఉన్నా ఆ శాఖ కొన్ని విషయాల మీదే ప్రధానంగా దృష్టి సారిస్తోంది. అందుకే ఉన్నత ఆశయాలతో గురుకుల విద్యగా మొదలైన విద్య విలువలు లేని విద్యగా కేవలం ఫీజుల బిల్లులతో, రంగురంగుల ప్రశంసాపత్రాలతో కూడిన విద్య అయింది. అటు పాఠశాలలో ఉపాధ్యాయులకు, ఇటు ఇంట్లో తల్లిదండ్రులకు చాలావరకు మార్క్ షీట్ మీద ఉన్న మార్కులనే పట్టించుకుంటారు కానీ వాస్తవంగా విద్యార్థి ఎంత జ్ఞాన సమపార్జన చేసాడు, ముమ్మందు ఎలా రాణిస్తాడు అన్న భీతి, పట్టింపు లేకుండా పోతోంది. కోచింగ్ సెంటర్లు ఉన్నాయి కదా! అక్కడ చేరిస్తే వాళ్లే చూసుకుంటారు అన్న ధీమాతో వ్యవహరిస్తున్నారు.

**విద్యార్థికి మార్గదర్శి గురువు**

- ఉపాధ్యాయుడు విద్యాబోధనలో పరిపూర్ణుడై ఉండాలి.
- జ్ఞాన సముపార్జనకు ప్రతిబంధకాలైన అహం కారం, దంభం, అసూయ, ద్వేషం, చోర గుణం, బద్ధకం, అశౌచం, క్రమశిక్షణా రాహి త్యాలను విద్యార్థుల్లో లేకుండా చేసేవాడై ఉండాలి.
- విద్యార్థి ఉపాధ్యాయునితో ఏదైనా చెప్పడానికి సంశయిస్తుంటే ఆయన విద్యార్థితో ఒక తండ్రిలాగా వ్యవహరించి విషయం తెలుసుకోవాలి.
- విద్యార్థులకు అనుకూలమైన విధంగా బోధన చేయాలి.
- నిర్వేదంతో ఉన్న విద్యార్థికి మరల మరల బోధించి పరిపూర్ణుడిని చేయటం కంటే మించిన పని తనకు మరొకటి లేదని భావించాలి.



- విద్యార్థిని ప్రశ్నలడిగేముందు తాను సంతృప్తికరంగా పాఠం చెప్పానా, లేదా అని ఆత్మవిమర్శ చేసుకోవాలి.
- ఒక బంగారు నగను కరిగించి వేరొక బంగారు నగ చేసినప్పుడెలాగైతే పూర్వపు వస్తువు బంగారమంతా కొత్తవస్తువులోకి వచ్చి చేరుతుందో అదే తీరుగా విద్యార్థికి జ్ఞానాన్ని సంపూర్ణంగా అందించాలి.
- విద్యార్థులకు వారి కుటుంబ, సామాజిక అంశాలతో ముడిపడిన ఇబ్బందులు ఉంటాయి. అటువంటి విద్యార్థి ఎవరితో చెప్పుకోలేక, చదువు మీద శ్రద్ధ పెట్టలేడు. అలాంటి విద్యార్థిని గుర్తించి ఆ ఇబ్బందుల వెనుక కారణం తెలుసుకోగలగాలి. అంతే తప్ప అది నా పని కాదు. కేవలం చదువు చెప్పడమే నా పని. ఇలాంటి పనికి సమయంలేదు అని వదిలేయకూడదు.

# కావాలి

- ప్రతి విద్యార్థిలోనూ తనను తాను స్వతంత్రుడను అనే భావన కలిగించాలి. అంతే తప్ప తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయుల నిర్బంధంతో చదువుతున్నానన్న భావన విద్యార్థికి ఉండకూడదు. చక్కగా చదవడం వల్ల తన వ్యక్తిత్వ వికాసం జరుగుతుందని విద్యార్థికి తెలియ జెప్పాలి.
- ఇతర విద్యార్థులు బాగా చదువుతున్నారు, నువ్వు చదవట్లేదు అనేకంటే, వారిలాగా నువ్వు కూడా చదవగలవు అని ప్రోత్సాహించాలి. అలాకాక విద్యార్థిని అవమానిస్తే లేదా దండిస్తే రైలు పట్టాలలాగా ఆ ఉపాధ్యాయుడు, విద్యార్థి ఎప్పటికీ దూరంగానే ఉంటారు. దీనివల్ల విద్యార్థి నష్టపోతాడు.



- ఉపాధ్యాయుడు చేప్పే విషయాన్ని శ్రద్ధగా ఆలకించని విద్యార్థిని అపరాధిగా చూడకూడదు. అతనిలో శ్రద్ధను ఉపాధ్యాయుడే పాదుగొల్పాలి.
- ఉపాధ్యాయుని బోధనా క్రమంలోకి రాలేని విద్యార్థి జడుడు కావచ్చు. కానీ అలాంటి విద్యార్థిలో చైతన్యాన్ని, స్ఫూర్తిని, జిజ్ఞాసను నింపే ప్రతిభ ఉపాధ్యాయునిలో తప్పక ఉండాలి.

**భావి దీపధారి విద్యార్థి**

- విద్యార్థి పాఠశాలలో ఒక సన్యాసిగా మెలగాలి. అంటే చదువు తప్ప ఇతర ఆలోచనలు అతడి మదిలో ఉండకూడదు.
- తనలోని అవిద్యను ఉపాధ్యాయుడెందుకు తొలగిస్తున్నాడో శిష్యుడు గ్రహించి విద్యాభ్యాసం చేయాలి. అప్పుడతని మనసులో విద్య ఎందుకు నేర్చుకుంటున్నాను. విద్యను నిర్బంధముగా నేర్చుకుంటున్నాను అనే భావన ఉండదు. అప్పుడే అతడు విద్యలో ఉత్తమంగా రాణిస్తాడు.
- హారంలో పూసలు మారినట్లు ప్రతి తరగతికి విషయాలు మారుతుంటాయి. విద్యార్థి మాత్రం హారంలోని బంగారు గొలుసులాగ ప్రతి తరగతిలోనూ తానే ఉంటానని భావించి, కొత్త తరగతిలో కొత్త విషయాలు నేర్చుకోడానికి సిద్ధ పడాలి.
- తరగతి గదిలో చెప్పిన సుద్దులు శుద్ధముక్క, నల్ల బోర్డు వరకే అన్నట్లుగా బయటకు రాగానే వాటిని దులిపేసుకునే తీరుగా విద్యార్థి ఉండరాదు. తరగతి గదిలో నేర్చుకున్న విజ్ఞాన, సామాజికపరమైన ప్రతి అంశం బాహ్య ప్రపంచంలో చూసి, తాను నేర్చుకొన్న దానితో అనుసంధానం చేయగలగాలి. అప్పుడే తను నేర్చుకున్న విద్యను చక్కగా గుర్తుంచుకో గలుగుతాడు.

మేకొబైల్ ఫోన్లు, చెప్పులు ఖరీదైన దుకాణాల్లోనూ, విలువైన పుస్తకాలు సాధారణ దుకాణాల్లోనూ, కొన్ని చోట్ల విలువైన పాత పుస్తకాలు ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న ఈ ఆధునిక యుగంలో ఇప్పటి విద్యార్థులున్నారు. వారికి పుస్తకాలకు ఇవ్వవలసిన సరైన ప్రాధాన్యత గురించిన అవగాహన, మార్గదర్శనం ఉపాధ్యాయులే చేయాలి. ఒక పపుస్తక రచయత ఇలాగంటాడు. "నేను పుస్తకము అనే ఒక రోగిని కప్‌బోర్డులో చూసాను. దానిని రోగిష్టిని చేసింది ఎవరిని ఆరా తీస్తే మొబైల్ ఫోన్ అని తెలిసింది" అని ఒక రచయిత వాపోయారు. ఇలాంటి మొబైల్ ఫోన్ అనే చెదలు చక్కటి జ్ఞానభాండాగారములైన పుస్తకాలను తినేస్తున్న యుగంలో మన విద్యార్థులున్నారు. మొబైల్ ఫోన్‌తో కూడా విషయాలు తెలుసుకోవచ్చు. కానీ దానిలో ఇతర అనవరసమైన విషయాలే ఎక్కువ కదా! అది విద్యార్థుల విలువైన సమయాన్ని హరిస్తుంది కదా!

**పద్మవ్యూహంలో పాఠశాల**

- ఇదివరకు పాఠశాల అంటే ఒకే అంతస్తు కలిగిన విశాలమైన భవనాలు, తరగతి గదుల్లోకి ధారాళంగా గాలి, వెలుతురు, విశాలమైన క్రీడా మైదానం, చెట్లతో అలరారుతూ ఉండేది. కాలక్రమేణా పాఠశాల తన పూర్వవైభవాన్ని కోల్పోయింది. సైనిక పాఠశాలలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని కొన్ని పాఠశాలలు ఇప్పటికీ అప్పటి బడి వాతావరణాన్ని పరిరక్షించడంలో కృషి చేస్తున్నాయి. ఇవి కాకుండా చాలా వరకు పాఠశాలలు చిన్న చిన్న భవనాల్లో, ఇరుకు గదుల్లో, ఒకే మెట్ల మార్గంతో, 3,4 అంతస్థులలో, 300 నుండి 400 గజాల స్థలంలో నివాసానికి కట్టిన భవనాల్లో విద్యా బోధన చేస్తున్నాయి. వీటిలో ఎన్నో అసౌకర్యాలు, భద్రతా లోపాలుండే అవకాశముంది. హీనపక్షంగా ఇలాంటి పాఠశాలలో 200 నుంచి 300 మంది విద్యార్థులు వివిధ తరగతులలో విద్యను అభ్యసిస్తుంటారు.
- చిన్న పాఠశాలల్లో కావలసినన్ని మరుగుదొడ్లు ఉండవు, ఉన్నా శుభ్రంగా ఉండవు. క్రీడా మైదానం కనిపించవు. చెట్ల ప్రసక్తి ఉండదు. పిల్లలకు విరామ సమయంలో ఆటవిడుపుకు ఖాళీ స్థలాలు ఉండవు. ఇది ఆలోచించాల్సిన విషయం.
- చాలావరకు పాఠశాల భవనాలు ఇళ్ల మధ్యలో ఉంటున్నాయి.అగ్నిమాపక పరికరాలు అంతంత మాత్రంగానే ఉంటాయి. ఏదైనా విపత్తు సంభవిస్తే విద్యార్థులు త్వరగా బయటకు వెళ్లడానికి చిన్న మెట్ల దారులు, చిన్న చిన్న తలుపులు చాలా ఇబ్బందికరంగా ఉంటాయి.
- కొన్ని పాఠశాలలు వాణిజ్య భవన సముదాయాల్లో విద్యాబోధన చేస్తుంటాయి. ఇలాంటి చోట పై అంతస్థులో పాఠశాల ఉంటే కింద అంతస్థుల్లో సూపర్ మార్కెట్, తదితర వ్యాపార సంస్థలు కార్యకలాపాలు సాగిస్తుంటాయి. పాఠశాలతో పాటుగా వీటన్నింటికీ ఒకటే మెట్ల దారి, రాకపోకలు ఒకే మార్గం ఉంటుంది.
- చిన్న చిన్న వీధుల్లో, ఇరుకు భవనాల్లో నడిచే పాఠశాలలు విద్యార్థులకు స్వచ్ఛమైన, ప్రశాంత వాతావరణాన్ని ఏవిధంగా కల్పిస్తాయనేది ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన విషయం.
- కొన్ని పాఠశాలలకు అనుబంధంగా విద్యార్థి వసతి గృహాలు ఉంటున్నాయి. విద్యార్థులకు ఆహారాన్ని సమకూర్చడానికి వంటశాలలు ఉంటున్నాయి. అయితే ఆహారంలో నాణ్యతా లోపం విద్యార్థులకు ఇబ్బందిగా మారుతున్న వైనాన్ని మనం తరచుగా చూస్తుంటాము, వింటూ ఉంటాము.

పై విషయాలను పరిష్కరించడం ఏ ఒక్కరి వల్లా కాదు. వీటి పరిష్కారానికి అటు ప్రభుత్వము, ఇటు పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు కలిసికట్టుగా నడుం బిగించాలి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. విద్యార్థులకు విద్యాబోధనతో పాటుగా, ఆధునిక విద్యావిధానంలో సనాతన విద్యా విధానాన్ని, విలువలను సమ్మిళిత పరచడంలో తమవంతు బాధ్యతను నిర్వర్తించాలి.

"మాతృదేవో భవ! పితృ దేవోభవ! ఆచార్య దేవో భవ!"

– మహావాది రామకృష్ణ



**ఎట్టకేలకు మన ముఖ్యమంత్రి, ఓటర్లకు డబ్బులు పంచకుండా ఎన్నికలు జరపాలని, దానికి ప్రజలు సహకరించాలని స్త్రీ శక్తి సమావేశంలో అనడం ఆహ్వానించదగిన విషయం. ఇది నిజంగా జరిగితే ఎంపీల నుండి కిందిస్థాయి పంచాయతీ వరకు అవినీతి తక్కువ చేస్తారు. కొంత రాజకీయ అవినీతి నియంత్రితం అయ్యేందుకు అవకాశం ఉంది.**

# ఓటర్లు సరే, నాయకుల తీరూ మారాలి

అసలు అభ్యర్థికి పార్టీ టికెట్ ఇచ్చేటప్పుడే అతని ఆర్థిక పరిస్థితి ఏమిటి? ఎన్ని కోట్లు ఖర్చు పెట్టగలడు? ఓటర్లకు డబ్బులు పంచే సామర్థ్యం ఉందా లేదా? అనే విషయాన్ని బేరీజువేసుకొని టికెట్ ఇచ్చే పరిస్థితి రాజకీయ పార్టీలలో ఏర్పడింది. తమ పార్టీ అభ్యర్థి గెలవాలి అనే అభిప్రాయం పార్టీలకు ఉండటమే కారణమైనా అందులో మార్పు రావాలి. (మరి గెలిచిన తర్వాత ఆ అభ్యర్థి అంతకు డబుల్‌గా సంపాదించుకోవడానికి పార్టీలు ఆమోదిస్తున్నాయా)

అప్పటివరకు ఆ పార్టీ నాయకుడు నిత్యం ప్రజలకు ఉపయోగపడిన వైనం, చేసిన అభివృద్ధి వంటివన్నీ దృష్టిలో ఉంచుకోకపోవడం అత్యంత దురదృష్టకరమైన విషయం. పార్టీలు అలా వ్యవహరిస్తే సామాన్యుడు రాజకీయాల్లో ఎందుకు పని చేయాలి? కింది స్థాయి నుండి కార్యకర్తలు లేకపోతే వ్యవస్థ బలహీనపడుతుంది. రకరకాల బాధ్యతలు రాజకీయరంగంలో ఉన్నాయి. సిద్ధాంత పరమైన రాజకీయాలలో కార్యకర్తలు వచ్చేది, పనిచేసేది నాయకులకు జేజేలు కొట్టడానికి కాదు.

గత 35 సంవత్సరాలుగా ఓటర్లకు డబ్బులు ఇవ్వడం ప్రారంభించారు. తొలుత 200 రూపాయ లుగా ఉన్న ఆ మొత్తం, నేడు రెండు, మూడు వేలకు చేరింది. భవిష్యత్తులో అది ఇంక ఎంత పెరుగు తుందో ఎవరికీ తెలియదు. కొన్ని పంచాయతీలలో వేలకు వేలు ఇస్తున్నారు (ఇదంతా మనం కట్టే పన్ను డబ్బే కదా అని సామాన్య ప్రజల అభిప్రాయ పడుతున్నారు. పైగా, వాళ్ళు ఇస్తున్నారు మేం తీసుకుంటున్నాము అనే అభిప్రాయంలో ఉన్నారు) దీనిని ప్రారంభించింది ఎవరు? ఎందుకు మొదలు పెట్టారు? ఏమి ఆశించి అమలు చేస్తున్నారు? అనే విషయాల మీద అందరికీ అవగాహన ఉంది. కానీ రాజకీయ పార్టీలలో, చిన్న స్థాయి నాయకులు నుండి పెద్ద స్థాయి నాయకులలో, ప్రజలలో మార్పు రావాలి. ఆ మార్పుకు అన్ని వర్గాలూ సంకల్పించు కొని, పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోటీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రధాన పార్టీల ప్రతినిధులు అందరూ వారికి నమ్మకం ఉన్న ఓటర్లకు డబ్బు పంచడం నుంచి మొదలై చివరకు 80% 90% ఓటర్ల వరకు పంచున్నారు.

నా వ్యక్తిగత అనుభవం ఒకటి పంచుకుంటాను. 2021 ఎన్నికల్లో నేను ఇన్చార్జిగా ఉన్న ఒక మున్సిపల్ డివిజన్‌లో మొత్తం ఓటర్ లిస్ట్ ప్రకారం ఓటర్లు7,200. నిజంగా ఉన్న ఓట్లు 6,000. గతంలో అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థి 5,000 ఓట్లకు డబ్బులు ఇచ్చాడు. ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థి 4,000 ఓట్లకు డబ్బులు ఇచ్చాడు. కానీ ఫలితాలు చూస్తే ఎక్కువ డబ్బులు ఇచ్చిన అభ్యర్థికి వచ్చిన ఓట్లు 1,400 ఆ తర్వాత అభ్యర్థికి వచ్చిన ఓట్లు 1,050, బీజేపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు 420. ఇలా ఎందుకు జరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

ప్రధానంగా పోటీలో ఉన్న పార్టీల వారు 70% కు తగ్గకుండా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఈ డబ్బులు స్థానిక నాయకుల ద్వారా పంపిణీ చేయడం మనకందరికీ తెలిసిందే. 'ఆ కాలనీకి ఇవ్వకపోతే వారు ఓటుకు రారు, ఈ వీధిలో వారికి ఇవ్వకపోతే వీళ్ళు ఓటుకు రారు' అని స్థానిక నాయకులే మొదలుపెడతారు. (ఇక్కడ ఓటర్ స్వార్థంతో పాటుగా, స్థానిక నాయకుల స్వార్థం కూడా ఉందనేది గమనించవలసిన విషయం) ఓటు వేయకపోవడం నిజమే కానీ, వచ్చిన ఓటరు ఎవరికి ఓటు వేస్తున్నాడు అనే విషయం ఎవరికీ తెలియదు. మన రాజ్యాంగ వ్యవస్థలో ఓటు అనేది గోప్యమైన వ్యవస్థ. ఒకవేళ ఓటుకు రాలేదు. ఏమవుతుంది? ఒక ఎన్నికల్లో రాకపోతే ఇంకొక ఎన్నికలకు తప్పకుండా వస్తారు. అయితే, ప్రభుత్వం చట్టపరంగా ఓటు వేయడాన్ని తప్పనిసరి చేసే ఇంకొక రకంగా ఆలోచన చేయాలి (సరైన కారణం లేకుండా ఓటు వేయకపోతే తెల్ల రేషన్‌కార్డు పనిచేయదనో లేక ఇంకేదైనా ప్రభుత్వ పథకం రాదనో, జీఎస్టీ,ఐటీ కట్టించుకోరనో మాట ప్రజలలో రావాలి). ఉత్తరాది రాష్ట్రాలలో డబ్బు పంచకుండానే 90% ఓటింగ్ జరుగుతుందని కూడా చెప్తుంటారు. సహజంగా ఓటింగ్ పర్సంటేజీ (ఓటర్ల లిస్టు కరెక్ట్‌గా ఉంటే)75% నుండి 85% వరకు ఉంటుంది. రాజకీయ పార్టీ అభ్యర్థులేమో అందరూ కలిసి 170% నుండి200% వరకు డబ్బు ఇస్తుంటారు. మరి ఓటు వేసిన వారు ఏ అభ్యర్థికి వేశారనేది ఎవరికి తెలుస్తుంది? మరలాంటప్పుడు ఎందుకు డబ్బులు ఇస్తున్నట్టు?

ఎన్నికల కమిషన్ గరిష్ఠ ఓటింగ్ జరగాలి అని మంచి నిర్ణయం తీసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాన్ని తెలియజేసేది ఓటు ద్వారానే. ప్రజలకు ఓటు అనేది ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చేఒక ఆయుధం. ప్రభుత్వాలను, పార్టీలను,అభ్యర్థులను మార్చాలంటే, ఇష్టమైన వారిని, నిజాయతీ కలిగిన వారిని, ప్రజలలో పనిచేసేవారిని, మంచి పార్టీ అభ్యర్థిని ఎన్నుకోవాలంటే ఓటు ఒక్కటే ఆయుధం.

అయితే ఇక్కడ మారవలసింది, గట్టి నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వం, పార్టీలు అభ్యర్థులు మాత్రమే ఓటర్లు మాత్రం కాదు. కొన్ని చోట్ల డబ్బులు ఇస్తే కానీ ఓటుకు రాము మీరు డబ్బులు ఇస్తే మీకే వేస్తాం అంటారు. అక్కడే రాజకీయపార్టీలు, అభ్యర్థులు నిలకడగా గట్టిగా ఉండగలగాలి. ఒక చెడ్డ వ్యవస్థ మారాలంటే త్యాగం చేయవలసిన వారంతా చేయాలి అప్పుడే మార్పు సాధ్యం ఆలోచించండి.

**– కరణం భాస్కర్, 7386128877.**
**బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు,**

**శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవంతుడు (కృష్ణస్తు భగవాన్ స్వయమ్), అన్నిటిని చేసేవాడు కనుక కృష్ణుడు (సర్వం కరోతీతి కృష్ణః) అని మహర్షులు కీర్తించారు. ఆయన నరులలో ఉత్తముడు. కార్యకుశలుడు, శూరుడు, రాజనీతి నిపుణుడు, జ్ఞాని, సర్వగుణాలు మూర్తీభవించిన షోడశ కళామూర్తి. తన జీవితంలోని వివిధ దశలలోని చేష్టలు, చర్యలు, ధర్మరక్షణ యత్నాలు ఇలా... ప్రతి అంశమూ మానవాళికి దిశా నిర్దేశం చేసేదే.**

# కృష్ణ తత్వం మానవ జీవితసారం



భారత, భాగవత కృష్ణతత్వాలలో సున్నిత భేదం గోచరిస్తుంది. భాగవతంలోని కృష్ణయ్య అమాయక బాలుడు, సున్నిత స్వభావుడు. మహా భారత కృష్ణుడు దార్శనికుడు, రాజకీయ చతురుడు, వ్యూహకర్త. ఈ రెండు కావ్యాల్లోని మరుపురాని మధురఘట్టాలకు శ్రీకృష్ణుడు మూలకారకుడు మాత్రమే కాదు. అవతరించినది మొదలు మహా నిర్యాణం వరకు మానవమానాలను ఎదుర్కొన్నాడు. 'వెన్నా మన్ను సమముగ తిన్న' ఆయన వాటన్నిటిని తేలిగ్గా తీసుకున్నాడు. కష్టసుఖాలు, సుఖదుఃఖాలు, ఎగుడు దిగుడులు జీవితంలో భాగమంటూ, వాటిని ఎలా అధిగమిస్తూ, జీవితాన్ని ఎలా ఆనందమయం చేసుకోవాలో మానవజాతికి పాఠాలు నేర్పిన చైతన్యమూర్తి. పాలకుల నుంచి పాలితుల దాకా వ్యవహరించ వలసిన తీరును బోధించాడు. సవాళ్ల, సమస్యల నుంచి పలాయనం చిత్తగించడం నాయకత్వ లక్షణం కాదని, సమయమెరిగి వ్యవహరించాలని నేర్పాడు. 'నెగ్గడం, తగ్గడం' ఎరిగిన వాడు. ఆ వ్యూహంతోనే శత్రువులను తుద ముట్టించాడు. సర్వవేదాంతసారం గీతాశాస్త్రాన్ని మానవాళికి అందించి మార్గదర్శనం చేశాడు.

అధికారం కంటే ప్రజాసంక్షేమమే ప్రధానమని చాటాడు. మేనమామ కంస వధ తరువాత మగధ రాజ్యాధిపత్యం చేపట్టాలన్న మాతామహుడి (ఉగ్రసేనుడు)కోరికను మృదువుగా తిరస్కరించాడు. 'నా కుమారుడు కంసవధతో వీరధర్మంగా రాజ్యం నీకు సంక్రమించినట్లే. పైగా వయోభారం కారణంగా రాజ్యభారం వహించలేను' అన్న తాత మాటలకు, 'నాకు రాజ్యకాంక్ష ఎన్నడూ లేదు. కంసుడిని చంపింది రాజ్య లోభంతో కాదు('నహి రాజ్యేన మే కార్యం/ నాప్యహం నృప కాంక్షితః/న చాపి రాజ్యలబ్ధేన/మయా కంసో నిపాతితః')అని కృష్ణుడు వినయంగా బదులిచ్చాడు. నేను గోవుల మధ్య అడవుల్లో తిరిగేందుకు పోతాను ('అహం స ఏవ గోమధ్యే/ గోపై స్సహ వనే తరః') అనీ విన్నవించాడు.

కన్నయ్య భక్తజనపక్షపాతి. పెద్దల్లో పెద్ద...పిన్నల్లో పిన్న. అందునా...అమ్మంటే ఎంతెంతో ఇష్టం. జగన్నాథుడైనా ఆమె ముందు పసిబాలుడే. ఆదిమధ్యాంత రహితుడు పాలకతల్లి యశోద వద్ద అమాయక శిశువుగా వర్ధిల్లాడు. అమ్మ చేతి మూరెడు తాడుకు బందీ అయ్యాడు.

**'చిక్కడు సిరి కౌగిటిలో**
**జిక్కడు సనకాది యోగిచిత్తాబ్జములన్**
**చిక్కడు శ్రుతి లతికావళి**
**జిక్కెనతడు లీల దల్లి చేతన్ రోలన్'...** –లక్ష్మీదేవి కౌగిలికి, వేదవేత్తలకు, సనకాదిమునుల చిత్తాలకు చిక్కనివాడు ప్రేమమయి అయిన తల్లి చేతికి లీలావిలాసంగా దొరికిపోయాడని పోతనామాత్యుడు, చిన్నికృష్ణుడి లీలను వర్ణించారు. ఇద్దరు తల్లుల (దేవకి, యశోద) ముద్దుల తనయుడిని 'ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు/ తిద్దరాని మహిమల దేవకీసుతుడు' అని అన్నమాచార్య కీర్తించారు.

కృష్ణయ్యను స్నేహతత్వానికి నిలువెత్తు నిదర్శనంగా అభివర్ణిస్తారు. స్నేహ మధురిమలను అనంతర యుగాలకు పంచాడు. 'కృష్ణమిత్ర మండలి'లో చోటు దక్కడం ధన్యమైనట్లుగా భావించే వారట. ఆ జట్టులో చేరిన వారి యోగక్షేమాల బాధ్యత ఆయనదే.

**అష్టమి' విశిష్టత...**

దేవకీనందనుడు శ్రావణ బహుళ అష్టమినాడు జన్మించినందున 'జన్మాష్టమి' అని, ఆయనకు నామకరణానంతరం 'కృష్ణాష్టమి', బాల్యం గోకులంలో గడపడం వలన 'గోకులాష్టమి' అని, శ్రీకృష్ణుని జన్మదినం కనుక 'శ్రీకృష్ణ జయంతి' అని, లోకానికి శ్రీకరం కనుక 'శ్రీజయంతి' అని వ్యవహారంలోకి వచ్చింది.



దేశవ్యాప్తంగా అన్ని వైష్ణవ ఆలయాలలో కృష్ణాష్టమి వేడుకలు వైభవోపేతంగా జరుగుతాయి. గుజరాత్‌లోని ద్వారకలోని ద్వారాకాధీశుని ఆలయంలో, ఉత్తరప్రదేశ్ మధురలో, బృందావనంలో, ఒడిశాలోని పురీ జగన్నాథస్వామి, కేరళలోని గురువా యూర్‌లోని గురువాయూరప్పన్, చెన్నైలోని పార్థసారథి స్వామి, తిరువాయూరులోని రాజగోపాల ఆలయం, కర్ణాటకలోని ఉడిపి శ్రీకృష్ణాలయం తదితర ప్రముఖ ఆలయాలు ప్రత్యేక అలంకరణలతో కనువిందు చేస్తాయి. దేశ విదేశాలలోని 'ఇస్కాన్' మందిరాలు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాయి. తిరుమలలో శ్రీనివాసమూర్తి ఆ రోజు ప్రత్యేకంగా కొలువు తీరతారు. దీనిని 'గోకులాష్టమి ఆస్థానం'గా వ్యవహరిస్తారు.

కృష్ణయ్య రోహిణీ నక్షత్రంలో రాత్రి అవతరించి నందున భక్తులు ఆ తిథినాడు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం పూజాదికాలు నిర్వహిస్తారు.

సమస్త ప్రాణుల్లో నివాసం ఉండడం, దేవతలలో ఆయనలో కొలువుదీరి ఉండడం వల్ల వాసుదేవ అనే పేరువచ్చింది (వాసనాత్ సర్వభూతానాం వసుత్వాత్ దేవ యోనితః....) అని వ్యాసభారతం పేర్కొంటోంది.

**'కృష్ణం కమలపత్రాక్షం పుణ్యశ్రవణ కీర్తనమ్**
**వాసుదేవం జగద్యోనిం నౌమి నారాయణమ్ హరిమ్'**



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్




# ఘన చరిత్రకు లైడెన్ తామ్ర

లైడన్ రాగిరేకులను మొదటి రాజేంద్ర చోళుడు జారీ చేశాడు. ఈ శాసన పత్రంతో రెండు భాగాలున్నాయి. ఒకటి సంస్కృతం విభాగం (5 ఫలకాలు) చోళరాజ వంశావళిని వివరిస్తుంది. ఇది విష్ణుస్తోత్రంతో, పౌరాణిక (సౌర) పూర్వీకుల పేర్లతో ప్రారంభమవుతుంది. తమిళ విభాగం మొదటి రాజేంద్ర చోళుని తండ్రి అయిన రాజరాజు (క్రీ॥శ॥ 985-1012) పాలన గురించి వివరిస్తుంది. శాసనం ప్రకారం మొదటి రాజరాజు పాలన చేపట్టిన 21వ సంవత్సరంలో, ఒక బౌద్ధ విహారాన్ని నిర్మించడం కోసం ఒక గ్రామం అనై మంగళంతో పాటు 26 పరిసర గ్రామాల మొత్తం ఆదాయాన్ని, దాని భూమిని దానం చేయాలని ప్రకటించాడు. కోరమండల్ తీరంలోని ఓడ రేవు పట్టణమైన నాగపట్టణంలో శ్రీవిజయ (ఇండోనేషియా) మలయరాజు ఈ విహారాన్ని నిర్మించాడు. రాజేంద్ర చోళుని ముద్రను కలిగున్న ఒక భారీ కంచు ఉంగరంతో కలిపి ఉంచిన 21 రాగిఫలకాలు 5 ఫలకాలపై గ్రంథ లిపిలో సంస్కృత వచనం ఉండగా 16 ఫలకాలపై తమిళ వచనం ఉంది. 1703-1712 మధ్య బాటలియాలో మతగురువుగా పనిచేసిన ఫ్లోరింటియస్ క్యాంపర్ భారతదేశం నుండి తీసుకు వెళ్లారు. తరువాత అవి అతని మనుమరాలు జోహన్నా కాంపర్ అధీనంలోనికి వచ్చాయి. చివరకు నెదర్లాండ్‌లోని లైడెన్ విశ్వవిద్యాలయ గ్రంథలయానికి చేరుకున్నాయి.

సుమారు 300 ఏళ్ల తరువాత భారతదేశం చేసిన దౌత్య పరమైన ప్రయత్నాల ఫలితంగా 2026 మే16న భారత ప్రధాని నరేంద్ర మోదీకి డచ్ ప్రధాని రాబ్ జెటెన్ అధికారికంగా లైడెన్ కాపర్ ప్లేట్స్‌ను అందజేశారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ "ఇది ప్రతీ భారతీయుడు గర్వించ దగ్గ క్షణం, మన పూర్వీకుల గొప్పదనాన్ని చాటే ఈ చారిత్రక ఆధారాలను భద్రపరిచినందుకు నెదర్లాండ్స్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.

చారిత్రక పరిశోధకులు ఈ పరిణామాన్ని కేవలం ఒక వస్తువు తిరిగి రావడంలా చూడటం లేదు. ప్రముఖ చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం చోళుల కాలంలోనే భారత్‌కు ఆగ్నేయాసియా దేశాలతో ఎంతటి బలమైన సముద్ర వ్యాపార, సాంస్కృతిక సంబంధాలు ఉండేదో చెప్పడానికి ఈ లైడెన్ ప్లేట్స్ అతిపెద్ద నిదర్శనం, వలసరాజ్యాల కాలంలో దోపిడీకి గురైన మన వారసత్వాన్ని, సొంతం చేసుకునే హక్కు భారత్‌కు ఉందని ఈ ఘటన నిరూపించింది. ఈ శాసనాలు భారత్‌కు తిరిగి రావడానికి వెనుక 2012 నుంచి సాగుతున్న దౌత్య ప్రయత్నాలే కారణం. యునెస్కో కూడా భారత్ వాదనను సమర్థించింది. అంతర్జాతీయ దౌత్యంలో పెరుగుతున్న ప్రభావానికి మన సంస్కృతిని కాపాడుకోవటంలో భారత్ చూపిస్తున్న పట్టుదలకు ఈ విజయం ఒక ఉదాహరణ. ఎన్నో వజ్రాలు ప్రధానంగా కోహినూరు, లండన్ మ్యూజియంలో కల ఎన్నో కళాఖండాలను వెనక్కి రప్పించాల్సి ఉంది.

లైడెన్ రాగి శాసనాలలోని 16 తమిళరేకులలోని 5 సంస్కృత రేకుల పూర్తి సారాంశం ఈ కింది విధంగా వుంది. తమిళ భాగం పూర్తిగా పరిపాలన, భూమి కొలతలు, పన్ను మినహాయింపులను వివరిస్తున్నది.

భూదాన ప్రకటన (రాయల్ డిక్రీ) దాత: చోళ చక్రవర్తి 1వ రాజరాజ చోళుడు (కీ॥శ॥ 985-1014) ఈ దానాన్ని నోటి ద్వారా ఆదేశించగా అతని కుమారుడైన 1వ రాజేంద్రచోళుడు, తండ్రి మాటను గౌరవిస్తూ రాగిరేకులపై శాసనాన్ని ప్రకటించాడు. దానం పొందిన సంస్థ నాగపట్టణంలో ఇండోనేషియా రాజు (శ్రీవిజయ సామ్రాజ్యం) శ్రీమార విజయోత్తుంగ వర్మన్ నిర్మించిన చూడామణివర్మ బౌద్ధ విహారానికి దానంగా ఇచ్చిన గ్రామం "అనై మంగళం". ఈ గ్రామంలో వచ్చే మొత్తం ఆదాయంను బౌద్ధ సన్యాసుల ఆహారం, వసతి, విహార నిర్వహణకోసం కేటాయించారు.

ఈ రాగిరేకులలో అత్యధిక భాగం ఈ గ్రామానికి ఇచ్చిన పన్ను మినహాయింపే ఉంది. దీనిని తమిళంలో "పళ్లించందమ్" అంటారు. అంటే, బౌద్ధజైన సంస్థల కిచ్చేదానం. ఈ గ్రామవాసులు చోళ ప్రభుత్వానికి ఎటువంటి పన్ను కట్టవలసిన పనిలేదు ముఖ్యంగా, కడమై (భూమి పన్ను) కుడిమై (వ్యక్తిగత పన్నులు) అరిగాడి ప్పాట్టం (గ్రామ సంతలపై పన్ను) తరి-ఇరై (చేనేత కార్మికుల మగ్గాలపై చెల్లించే పన్ను) తట్టు కాయం (స్వర్ణకారులు చెల్లించే పన్ను) ఈళంపూచ్చి (కల్లు గీసే వారిపై వేసే పన్ను) నాడుకావల్ (గ్రామ (రక్షకులు) కావలి కాసేటందుకు విధించే పన్ను) ఇవన్నీ బౌద్ధ విహారానికి చెందేటట్లు మినహాయింపు.

భూదానాన్ని అమలుచేయడానికి ఒక పెద్ద ప్రభుత్వ యంత్రాంగం పనిచేసింది. అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. అనైమంగళ గ్రామసభ క్షత్రియ శిఖామణి- వళనాడులో జరిగింది (తంజావూరు ప్రాంతం). ఇది పట్టణ కూర్రం అనే జిల్లాలో ఉండేది. దానం అమలు చేయడానికి గ్రామపెద్దలందరూ సమావేశమయ్యారు. "తిరుమందిర-ఓలై" రాజు పక్కనే ఉండిరాజు నోటిమాట ద్వారా ఇచ్చే ఆదేశాలను తాటిఆకులపై వ్రాసుకునే రాజకీయ కార్యదర్శి (రాయల్ స్క్రైబ్) ఉంటాడు. ఈ ప్రక్రియను ధ్రువీకరిస్తూ గ్రామపెద్దలు, రెవెన్యూ అధికారులు సాక్షులుగా సంతకాలు చేశారు "పురవు-వరి-త్తిణైక్కళమ్" ఇది చోళులకాలం నాటి లాండ్ రెవెన్యూ శాఖ. వీరు ఈ అనై మంగళ గ్రామ సరిహద్దును నిర్ణయించడానికి "పిడి శూజిందు" అనే పద్ధతిని అనుసరించారు. ఈ పద్ధతి ప్రకారం ఒక అధికారిక ఆడ ఏనుగును గ్రామ సరిహద్దుల వెంట నడిపిస్తారు. అది నడిచిన మార్గాన్ని బట్టి అనైమంగళ గ్రామ సరిహద్దులను నిర్ణయిస్తారు. నాలుగు వైపుల కచ్చితంగా కొలిచి రాశారు. సర్వేయరు ఏనుగు వెనుక నడిచి రాళ్లు పాతిస్తాడు. ఈ సరిహద్దుల్లో ఉన్న కాల్వలు, చెరువులు, బావులు, తోటలపై పూర్తి హక్కులను బౌద్ధ విహారానికి బదిలీ చేస్తారు.

నీటి పారుదల, వనరులపై హక్కులు దానం పొందినవారికే చెందుతాయి. వీరు దానం పొందిన భూముల్లో బౌద్ధ విహార నిర్వాహకులు కొత్తగా కాల్వలు తవ్వుకోవడానికి, నదీ జలాలను వాడుకోవడానికి పూర్తి అనుమతి ఉంది. గ్రామ భూముల్లో పెద్ద ఇళ్లు నిర్మించుకోవడానికి, ఉప్పు తయారు చేసుకోవడానికి, ఔషధ మొక్కలు, కొబ్బరి మొక్కలు నాటుకోవడానికి హక్కులు కలిగుంటారు.

లైడెన్ రాగి ఫలకాలలో పొందుపరచిన రాజరాజచోళుడి రాజవంశచరిత్ర, దాని వెనుక ఉన్న విశేషాలు సంస్కృతంలో ఉన్నాయి. చోళ రాజులు ఈ రాగి ఫలకాలపై తమ వంశావళిని సంస్కృత భాషలో చాలా వివరంగా చెక్కించారు. చోళులు తాము సూర్యవంశానికి చెందిన వారమని, ఈ వంశవృక్షావళి సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు, మహావిష్ణువు ప్రార్థనలతో ప్రారంభమవుతుంది. మనువు, శ్రీరామచంద్రుడు జన్మించిన సూర్యవంశంలోనే తాము జన్మించామని పేర్కొన్నారు.

రాగి ఫలకాల ప్రకారం కరికాల చోళుడు, విజయాలయ చోళుడు, ఆదిత్య చోళుడు, పరాంతకచోళుడు, సుందరచోళుడు, రాజరాజ చోళు

# ఆనవాళ్లు శాసనాలు

డు, రాజేంద్ర చోళుడు పరిపాలించినట్లు లైడెన్ శాసనాలు చెప్తున్నాయి. చోళులు హిందువులు అయినా ఒక విదేశీ బౌద్ధ విహారానికి అంతపెద్ద దానం చేయడం వారి విశాల హృదయానికి నిదర్శనం. అంతర్జాతీయంగా భారతదేశానికి ఆగ్నేయాసియా ఇండోనేషియా, మలేషియాతో మంచి సంబంధాలుండేవని ఈ లైడాన్ రాగి రేకుల ద్వారా తెలుస్తున్నది.

ఒక దేశ పాలకుడు, సామ్రాజ్య చరిత్రను పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తాడు. వారు చారిత్రక స్పృహతో పురావస్తు సంరక్షణ, వారసత్వ ప్రదేశాల రక్షణ, సాహిత్య ప్రోత్సాహం, మ్యూజియంల నిర్మాణం శాసనాల అధ్యయనం, నిష్పక్షపాత చరిత్ర రచనలు చేయించాలి.

ఈ రాగి ఫలకాలు చోళ చక్రవర్తి 1వ రాజరాజ చోళుడు, పాలనా కాలానికి చెందినవి. ఈ ఫలకాలను క్రీ॥శ॥ 985-1014 మధ్యకాలంలో రూపొందించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఇవి 21 పెద్దరాగి ఫలకాలు మూడు చిన్నవి సుమారు 30 కిలోల బరువున్నాయి. తమిళనాడు నాగ పట్టణంలోని బౌద్ధవిహారం "చూడామణి విహారం"ను కీ॥శ॥1006లో శైలేంద్ర రాజవంశానికి చెందిన శ్రీ విజయన్ రాజు శ్రీ మార విజయత్తుంగ వర్మన్ చోళ చక్రవర్తి 1వ రాజరాజ (985-1014) నుండి పొంది నిర్మించారు. సమకాలీన శాసనాలలో రాజరాజేశ్వరం పెరుంపల్లి అని కూడా ఈ విహారాన్ని పిలిచేవారు. ఈ విహారం హిందూ మహా సముద్రం అంతటా సాంస్కృతిక, మతపరమైన మార్పిడులను సులభతరం చేసే మహాయన బౌద్ధ సంస్థగా పనిచేసింది. శ్రీ విజయ పంపిన బుద్ధుని కాంస్యవిగ్రహాల వంటి విరాళాలను స్వీకరించింది. మధ్యయుగ దక్షిణ భారతదేశంలోని చివరి ప్రధాన బౌద&ధ కేంద్రాలలో ఒకటి, చోళ రాజ్యాన్ని ఆగ్నేయాసియా దేశాలతో అనుసంధించే సముద్రయాన బౌద్ధానికి కేంద్రం నాగపట్టణం. దాని పాత్రను ఇది నొక్కి చెప్పింది. అయితే పూర్తి వివరాలు తమిళనాడు పురావస్తుశాఖ వారి పరిశోధనలలో తేలాల్సుంది.

చోళుల పోషణలో క్రీ॥శ॥ 1006 ప్రాంతంలో ఈ మఠాన్ని నిర్మించిన శ్రీ విజయరాజు శ్రీ విజయమర విజయత్తుంగ వర్మ. తండ్రి చూడామణి వర్మన్‌ను గౌరవించడానికే ఈ విహారానికి అనైమంగళం సమీపంలోని 26 గ్రామాలను దానం చేసినట్లు చోళరాజు ధ్రువీకరించినారు. చోళ-శ్రీవిజయ రాజ్యాల మధ్యగల దౌత్య సంబంధాలను ప్రతిబింబిస్తూ, నిరంతర దీపారాధన, మఠ నిర్వహణకు నిబంధనలతో మహాయాన బౌద్ధ కేంద్రంగా ఈ విహారం పాత్రను నొక్కి చెబుతుంది.

11వ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలోని చోళ సామ్రాజ్యాన్ని, ఆగ్నేయాసియాలోని శ్రీ విజయ సామ్రాజ్యంతో ముఖ్యంగా సుమిత్ర, మలయా ద్వీప కల్పంతో అనుసంధానించే సముద్ర బౌద్ధ నెట్‌వర్క్‌లలో చూడామణి విహారం ఒక ప్రముఖపాత్రను పోషించింది. ఈ మఠం శ్రీవిజయ రాజధాని అయిన "పాలెం బాంగ్" నుండి వచ్చిన 150 లేదా 200మంది సన్యాసులకు ఆశ్రయం



కల్పించింది. ఇది సిద్ధాంత అధ్యయనం,ఆచార సాధన కోసం ఆగ్నేయాసియా మత గురువులు భారతదేశంలో నిరంతరం ఉండటానికి వీలు కల్పించింది. ఈ ఏర్పాటు హిందూ మహాసముద్ర అనుసంధానంలో శ్రీవిజయ వ్యూహాత్మక పెట్టుబడిని ప్రతిబింబిస్తుంది. బిహార్‌లోని నలందా విశ్వవిద్యాలయంలో "అతిషా" వంటి శ్రీ విజయ పండితులు శిక్షణ పొందినారు. జావాలోని బోర్ బుదుర్‌లో కూడా శ్రీ విజయ పండితులు శిక్షణ పొందారు. జావాలోని బోర్ బుదుర్ వంటి ఆగ్నేయాసియా కేంద్రాల మధ్య బౌద్ధ యాత్రికులు, అవశేషాలు, రాత ప్రతుల ప్రవాహాన్ని సులభతరం చేసింది.

అతిషా దీపంకర శ్రీ జ్ఞాన (182-1054 సిఇ) భారతదేశంలోని విక్రమశిల మఠానికి మఠాధిపతి బెంగాలీ పండితుడు. ఇతడు ఇండోనేషియాలోని సుమిత్రా కేంద్రంగా పనిచేసిన బౌద్ధమఠాధికారి సెర్లింగ్‌పా ధర్మకీర్తి వద్ద 1011 ప్రాంతంలో విద్య నభ్యసించాడు. శ్రీ విజయ సామ్రాజ్యానికి సముద్ర యానం చేశాడు. తరువాత 1042లో టిబెట్టు వెళ్లి అక్కడ బౌద్ధాన్ని సంస్కరించాడు.

అతిషా సెర్లింగ్‌పాను అత్యంత ముఖ్యమైన ఆధ్యాత్మిక గురువుగా భావించే వారు. సెర్లింగ్‌పా పేరు విన్నప్పుడల్లా భక్తితో కన్నీళ్లు వచ్చేవని, ఆయన దగ్గర భోధి చిత్త, లోజోంగ్ (మనస్సు శిక్షణ) నేర్చుకున్నానని తన అత్యంత ప్రసిద్ధ గ్రంధమైన "జ్ఞానోదయ మార్గానికి దీపం" గ్రంథంలో నాసుకున్నాడు.

చోళరాజవంశం అధికార రాజముద్ర బొమ్మ, పులితోపాటు కొన్ని నాణేలు, ముద్రలలో రెండు చేపల బొమ్మ, ఒక్కవిల్లు ఉన్నాయి. చేపలు పాండ్య చిహ్నాము విల్లు చేరరాజుల చిహ్నాం. వాటిని తమ సామంతులుగా చేసుకున్నట్లుగా తెలియ జెప్పే చిహ్నాం. వారి జండాపై పులి బొమ్మ ఉంటుంది. దక్షిణ భారతంపై వారి సార్వభౌమాధికారాన్ని తెలియజేస్తుంది.

చైనా, శ్రీలంక, ఇండోనేషియా, మలేషియా నుండి వచ్చే బౌద్ధ సన్యాసులు, వ్యాపారులు నావికులు నాగపట్టణంలో ఎక్కువగా విడిదిచేసేవారు. వారి ప్రార్థనలు, బసకోసం ఒక అంతర్జాతీయ స్థాయి మఠం అవసరమై ఈ చూడామణి బౌద్ధ విహారం నిర్మించారు. ఈ విహారానికి నాటి చైనా చక్రవర్తి లియావో పెద్ద కాంస్య గంటలను కానుకగా పంపాడు. 1856లో నాగపట్టణంలో జరిపిన త్రవ్వకాల్లో 350 అరుదైన బుద్ధుని విగ్రహాలు లభించాయి. 1867లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వీటిని కూల్చివేసి నూతన కళాశాలలను నిర్మించింది.



డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

# యువతను పట్టించుకోవాలి

నీట్ వంటి సమస్య అయినా లేదా ఇతర వ్యవస్థాగత సమస్యలైనా, ఇవి యువతలో తమ భవిష్యత్తు గురించి ఆందోళనలను కలిగిస్తాయి. ఆ ఆందోళనలను అర్థం చేసుకుని, వాటిని పరిష్కరించడం అవసరం. కేవలం నిరసనలు లేదా అంతరాయాల ద్వారా పరిష్కారాలు లభించవు. సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో వ్యవస్థను మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సమాజం కలిసి పనిచేయాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) పిలుపునిచ్చింది. ఆర్ఎస్ఎస్ స్ఫూర్తితో విశాఖపట్నం, గుడిలోవ, విజ్ఞాన విహార రెసిడెన్షియల్ స్కూల్ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు జరిగిన వివిధ సంస్థల అఖిల భారతీయ సమన్వయ్ బైఠక్ ఆగస్టు 21న ముగిసింది. సంఘ ప్రేరణతో సమాజం కోసం, దేశం కోసం వివిధ రంగాలలో పనిచేస్తున్న 32 సంస్థలకు చెందిన ప్రముఖ కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 49 మంది మహిళా ప్రతినిధులు సహా మొత్తం 326 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పరమపూజనీయ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, మాననీయ సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబలే ప్రత్యేకంగా హాజరయ్యారు. ఆగస్టు 21న జరిగిన విలేకరుల సమావేశంలో, ఆర్ఎస్ఎస్ సహ సర్‌కార్యవాహ సీఆర్ ముకుంద మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో జరిగిన సమాజ ఆధారిత సేవ, పునరావాస కార్యక్రమాలపై ఈ సమావేశంలో సమీక్ష జరిగిందని తెలిపారు. అస్సోంలో తీవ్ర వరదలు సంభవించిన సమయంలో రాష్ట్రీయ సేవాభారతి, భారతీయ కిసాన్ సంఘ్, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్(ఎన్ఎంఓ), ఆరోగ్య భారతి వంటి వివిధ సంస్థలు, కార్యకర్తలు చేపట్టిన సహాయక, పునరావాస చర్యలకు సంబంధించిన వివరాలను ఈ సందర్భంగా విలేకరులతో పంచుకున్నారు. సంత్ రవిదాస్ జీ 650వ జయంతి సందర్భంగా, ఆయన సందేశం ఆధారంగా సామాజిక సామరస్యం, సద్భావన కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలు, అలాగే సమాజం నుండి లభించిన సానుకూల స్పందనపై సమీక్ష జరిగింది. ఈ దిశగా చేపట్టిన కార్యక్రమాలను మరింత విస్తృతంచేస్తూ ముందుకు సాగాలనే అంశంపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో జనాభా మార్పు, అసమతుల్యతపై కూడా తీవ్రమైన చర్చలు జరిగాయి. ప్రపంచంలోని అనేక దేశాలలో పెరుగుతున్న వృద్ధుల సంఖ్య, తగ్గుతున్న సంతానోత్పత్తి రేట్ల వల్ల తలెత్తుతున్న సవాళ్ల నేపథ్యంలో, భారతదేశంలోని పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్నారు. వివిధ ప్రాంతాలు, వర్గాల జనాభా నిష్పత్తులలో వస్తున్న మార్పులు, వాటి సామాజిక ప్రభావంతో పాటు, సమాజంలో సమతుల్యత, సామరస్యాన్ని కాపాడే చర్యలపై కూడా చర్చించారు.

**మాదక ద్రవ్య రహిత సమాజం కోసం**

దేశంలోని యువత, విద్యార్థులలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతుండటంపై సమావేశంలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఈ సమస్యను కేవలం ప్రభుత్వం లేదా పోలీసుల స్థాయిలోనే కాకుండా, యావత్ సమాజ భాగస్వామ్యంతో పరిష్కరించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సామాజిక సంస్థలు, అధికార యంత్రాంగం, పోలీసులు, ఇతర సంబంధిత వర్గాలను ఏకం చేయడం ద్వారా మాదకద్రవ్య రహిత సమాజం కోసం సమన్వయంతో కూడిన కృషి చేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించారు.

**యువత ఆకాంక్షలపై చర్చ**

యువత ఆలోచనా విధానం, ఆశయాలు, సృజనాత్మక సామర్థ్యం, భవిష్యత్తు పట్ల వారికున్న ఆందోళనలు, దేశ నిర్మాణంలో వారి పాత్ర వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిగాయి. సంఘ్ తన

## విలేకరుల




**వ్యవస్థలోని అవినీతి, జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన సహా వివిధ వ్యవస్థలలోని లోపాల గురించి సమావేశంలో ఏమి చర్చించారు?**

ఈ సమస్యను కేవలం అవినీతికి మాత్రమే పరిమితమైనదిగా చూడలేదు. వ్యవస్థలో ఎక్కడ లోపాలు ఉన్నా, వాటిని సరిదిద్దడానికి ప్రభుత్వ ప్రయత్నాలతో పాటు సమాజంలో అవగాహన కూడా అవసరం. నీట్ వంటి సమస్య అయినా లేదా ఇతర వ్యవస్థాగత సమస్యలైనా, ఇవి యువతలో తమ భవిష్యత్తు గురించి ఆందోళనలను కలిగిస్తాయి. ఆ ఆందోళనలను అర్థం చేసుకుని, వాటిని పరిష్కరించడం అవసరం. కేవలం నిరసనలు లేదా అంతరాయాల ద్వారా పరిష్కారాలు లభించవు. సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో వ్యవస్థను మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సమాజం కలిసి పనిచేయాలి.

**యువతరంలో సంస్కృతీ, సంప్రదాయాల పట్ల అవగాహన పెంచడానికి సంఘం ఏమి చేస్తుంది?**

సంఘ్ కార్యకలాపాలు ప్రధానంగా, విస్తృతంగా యువత మధ్య జరుగుతాయి. ఈ సంవత్సరం, ఆర్ఎస్ఎస్ శిక్షణాశిబిరంలోగాని, ప్రతిరోజూ జరిగే శాఖలకు హాజరయ్యే వారిలో గాని అధిక శాతం మంది యువతే ఉన్నారు. కేవలం ప్రసంగాలు లేదా పోస్టర్ల ద్వారా యువతలో విలువలు, సాంస్కృతిక అవగాహనను పెంపొందించలేము. వారితో నిరంతరం అనుసంధానమై ఉండటం, వారి భావాలను అర్థం చేసుకోవడం, వారితో సంభాషించడం, భారత్ గొప్పతనాన్ని, దాని సాంస్కృతిక వారసత్వాన్ని అనుభవపూర్వక స్థాయిలో వారికి తెలియజేయడం అవసరం. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, బజరంగ్‌దళ్, హిందూజాగరణ్ మంచ్ వంటి అనేక సంస్థల ద్వారా యువతీ యువకుల మధ్య కార్యకలాపాలు జరుగుతున్నాయి. నేటి యువత సామర్థ్యం, వారి సానుకూల స్పందనను చూస్తుంటే, భారత భవిష్యత్తు యువత చేతుల్లో సురక్షితంగా ఉంటుందనే నమ్మకం మాకు ఉంది. అదే



కార్యకలాపాలను పెద్ద సంఖ్యలో యువత మధ్య నిర్వహిస్తోంది. ఈ ఏడాది సంఘం నిర్వహించిన 21రోజుల శిక్షణశిబిరాల్లో సుమారు 21,000 మంది యువ స్వయంసేవకులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా నిత్యం జరిగే శాఖలకు హాజరయ్యే స్వయంసేవకు లలో 60 శాతానికి పైగా యువతే ఉన్నారు. జాయిన్ ఇన్ ఆర్ఎస్ఎస్ ద్వారా కూడా అధిక శాతం యువత ఆర్ఎస్ఎస్‌లో చేరుతున్నది. యువతతో కేవలం ఉపదేశాత్మక సంభాషణ జరప డానికి బదులుగా, వారితో ప్రత్యక్షంగా మమేకమై, వారి భావాలను, ఆందోళనలను అర్థం చేసుకోవడం అవసరమని సమావేశం పేర్కొంది. అలాగే, సంభాషణల ద్వారా దేశం, సంస్కృతి, సామాజిక విలువల పట్ల వారిలో అనుబంధ భావనను పెంపొం దించాల్సిన అవసరం ఉందని కూడా స్పష్టం చేసింది.

**41 వేల మందికి నైపుణ్య శిక్షణ**

ఈ సమావేశంలో భారతీయ దృక్పథం ఆధారంగా ఒక అభివృద్ధి నమూనాపై కూడా చర్చ జరిగింది. అభివృద్ధి స్వయంసమృద్ధిగా, పర్యావరణ అనుకూలంగా ఉండాలి. అది సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని వెళ్లాలి అనే దిశగా ఆర్థిక రంగంలో పనిచేస్తున్న సంస్థల అనుభవాలను పరిగణనలోకి తీసుకున్నారు. వివిధ సంస్థల ద్వారా నైపుణ్యాభివృద్ధి, సామాజికంగా ఉపయోగపడే కార్యకలాపాలపై చర్చ జరిగింది. ఉదాహరణకు, సూక్ష్మ పరిశ్రమల రంగంలో పనిచేస్తున్న లఘు ఉద్యోగ్ భారతికి చెందిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఈ సంవత్సరం 41,000 మందికి పైగా నైపుణ్య శిక్షణను అందించాయి.

**కుటుంబ ప్రబోధన్‌పై దృష్టితో 'పంచ పరివర్తన'**

సంఘం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో, సామాజిక పరివర్తన కోసం నిర్దేశించిన 'పంచ పరివర్తన'లోని వివిధ అంశాలపై ప్రత్యేక చర్చలు జరిగాయి. ముఖ్యంగా 'కుటుంబ ప్రబోధన్' (కుటుంబ చైతన్యం) కింద భారతీయ కుటుంబ వ్యవస్థను, కుటుంబ విలువలను, తరతరాలుగా వస్తున్న సాంస్కృతిక సంప్రదాయాలను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. పర్యావరణ పరిరక్షణ విషయానికి వస్తే, కేవలం తీర్మానాలు చేయడం కంటే ప్రతి వ్యక్తి, కుటుంబం తమ దైనందిన జీవితంలో మార్పులు చేసుకోవడంపై ప్రాధాన్యతనిచ్చారు. నీటిని విచక్షణతో వినియో గించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం వంటి అంశాలు ప్రతి కుటుంబ జీవనశైలిలో భాగం కావాలని అని సమావేశం పిలుపునిచ్చింది.

**కృత్రిమ మేధపై సమగ్ర చర్చ**

సమాజంపై కృత్రిమ మేధ (ఏఐ) చూపిస్తున్న ప్రభావం, కాలక్రమేణా పెరుగుతున్న దాని ప్రభావం గురించి సమావేశంలో సమగ్ర ప్రజెంటేషన్, చర్చ జరిగాయి. ఏఐ వల్ల కలిగే సానుకూల అవకాశాలతో పాటు, దానికి సంబంధించిన జాగ్రత్తలు, సవాళ్లను పరిగణనలోకి తీసుకుంటూనే... దీనిని భారతీయ దృక్పథంతో, భారతీయ సామాజిక సందర్భంలో చూడాల్సిన అవసరంపై నొక్కి చెప్పారు. సమాజ హితం కోసం సాంకేతికతను ఎలా ఉపయోగించు కోవాలి, దానివల్ల కలిగే దుష్ప్రభావాల గురించి సమాజానికి ఎలా అవగాహన కల్పించాలి అనే అంశాలపై చర్చలు జరిగాయి.

**కార్యక్షేత్ర విస్తరణ**

సంఘ ప్రేరణతో పనిచేస్తున్న 32 సంస్థలు సమాజంలోని వివిధ రంగాలలో చేపడుతున్న కార్య కలాపాల విస్తరణపై కూడా చర్చ జరిగింది. జాతీయ దృక్పథాన్ని ,సమాజ-కేంద్రిత ఆలోచనా విధానాన్ని సమాజంలోని మరింత ఎక్కువ వర్గాలకు చేర వేయడం, అలాగే సంస్థాగత కార్యకలాపాలను విస్తరించడం లక్ష్యంగా వచ్చే సంవత్సరానికి సంబం ధించిన ప్రణాళికలను సమావేశంలో పరిశీలించారు.

# సమావేశంలో ప్రశ్నోత్తరాలు

సమయంలో, యువతలో సాంస్కృతిక విలువలను పెంపొందించడానికి కలిసి పనిచేయాలని ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సంస్థలకు కూడా పిలుపు నివ్వడం జరిగింది.

**అమెరికా, కెనడా, బ్రిటన్‌లలో సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ జీ పర్యటన ఉద్దేశ్యం ఏమిటి?**

సంఘ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా చేపట్టిన విస్తృత ప్రపంచ స్థాయి కార్యక్రమాలలో భాగంగా ఈ పర్యటన జరుగుతోంది. దీనికి మూడు ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి. మొదటిది-భారత్, హిందూ సమాజం, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అపోహలు, తప్పుడు సమాచారం మధ్య వాస్తవాలతో కూడిన సానుకూల దృక్పథాన్ని తెలియజేయడం.

రెండవది-భారతీయ రుషులు, మునులు అందించిన 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమే ఒక కుటుంబం), విశ్వ ఏకత్వ సందేశాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ సమాజాలకు చేరవేయడం.

మూడవది-ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న హిందువులు, భారతీయ మూలాలున్న ప్రజల ప్రయోజనాలు, హక్కుల గురించి ఆయా దేశాల ప్రధాన స్రవంతి సమాజంతో సంభాషణను పెంపొందించుకోవడం.

ఇందులో భాగంగా, డాక్టర్ మోహన్ భాగవత్ జీ న్యూయార్క్‌లో 'విశ్వ ఏకత్వ' (Universal Oneness) కార్యక్రమంలోనూ, టొరంటో, లండన్ లలో సామాజిక కార్యక్రమాలలోనూ పాల్గొంటారు.

**ఆర్ఎస్ఎస్ చేపట్టిన 'పంచ పరివర్తన' ఉద్యమంలో భాగంగా మనం పర్యావరణాన్ని ఎలా పరిరక్షించవచ్చు?**

సంఘశతాబ్ది ఉత్సవాల ప్రణాళికా దశలో సుమారు మూడేళ్ల క్రితం 'పంచ పరివర్తన' భావన రూపొందింది. ఏదైనా వ్యవస్థాగత మార్పు రావడానికి ముందు సామాజిక పరివర్తన అవసరమని మేము విశ్వసిస్తున్నాము.

పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రకృతిని బయటి నుండి రక్షించే విషయం మాత్రమే కాదు. భారతీయ దృక్పథం ప్రకారం, మానవులు స్వయంగా ఈ సమస్త సృష్టిలో పర్యావరణంలో అంతర్భాగం. కాబట్టి, ప్రతి వ్యక్తి, కుటుంబం తమ దైనందిన జీవితంలో జలసంరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, తమ పరిసరాలలో పచ్చదనాన్ని పెంచడం అనే మూడు స్థాయిలలో దీనికి తోడ్పడవచ్చు. కేవలం తీర్మానాలు చేయడం ద్వారా మార్పు రాదు. జీవనశైలిలో మార్పు అవసరం. ఈ సందేశాన్ని కుటుంబాలకు, గ్రామాలకు, దేశంలోని మారుమూల ప్రాంతాలకు చేరవేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక వ్యక్తి ,కుటుంబం ప్రవర్తనలో వచ్చే చిన్న మార్పు కూడా విస్తృత సామాజిక, పర్యావరణ పరివర్తనకు పునాదిగా మారుతుంది. ★




# గురూజీ రచనల

**విమర్శకులు దురుద్దేశపూర్వకంగా, కావాలనే వక్రీకరించిన తన ఆలోచనలు సరైనవేనని గురూజీ నిరూపించుకున్న తర్వాత చరిత్ర మరింత విస్తరించింది. వారు మరణించి దశాబ్దాల కాలం గడిచిపోయింది. అయినప్పటికీ గురూజీకి వ్యతిరేకంగా దీర్ఘకాలం పాటు, నిరంతరాయంగా, పక్షపాతపూరితమైన విమర్శ కొనసాగుతున్నది. ఆ కారణంగా, ప్రధాన జన జీవన స్రవంతిలో జరిగే బహిరంగ చర్చలో అసలు గురూజీ ఆలోచనలు ఏమిటనేది ఎవరికీ తెలియకుండా పోయింది.**

గురూజీకి సంబంధించిన 'వివాదాస్పద' మాటలను మరింత మెరుగ్గా, స్పష్టంగా అర్థం చేసుకోవడానికి కొన్ని భేదాలను గుర్తించాల్సి ఉంది. గురూజీ రచనలు అవి రాసినప్పటి పూర్వోత్తర సందర్భానికి(కంటెక్స్ట్) కట్టుబడి ఉండవు, ఆ కాలానికి మాత్రమే పరిమితం కావు. అలాగే పూర్వోత్తర సందర్భానికి తగ్గట్టుగా గురూజీ రచనలు ఆ ఒక్క సందర్భానికి మాత్రమే పరిమితమైన ఉంటాయి. రచనలకు, పూర్వోత్తర సందర్భాలకు మధ్య ఉన్న సంబంధం లేదా సంబంధరాహిత్యం పట్ల కనీస అవగాహన, విషయాన్ని మరింత బాగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఒక రచనకు సందర్భాన్ని సృష్టించడానికి స్థల,కాలాదులు ఏకమవుతాయి. ఒక సమయంలో, ఒక ప్రాంతం నుంచి ఉద్భవించే రచన దాని సందర్భంతో మమేక మవుతుంది.

సాధారణంగా స్థల, కాలాదుల నుంచి ఉద్భవించే రచన వాటికి తగ్గట్టుగా ఉంటుంది. అదే సమయంలో రచనలకు, పూర్వోత్తర సందర్భాలకు మధ్య అవినాభావ సంబంధం ఉండవచ్చు, ఉండక పోనూవచ్చు. దీన్ని నాలుగు వర్గాలుగా చూడవచ్చు. మొదటి దాంట్లో ఒక పూర్వోత్తర సందర్భానికి మాత్రమే రచనలు ముడిపడి ఉంటాయి. రెండవ దాంట్లో సందర్భంతో ముడిపడిన రచన దానికే పరిమితమై ఉండదు. మూడవదిగా రచనలకు ఒక సందర్భం అంటూ ఏదీ ఉండదు. చివరిదైన నాల్గవ వర్గంలో సందర్భానికి అతీతంగా రచనలు ఉంటాయి.

మొదటి వర్గంలో రచనలు ఆ సందర్భానికి కట్టుబడి ఉంటాయి. రెండవ, నాల్గవ వర్గాల్లో రచనలు సందర్భాన్ని మించిపోతుంటాయి. వాటికి సందర్భం ఉండదు. ఏదైనా ఉంటే దాన్ని అతిక్ర మిస్తుంటాయి. సందర్భానుసారంగా ఏర్పడే పరిమితులను తోసిరాజంటాయి. ఇంత చేసినప్పటికీ వాటికి ఉండే విలువ సందర్భం ముగిసిపోయిన తర్వాతనే వెలుగులోకి వస్తుంటుంది. అవి రాతపూర్వక మైన వ్యక్తీకరణలు. వాటి ఔచిత్యం వాటి సందర్భానికి మాత్రమే పరిమితమై ఉండదు. మూడవ వర్గం విషయానికి వస్తే ఇది రచనను దాని పూర్వోత్తర సందర్భం నుంచి ఉద్దేశ్యపూర్వకంగా వేరు చేయడం తప్ప మరొకటి కాదు. ఈ వర్గం కింద రచన, దాని ఉద్దేశ్యాన్ని వక్రీకరించడానికి, సందర్భాన్ని ప్రస్తావించ కుండా రచనను మాత్రమే ప్రధానంగా ముందుకు తీసుకొని వస్తారు.

**సందర్భానికి అనుసంధానమైన, పరిమితమైన రచన**

ఏ రచన కూడా శూన్యం నుండి పుట్టదు లేదా ఉనికిలో ఉండదు అనేది సాధారణ సూత్రం. ఏ రచనకూడా 'స్వయంభూ' (తనంతట తానుగా పుట్టినది) కాదు. సందర్భం లేకుండా అది ఉద్భవించ లేదు. ఒక రచన దాని సందర్భంతో ముడిపడి ఉంటుంది. ఆ సందర్భమే ఆ రచనను వివరిస్తుంది. ఒక రచనను మరింత బాగా అర్థం చేసుకోవాలంటే, దానిని ఒక నిర్దిష్ట సందర్భంలో ఉంచి చూడాలి. దీనికి భిన్నంగా, సందర్భం నుండి వేరు చేసిన రచన తప్పనిసరిగా తప్పుదోవ పట్టిస్తుంది.

రచయితపై ప్రభావం చూపే చారిత్రక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులు ఆ రచనకు సంబంధించిన సందర్భంలోని స్థల కాలాదులను ఏర్పరుస్తాయి. చాలా వరకు రచనలు సందర్భోచితమైనవే. ఉదాహరణకు, భారతదేశ విభజన వంటి తీవ్రమైన పరిస్థితులలో వెలువడిన రచనలు ఎక్కువగా సందర్భోచితమైనవే అయి ఉంటాయి. అటువంటి రచనల ప్రాముఖ్యత కేవలం ఆ సందర్భానికే పరిమితమై ఉంటుంది లేదా ఆ సందర్భం ముగియగానే అవి తమ ప్రాముఖ్యతను కోల్పోతాయి. చరిత్ర వాటిని నమోదు చేస్తుంది వాస్తవమే, కానీ ఆ సందర్భం గడిచిపోయాక వాటిని పక్కన పెట్టేస్తుంది. కాలక్రమేణా భవిష్యత్తు వాటి సందర్భోచిత విలువను క్షీణింపజేస్తుంది.

**సందర్భానికి అనుసంధానం కాని, పరిమితం కాని రచన**

సందర్భానికి కట్టుబడి ఉండే కొన్ని రచనల ప్రాసంగికత సందర్భానికి మించి కూడా విస్తరించ వచ్చు. ఉదాహరణకు, భగవద్గీత అలాంటిదే. సాధారణంగా మహాభారతం, ప్రత్యేకంగా కురుక్షేత్ర యుద్ధం దాని సందర్భాన్ని ఏర్పరుస్తాయి. గీత, అది రచించబడిన మహాభారతం, కురుక్షేత్ర యుద్ధం సందర్భంలో మరింత సుబోధకంగా ఉంటుంది. మహాభారత–కురుక్షేత్ర సందర్భం గీత గ్రంథాన్ని మరింత సుబోధకంగా చేస్తుంది. కానీ గీత ప్రాసంగికతను కేవలం సందర్భానికే పరిమితం చేయదు. గీత ప్రాసంగికత కురుక్షేత్ర యుద్ధానికి లేదా దాని కాలానికి అతీతమైనది. గీత ఒక సందర్భానికి కట్టుబడి ఉండి, ప్రాసంగికతలో దానికి పరిమితం కాని గ్రంథానికి గొప్ప ఉదాహరణ. దాని ప్రాసంగికత సందర్భాన్ని అధిగమించినందున, గీత గ్రంథపరమైనది, సందర్భపరమైనది కాదు.

**సందర్భం లేని లేదా సందర్భానికి బాహ్యమైన రచన**

పోటీతత్వపూరిత వాక్చాతుర్యం, వాదనలో పై చేయి సాధించడం కోసం ఉద్దేశ్యపూర్వకంగా గ్రంథాలను సందర్భం లేకుండా లేదా సందర్భానికి వెలుపల ఉటంకించే నిందాపూర్వక చర్చలను సృష్టించింది. ఇది, తమ అధికారం పలుకుబడిని ఉపయోగించి, సమకాలీనంగా పలుకుబడి ఉన్న సంస్థలకు, ఒక రచనను సందర్భం లేకుండా లేదా సందర్భంతో సహా ఉటంకించడం ద్వారా అసత్యాన్ని నిజంగా ప్రచారం చేయడానికి సహాయపడుతుంది. ఇది, అటువంటి పలుకుబడి లేని నిందకు గురైన బాధితుడిని ఆత్మరక్షణలో పడేస్తుంది. ఒక రచనను సందర్భం లేకుండా ఉటంకించడం ఆ రచనను అనాథగా చేస్తుంది. దాని అర్థాన్ని దోచుకుంటుంది. దానిని వక్రీకరిస్తుంది లేదా చెడగొడుతుంది. డిజిటల్ మీడియా దీనిని మరింత సులభతరం చేస్తుంది. ఇది పాఠకులను కేవలం ముఖ్యాంశాలు మాత్రమే చదివేలా అలవాటు చేస్తుంది తప్ప అంతకు మించి కాదు. సందర్భం లేకుండా జనబాహుళ్యంలో వెళ్లే డిజిటల్ సమాచారం చూపించే ప్రభావం కన్నా కూడా సందర్భోచితమైన రచన మరింత అర్థవంతంగా ఉంటుందనే విషయాన్ని గుర్తించాలి. న్యూయార్క్ టైమ్స్‌లోని (మార్చి 17, 2010) "టెక్స్ట్ విథౌట్ కాంటెక్స్ట్" అనే వ్యాసం, సందర్భం లేకుండా చదివిన (డిజిటల్) రచనలు తప్పుదోవ పట్టిస్తాయని

# వక్రీకరణ



చెబుతుంది. "ఒక పూర్తి వార్తా కథనాన్ని చదవడానికి, ఒక పూర్తి టెలివిజన్ కార్యక్రమాన్ని చూడటానికి లేదా ఒక పూర్తి ప్రసంగాన్ని వినడానికి బదులుగా, పెద్ద సంఖ్యలో ప్రజలు సారాంశం, వీడియో క్లిప్, సౌండ్ బైట్‌కు మొగ్గు చూపుతున్నారు. ఆ క్రమంలో వారు చూసేవాటికి, వినేవాటికి సందర్భం లేకపోయిన వారు పట్టించుకోవడం లేదు" అని ఆ వ్యాసం పేర్కొంది. సందర్భం లేకుండా లేదా సందర్భానికి సంబంధం లేకుండా ఉటంకించడం ఆధారంగా చేసే నిందా పూర్వక ప్రచారాన్ని డిజిటల్ మీడియా సులభతరం చేస్తుంది. ఒక రచనకు సందర్భం ముగిసిన తర్వాత దానిని ఒక కొనసాగుతున్న ఆలోచనగా ఉటంకించడం కూడా, దానిని సందర్భం లేకుండా లేదా సందర్భానికి సంబంధం లేకుండా ఉటంకించడమే అవుతుంది.

**సందర్భానికి అతీతమైన రచన**

సందర్భాలకు అతీతమైన రచనలు స్థల, కాలాదులకు అతీతంగా ఉంటాయి. వేదాలు, ఉపనిషత్తుల వంటి కాలాతీత గ్రంథాలు సందర్భ రహిత గ్రంథాలుగా పరిగణనలోకి వస్తాయి. 'సనాతన ధర్మాన్ని' (కాలాతీత విలువలను) ప్రబోధించే గ్రంథాలు ఈ కోవలోకి వస్తాయి. అటువంటి గ్రంథాలు శాశ్వత సత్యాలను కలిగి ఉంటాయి. కాలాతీత గ్రంథాలలో అంతర్లీనంగా ఉన్న ఆలోచనలు, సందర్భాలకు అతీతంగా ఉండటం వల్ల, అన్ని సమకాలీన భేదాలను అధిగమించి, మారుతున్న, విభిన్నమైన సందర్భాలతో సంబంధం లేకుండా చెల్లుబాటులో ఉంటాయి. అటువంటి కాలాతీత విలువలను ప్రబోధించే ఏవైనా గ్రంథాలు లేదా ఆలోచనలు కూడా సందర్భరహిత గ్రంథాలే.

వీ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్‌డ్ (మనం లేదా మన జాతీయత నిర్వచనం) అనేది ఒక సందర్భోచిత గ్రంథం, దీనిని సందర్భం లేకుండా లేకుండా కూడా ఉటంకించారు. గురూజీని సందర్భం లేకుండా ఉటంకించడం ద్వారా దశాబ్దాలుగా ఆయనపై ఒక నిందాపూర్వక ప్రచారం నడుస్తోంది. దీని అసలు ఉద్దేశ్యాన్ని బయటపెట్టాల్సిన అవసరం ఉంది. ఒక గ్రంథాన్ని సందర్భం లేకుండా ఉటంకించడం ఆ గ్రంథాన్ని తప్పుదోవ పట్టిస్తుందని, వక్రీకరిస్తుందనే ప్రాథమిక నియమాన్ని విస్మరిస్తూ, 1939లో గురూజీకి ఆపాదించిన "వీ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్‌డ్" అనే పేరుతో పుస్తకం వెలువడింది. దాని ద్వారా గురూజీని సందర్భం లేకుండా ఉటంకిస్తూ, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా దురుద్దేశ్యపూర్వక సాహిత్యం పుట్టుకొచ్చింది. 1940లో గురూజీ ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘచాలక్ కావడానికి ముందే అది వెలుగులోకి వచ్చింది. ఆర్‌ఎస్‌ఎస్‌పై ఫండమెంటలిజం ప్రాజెక్ట్ పండితుడైన ఐన్స్‌లీ టి ఎంబ్రీ (సంపుటి 1, పేజీ 566) గమనించినట్లుగా, "నాజీల హింస పూర్తి భయానకత వెలుగులోకి రాకముందే రాసిన" ఆ పుస్తకంలో, గురూజీ అడాల్ఫ్ హిట్లర్ చేత "ప్రభావితం" అయ్యారు అని ఉంది. అందులో గురూజీ హిందూ జాతి ఆధిక్యతను నొక్కిచెబుతూ, హిందూయేతరులు హిందూ విలువలను అంగీకరించడమో లేదా అణచివేతకు గురైన జీవితాన్ని గడపడమో చేయాలని చాలా దూకుడుగా సూచించారు. నిజంగానే ఇది అత్యంత దుందుడుకు వైఖరి! కానీ ఇప్పుడు, ఈ రచన ప్రపంచ, జాతీయ సందర్భాన్ని చూడండి.

**హిట్లర్ పట్ల మహనీయుల మైమరపు**

గొప్ప మేధావులు, కళాకారులు, వృత్తి నిపుణులు, రాజనీతిజ్ఞులతో కూడిన హిట్లర్ అభిమానుల జాబితా ఈనాటికీ ఎవరినైనా దిగ్భ్రాంతికి గురి చేస్తుంది. అహింసకు ప్రతీక అయిన మహాత్మా గాంధీ, గురూజీ హిట్లర్‌ను సానుకూలంగా చూసిన రెండు సంవత్సరాల తర్వాత, 1941లో హిట్లర్‌కు రాసిన లేఖలో "మీ ప్రత్యర్థులు వర్ణించినట్లుగా మీరు ఒక రాక్షసుడని నేను సైతం నమ్మను" అని అన్నారు. ఆ తర్వాతి కాలంలో "హిట్లర్ 50 లక్షల మంది యూదులను చంపాడు... కానీ యూదులు ఆ కసాయి కత్తికి తమను తాము అప్పగించుకుని ఉండాల్సింది... లేదా కొండల పైనుంచి సముద్రంలోకి దూకి ఉండాల్సింది'' అని పేర్కొన్నారు(జీబీ సింగ్, డాక్టర్ టిమ్ వాట్సన్ రాసిన 'Gandhi Under Cross-Examination' (పేపర్‌బ్యాక్) పుస్తకం నుండి; మూలం: http://www.wnd.com/2008/05/63906/).

గొప్ప జాతీయవాది సుభాష్ చంద్ర బోస్ హిట్లర్ నుండి స్ఫూర్తి పొందారు (జార్జెస్ వాన్ వ్రైఖెమ్ రచించిన 'హిట్లర్ అండ్ హిజ్ గాడ్', రూపా & కో [2006ఔ పేజీలు 656/57). జోసెఫ్ స్టాలిన్ హిట్లర్‌ను ఆరాధించారు. బెర్నార్డ్ షా కూడా. హిట్లర్‌ను ఆరాధించే హెన్రీ ఫోర్డ్, ప్రతి సంవత్సరం అతనికి పుట్టినరోజు బహుమతిగా 50,000 DM పంపేవారు – ఇది ఇప్పుడు 3.5 మిలియన్ డాలర్లు లేదా 19.6 కోట్ల రూపాయలకు సమానం! "ఒకరు హిట్లర్ వ్యవస్థను ఇష్టపడకపోవచ్చు, కానీ అతని దేశభక్తి సాధనను మెచ్చుకోవచ్చు. ఒకవేళ మన దేశం ఓడిపోతే, మన ధైర్యాన్ని పునరుద్ధరించి, దేశాల మధ్య మన స్థానానికి మనల్ని తిరిగి నడిపించడానికి అంతటి అజేయమైన నాయకుడు మనకు దొరుకుతాడని నేను ఆశిస్తున్నాను" అనే ఈ మాటను తర్వాతి కాలంలో హిట్లర్‌కు వ్యతిరేకంగా బ్రిటిష్ వారికి నాయకత్వం వహించిన విన్‌స్టన్ చర్చిల్ అన్నారు. "గొప్ప జర్మన్ జాతికి గౌరవాన్ని, మనశ్శాంతిని పునరుద్ధరించిన వ్యక్తిగా హిట్లర్ చరిత్రలో నిలిచిపోతాడో లేదో మనం చెప్పలేము" అని కూడా ఆయన అన్నారు. హిట్లర్‌ను సానుకూల దృక్పథంతో చూసిన గురూజీ సహా చాలా మందికి, అతను ఒక నరహంతకుడని తెలియదు. అలాంటప్పుడు, ఒక సందర్భంలో ఇతరుల తరహాలో హిట్లర్ పట్ల సానుకూలంగా ఉన్నందుకు గురూజీని మాత్రమే ఎందుకు అన్యాయంగా, ప్రత్యేకంగా పేర్కొంటున్నారు?

**(ఎస్.గురుమూర్తి రచించిన "గోల్వాల్కర్ ది మోడరన్ రిషి విత్ మిలీనియల్ విజన్" పుస్తకం నుంచి)**

**(సశేషం)**

**వివేకానంద సూక్తిశతి**

**Infinite strength is religion and god**



**మతము అనగ తెలియు మహితశక్తి వసుధ**
**మతము దైవసమము క్షితితలాన**
**మతముగూర్చి వ్యర్థ మంతనాలేలరా**
**వినుడి స్వామి సద్వివేక వాణి!!**



**బండిరాజుల శంకర్**
**ఆలేరు,**
**9948050608**

# కాంగ్రెస్ క్షమా

**స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా వందేమాతరం పట్ల కాంగ్రెస్ నాయకత్వం కనబరిచిన అసహనం, కేరళ, ఇతర చోట్ల జరిగిన ఇలాంటి వివాదాలతో పాటు, జాతీయ, నాగరికతా చిహ్నాల పట్ల ఆ పార్టీ వైఖరిపై విమర్శలకు దారితీసింది. ఒకప్పుడు బ్రిటిష్ వారు "వందేమాతరం" పిలుపునకు భయపడేవారు. కానీ 2026 స్వాతంత్ర్య దినోత్సవం నాడు, అదే శాశ్వత నినాదం పట్ల కాంగ్రెస్ నాయకత్వం స్పష్టంగా అసహనంతో కనిపించింది. న్యూఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో పూర్తి వందేమాతరం గీతం ఇంకా వినిపిస్తున్నప్పటికీ, సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ మాట్లాడుకుంటూ, హావభావాలు ప్రదర్శిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. గంభీరమైన స్మరణ క్షణంగా ఉండాల్సిన ఆ సందర్భం, భారతదేశ జాతీయ, నాగరికతా చిహ్నాలతో కాంగ్రెస్‌కు ఉన్న ఇబ్బందికరమైన సంబంధానికి మరో ఉదాహరణగా ముగిసింది.**

ఢిల్లీ ఉదంతం ఒక్కటే వివాదం కాదు. ఎందుకంటే పూర్తి గీతాన్ని ఆలపించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, కేరళలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తమ అధికారిక స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమం నుండి "వందేమాతరం"ను మినహాయించింది. అంతకు ముందు, కేరళ అసెంబ్లీ ప్రారంభ సమావేశంలో ఈ గీతం వివాదాన్ని రేకెత్తించింది. అదే రాష్ట్రానికి చెందిన మంత్రుల్లో ఒకరు తాను పూర్తి గీతాన్ని పాడేది లేదని బహిరంగంగా ప్రకటించారు. అదే సమయంలో, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ తాను గౌరవ సూచకంగా నిలబడతానని, కానీ ఆ గీతాన్ని పాడేది లేదని చెప్పారు. అంతకుముందు ఇండోర్‌కు చెందిన ఒక కాంగ్రెస్ కార్పొరేటర్ కూడా ఇలాంటి ప్రకటననే చేశారు. "వందేమాతరం" పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న అసహనం ఒక్క సంఘటనతో ముడిపడింది కాదని, అది ఒక రాజకీయ ప్రతిచర్య అనే భావనను పై ఘటనలు బలపరిచాయి. ప్రతి పౌరుడికి వారి వ్యక్తిగత నమ్మకాలు, రాజ్యాంగ స్వేచ్ఛలు ఉంటాయి. ఏ మతాన్ని అపహాస్యం చేయకూడదు. కానీ కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీ తన దేశ వ్యతిరేక రాజకీయ సంస్కృతిని ఇప్పటికీ కొనసాగిస్తోంది. ఎందుకంటే, ఒక జాతీయ చిహ్నాన్ని పూజించే లక్షలాది మంది ప్రజల మనోభావాల కంటే, దానికి వ్యతిరేకంగా జరిగే నిరసనలే నిరంతరం ఎక్కువ ఆందోళనను రేకెత్తించినప్పుడు, ఈ ధోరణిని ఇకపై కేవలం యాదృచ్ఛికం అని కొట్టిపారేయలేము. సాంస్కృతిక జాతీయవాదానికి వ్యతిరేకంగా వచ్చే ప్రతి అసమ్మతిని ప్రోత్సహించి, ఆపై జాతీయ స్మృతిని కాపాడాలనుకునే వారిలో విభజన సృష్టిస్తున్నారని ఆరోపించడం కాంగ్రెస్ నైజం. ఢిల్లీ, కేరళ, ఇండోర్ లలో జరిగిన ఘటనలు ఆ దిశగా కాంగ్రెస్ ప్రతిచర్యను వెల్లడిస్తున్నాయి. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరైన గోవాలోని ఒక కాంగ్రెస్ కార్యక్రమంలో, పార్టీ కార్యకర్తలు వందేమాతరం మొదటి రెండు చరణాలను మాత్రమే పాడినట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలలో మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలన్న తమ 1937 నాటి వైఖరిని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పునరుద్ఘాటించిన కొద్దిరోజులకే ఈ సంఘటన జరిగింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ "తీవ్రమైన బుజ్జగింపు విధానానికి" నిదర్శనంగా విమర్శించారు. అంతేకాకుండా, ఆ గీతాన్ని చారిత్రాత్మకంగా కుదించడం బంకించంద్ర చటోపాధ్యాయకు, దాని నుండి స్ఫూర్తి పొందిన స్వాతంత్ర్య సమరయోధులకు అవమానమని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దీనిని ఒక చారిత్రక తీర్మానాన్ని పునరుద్ఘాటించడంగా పేర్కొనవచ్చు. కానీ రాజకీయ ఐక్యతను సాధించాలనే ఆశతో, 1919లో కాంగ్రెస్ నాయకత్వం ఒక నిర్దిష్ట మత–రాజకీయ డిమాండ్‌ను విస్తృత జాతీయవాద వ్యూహంలో భాగంగా మారడానికి అనుమతించిన ఖిలాఫత్ ఉద్యమానికి మద్దతు ఇవ్వడం లాంటిదేనా ఇది? అనే ఒక ఇబ్బందికరమైన ప్రశ్నను చరిత్ర లేవనెత్తుతుంది. ఈ పోలిక కచ్చితమైనది కాదు. ఈ రెండు సంఘటనలు చాలా భిన్నమైన పరిస్థితులకు చెందినవి. కానీ దీని వెనుక ఉన్న రాజకీయ వైఖరి పరిశీలనకు అర్హమైనది.

వందేమాతరంతో తనకున్న సంబంధంపై ప్రశ్నలను ఎదుర్కోవడం కాంగ్రెస్‌కు ఇది మొదటిసారి కాదు. యూపీఏ హయాంలో, 2006లో జాతీయ గీతం వేడుకలు వివాదాస్పదమయ్యాయి. వాటిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ అప్పటి అధ్యక్షురాలు సోనియా గాంధీ హాజరు కాలేదు. ఆమె గైర్హాజరును బీజేపీ విమర్శించగా, ఆమెకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని కాంగ్రెస్ సమర్థించుకుందని ఆనాటి నివేదికలు పేర్కొన్నాయి. నిరసనల నేపథ్యంలో వందేమాతరం గీతాన్ని ఆలపించడాన్ని ఐచ్ఛికం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం కూడా ఈ వివాదంలో భాగమైంది. అయితే ఒక కార్యక్రమానికి హాజరు కాకపోవడం ఒక్కటే అగౌరవాన్ని రుజువు చేయదు. అలాగే, వందేమాతరం ఆలపించే విధానంపై ప్రతి విభేదాన్ని దేశభక్తికి పరీక్షగా మార్చకూడదు. కానీ 2006 నాటి సంఘటనను, 1937 నాటి వారసత్వాన్ని, 2026లో కాంగ్రెస్ పునరుద్ఘాటనను పక్కపక్కన పెట్టి చూసినప్పుడు, ఒక సంకుచితమైన రాజకీయ ధోరణిని విస్మరించడం కష్టమవుతుంది.

తన ధోరణిని సమర్థించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రతిసారీ లౌకికవాదాన్ని తెర మీదకు తెస్తుంది. తద్వారా లౌకికవాదాన్ని వక్రీకరిస్తుంది. ఎందుకంటే నిజమైన భారత లౌకికవాదం ప్రతి పంథాను గౌరవిస్తుంది కానీ నాగరికతను మరచిపోయేలా చేయదు. వందేమాతరం ఏ భారతీయుడినీ తమ



విశ్వాసాన్ని వదులుకోమని అడగదు. కానీ అందరికీ చెందిన మాతృభూమికి వందనం చేయమని పౌరులను కోరుతుంది. కాంగ్రెస్ పదేపదే సాంస్కృతిక ఆత్మవిశ్వాసాన్ని ఒక మతపరమైన ప్రశ్నగా మార్చగా, దాని పక్షపాత లౌకికవాదం భారతదేశంలోని మెజారిటీ ప్రజలు తమ సొంత పదజాలానికి క్షమాపణ చెప్పాలని ఆశిస్తుంది. జాతీయ చిహ్నాలను ధిక్కరించడాన్ని రాజకీయంగా ఉపయోగపడే సున్నితత్వంగా చూస్తుంది.

అందువల్ల బీజేపీ విమర్శ కేవలం కాంగ్రెస్ కార్యకర్తలు రెండు చరణాలు పాడతారా? లేక ఐదు పాడతారా? అనే దాని గురించి మాత్రమే కాదు. దీని వెనుక ఉన్న లోతైన సమస్య సైద్ధాంతికమైనది. భారతదేశ జాతీయ గుర్తింపును మతపరమైన గుర్తింపు సున్నితత్వాల ద్వారా నిరంతరం చర్చించుకోవాలా? లేదా ప్రతి పౌరునికి సమాన గౌరవం, రాజ్యాంగ హక్కులను కల్పిస్తూనే, భారతదేశం తన సొంత నాగరిక చరిత్ర ద్వారా తన జాతీయ

# పణ చెప్పాలి

చిహ్నాలను నిర్వచించుకోగలదా? అనే రెండు ప్రశ్నలు అనాదిగా చర్చనీయాంశాలుగా పదేపదే తెరమీదకు వస్తున్నాయి. ఆర్ఎస్ఎస్, బీజేపీలు చాలా కాలంగా రెండవ దానికే మొగ్గు చూపుతున్నాయి. ప్రతి పౌరుడిని ఒక జాతీయ చిహ్నాన్ని గౌరవించమని అడగడంలో అంతర్గతంగా మైనారిటీ వ్యతిరేకత ఏమీ లేదు. అదేవిధంగా, ఒక నిర్దిష్ట మత వర్గాన్ని నొప్పించకుండా ఉండేందుకు జాతీయ-సాంస్కృతిక వ్యక్తీకరణలను పదేపదే సవరించడంలో అంతర్గతంగా లౌకికవాదం ఏమీ లేదు. నిజమైన లౌకిక వాదం అంటే మెజారిటీ ప్రజల నాగరిక పదజాలాన్ని



నిరంతరం పలుచన చేయాలని కాదు. అలాగే, నిజమైన జాతీయవాదానికి ఏ వర్గాన్ని ద్వేషించాల్సిన అవసరం లేదు. దేశానికే ప్రథమ ప్రాధాన్యత, ప్రతి వర్గం జాతీయ గుర్తింపులో సమాన భాగస్వామిగా పాలుపంచుకోవాలి అనే సరైన సూత్రం అత్యంత సరళమైనది.

వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా పార్లమెంటులో జరిగిన ప్రత్యేక చర్చలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, దీనికి సంబంధించిన చారిత్రక క్రమాన్ని ప్రస్తావించారు. అక్టోబర్ 15, 1937న లక్నోలో జిన్నా దీనిని వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. అలాగే, సుభాష్ చంద్రబోస్‌కు జవహర్‌లాల్ నెహ్రూ అక్టోబర్ 20న రాసిన లేఖను కూడా ఆయన ప్రస్తావించారు. ఆ లేఖలో, ఆ గీతానికి ఉన్న ఆనందమఠ్ నేపథ్యం ముస్లింలను రెచ్చగొట్టవచ్చని నెహ్రూ ఆందోళన వ్యక్తం చేశారు. సరిగ్గా ఇక్కడే సమకాలీన కాంగ్రెస్ వైఖరి చారిత్రాత్మకంగా ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. 2026లో, కాంగ్రెస్ కేవలం ఒక పాత సంగీత సంప్రదాయాన్ని అనుసరించడం లేదు. మతతత్వ రాజకీయాలు తీవ్రమవుతున్నప్పుడు, ముస్లిం లీగ్ తన ప్రత్యేక రాజకీయ గుర్తింపును అంతకంతకూ నొక్కిచెబుతున్నప్పుడు తీసుకున్న ఒక నిర్ణయాన్ని అది స్పృహతో పునరుద్ధరిస్తోంది. బహుశా అత్యంత శక్తిమంతమైన వైరుధ్యం ఏమిటంటే, దీనికి సమాధానం కాంగ్రెస్ సొంత చరిత్రలోనే ఉంది. 1923లో, విష్ణు దిగంబర్ పాలుస్కర్ ఒక జాతీయ రాజకీయ వేదిక మతపరమైన వీటోకు లోబడి ఉండటానికి నిరాకరించారు. 1937లో, కాంగ్రెస్ రాజీని ఎంచుకుంది. 1950లో, గణతంత్రం వందేమాతరంనకు సమాన జాతీయ గౌరవ స్థానాన్ని పునరుద్ధరించింది. ఇక 2026లో, కాంగ్రెస్ 1937 నాటి సూత్రానికి తిరిగి వెళ్లాలని ఎంచుకుంది. ఇది ఒక పెద్ద జాతీయ చర్చను రేకెత్తించాలి. ఇది కేవలం చారిత్రక కొనసాగింపు మాత్రమేనా.. లేక ఒక పాత రాజకీయ ప్రవృత్తి తిరిగి రావడమా? ఖిలాఫత్ అనుభవం నేపథ్యంలో చూసినప్పుడు ఈ ప్రశ్న మరింత సందర్భోచితంగా మారుతుంది. 1919లో, కాంగ్రెస్ మతపరంగా నిర్వచించిన ఒక ఉద్యమానికి మద్దతు ఇవ్వడం ద్వారా రాజకీయ ఐక్యతను కోరింది. 1937లో, మత సామరస్యం పేరుతో ఒక జాతీయ గీతంపై వచ్చిన అభ్యంతరాలను అది సర్దుబాటు చేసుకుంది. 2026లో, మతపరమైన సర్దుబాటు రాజకీయాలలో మూలాలున్న ఒక చారిత్రక ఆంక్షను అది మరోసారి సమర్థిస్తోంది. సందర్భాలు వేరు కావొచ్చు. అయితే, దీని వెనుక ఉన్న రాజకీయ తర్కం మాత్రం పరిశీలనకు అర్హమైనది. వందేమాతరం హిందూ-ముస్లింల మధ్య పోరాటం గురించి కాదు. వందేమాతరం, భారత్ ఏదో ఒక మత వర్గానికి చెందినదని ప్రకటించే గీతం కాదు. అది మాతృ భూమి పట్ల గౌరవానికి చిహ్నం. ఒక ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన లేదా హిందూ పౌరుడు అందులోని భావాలను వేర్వేరుగా అర్థం చేసుకోవచ్చు. కానీ ఆ గీతం జాతీయ అర్థం, స్వాతంత్ర్య పోరాటంలో దానికి ఉన్న స్థానాన్ని చిరంజీవిని చేస్తుంది. అందులోని పదాలు వలస పాలనకు వ్యతిరేకంగా అక్షరబద్ధ మయ్యాయి. ప్రతిఘటనను నినాదంగా మార్చుకున్న తరాల త్యాగాల నుండి వందేమాతరం పురుడు పోసుకుంది. అందువల్ల, విభేదాలకు సరైన ప్రతి స్పందన సంభాషణే అయి ఉండాలి తప్ప చారిత్రక విస్మృతి కాదు. వీటోల ద్వారా భారత జాతీయ గుర్తింపును నిర్మించలేము. అలాగే స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఎంపిక చేసుకుని గుర్తుంచుకోలేము. తన పార్టీ కార్యక్రమా లలో ఏమి పాడాలో నిర్ణయించుకునే పూర్తి రాజ్యాంగ హక్కు కాంగ్రెస్‌కు ఉంది. అయితే, ఆ నిర్ణయం 1937 నాటి రాజకీయ రాజీని స్పృహతో పునరుద్ధరించి

చట్టం చాలా స్పష్టంగా ఉంది. వందేమాతరం పాడాలని అది ఎవరినీ నిర్బంధించదు. కేవలం ఉద్దేశపూర్వకంగా ఎవరైనా వందేమాతరం పాడటాన్ని అడ్డుకున్నా లేదా దానిని ఆలపిస్తున్న సభకు అంతరాయం కలిగించినప్పుడు మాత్రమే అలాంటి వారిని శిక్షిస్తుంది. ఈ శిక్షలో మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉండవచ్చు. ఈ విధంగా, మోదీ ప్రభుత్వం చట్టపరమైన ఒక దీర్ఘకాలిక లోపాన్ని సరిదిద్దింది.

నప్పుడు, తన నాగరికతా స్వీయ-వ్యక్తీకరణ కోసం భారత్‌ను పదేపదే చర్చలు జరపమని కోరిన బుజ్జగింపు రాజకీయాలను మనం నిజంగా అధిగమించామా? లేక ఒక కొత్త రాజకీయ రూపంలో దాని పునరాగమనాన్ని మనం చూస్తున్నామా? అనే సముచితమైన చారిత్రక ప్రశ్నను కూడా అది లేవనెత్తుతుంది.

చట్టం చాలా స్పష్టంగా ఉంది. వందేమాతరం పాడాలని అది ఎవరినీ నిర్బంధించదు. కేవలం ఉద్దేశపూర్వకంగా ఎవరైనా వందేమాతరం పాడటాన్ని అడ్డుకున్నా లేదా దానిని ఆలపిస్తున్న సభకు అంతరాయం కలిగించినప్పుడు మాత్రమే అలాంటి వారిని శిక్షిస్తుంది. ఈ శిక్షలో మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉండవచ్చు. ఈ విధంగా, మోదీ ప్రభుత్వం చట్టపరమైన ఒక దీర్ఘకాలిక లోపాన్ని సరిదిద్దింది. అయినప్పటికీ, కాంగ్రెస్ నాయకులు మాత్రం అదే జాతీయ వారసత్వం విషయంలో సంకోచాన్ని, షరతులతో కూడిన వైఖరిని, అసహనాన్ని వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అందువల్ల, కాంగ్రెస్ బేషరతుగా క్షమాపణ చెప్పాల్సింది బీజేపీకి కాదు, భారతదేశానికి, బంకిం చంద్ర చటర్జీకి, వలసవాదశక్తికి వ్యతిరేకంగా పోరాడిన విప్లవకారులకు, వందేమాతరంను జాతీయ ప్రశంసా వాక్యంగా భావించే ప్రతి పౌరునికి. రాజకీయ పార్టీలు రావచ్చు పోవచ్చు, రాజవంశాలు సాకులు చెప్పవచ్చు. సిద్ధాంతాలు స్మృతిని మరుగు పరచడానికి ప్రయత్నించవచ్చు, కానీ మాతృభూమికి చేసే వందనాన్ని నిలిపివేయలేరు. బేరసారాలకు లోనుకాలేరు. లేదా తుడిచివేయలేరు. వందే మాతరంలో రెండు చరణాలు మాత్రమే పాడుతాం అంటూ కాంగ్రెస్ చేసిన తీర్మానం పట్ల దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. ఈ నిరసన పట్ల కాంగ్రెస్ పాటిస్తున్న వ్యూహాత్మక మౌనం భారతదేశం పట్లనే ఒక లోతైన సైద్ధాంతిక అశాంతిని ప్రతిబింబిస్తున్నది. కాబట్టి కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి. ఎందుకంటే వందేమాతరం యావత్ భారతీయులకు అత్యంత గౌరవప్రదమైనది, గర్వకారణమైనది కాబట్టి.

– జాగృతి డెస్క్

# దీపం వెలిగించడంపై న్యాయపోరాటమా?




తిరుప్పరన్‌కుంద్రం కొండపై కార్తిక దీపం వెలిగించడానికి అనుమతిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేయాలన్న టీవీకే ప్రభుత్వ నిర్ణయాన్ని హిందూ తమిళర్ కచ్చి వ్యవస్థాపకుడు రామ రవికుమార్ తీవ్రంగా విమర్శించారు.

దీపం వెలిగించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా ప్రభుత్వం కోర్టును ఎందుకు ఆశ్రయించిందంటూ రవికుమార్ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. ‘దీపం వెలిగించడానికి అనుమతిస్తూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును అమలు చేయడం మీ బాధ్యత అయితే, ఆ ఉత్తర్వుపై అప్పీల్ చేయడం ఎవరి బాధ్యత?’ అని ప్రభుత్వ న్యాయపరమైన సవాలు వెనుక ఉన్న హేతుబద్ధతను రవికుమార్ ప్రశ్నించారు. ఈ విషయంపై హైకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినప్పటికీ, దీపం వెలిగించడాన్ని నిరోధించడానికి ప్రభుత్వం ఎందుకు న్యాయపోరాటం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. తిరుప్పరన్‌కుంద్రం కొండపై ఉన్న దీప స్తంభం వద్ద కార్తీక దీపం వెలిగించడంపై కొనసాగుతున్న న్యాయ వివాదం నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. కొండపై ఉన్న స్తంభం వద్ద దీపం వెలిగించాలని, భద్రత కల్పించేందుకు పోలీసులను నియమించాలని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ గతంలో ఆదేశించింది. అనంతరం తమిళనాడు ప్రభుత్వం ఈ ఉత్తర్వును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీపం కేసులో పిటిషనర్‌గా ఉన్న రవికుమార్, హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా న్యాయపరమైన సవాలును కొనసాగించాలన్న ప్రభుత్వ వైఖరిని, నిర్ణయాన్ని ప్రశ్నించారు. న్యాయపరమైన ఆదేశం అనుమతిస్తున్నప్పటికీ, దీపం వెలిగించకుండా నిరోధించడానికి ప్రభుత్వం ఎందుకు ‘న్యాయపోరాటం’ చేస్తోందని ప్రశ్నించారు.



# రోహింగ్యా దొం

శరణార్థులుగా ఉంటూ, దొంగతనాలకు పాల్పడుతున్న రోహింగ్యా దొంగల ముఠాను తెలంగాణ పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఇన్సులేటింగ్ ఆయిల్, కాపర్ కాయిల్స్‌ను దొంగిలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా నార్కట్‌పల్లి, మాడ్గులపల్లి, చిట్యాల, వేములపల్లి, వలిగొండ, పోచంపల్లి, యాదగిరిగుట్ట, రామన్నపేట, భువనగిరి తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు.

వారి వద్ద నుంచి రూ.7.7 లక్షల విలువైన దొంగిలించిన సామగ్రితో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లను తెరవడానికి ఉ

# లడఖ్ నీటి విప్లవం



సుస్థిర నీటి, వ్యవసాయ భద్రతను నిర్ధారించేందుకు కేంద్రం చేపట్టిన చొరవలో భాగంగా, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతం ప్రతిరోజూ 9 కోట్ల లీటర్ల గ్లేసియర్ జలాన్ని వినియోగించుకుంటోంది. లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా నేతృత్వంలోని ఈ చొరవ, ఎలాంటి మూలధన వ్యయం లేకుండా, సాధారణ మట్టిపనుల ద్వారా హిమానీనద ప్రవాహ జలాలను మళ్లించి , వినియోగించుకోవ డానికి ఆ కేంద్రపాలిత ప్రాంతానికి సహాయపడుతోంది.

ఈ కార్యక్రమం, లడఖ్‌లోని విస్తారమైన సాగుభూమిలో ఉన్న చారిత్రక నీటిపారుదల కొరతను పరిష్కరించడానికి, అక్కడ సమృద్ధిగా ఉన్న హిమానీనద, కరిగే మంచు వనరులను ఉపయోగించుకుంది. ఇది ఆ ప్రాంత వ్యవసాయ ఉత్పాదకతను మార్చివేసి, హరిత, జల భద్రత కలిగిన, స్వయంసమృద్ధి గల లడఖ్ ఆశయాన్ని సాకారం చేసింది. లడఖ్ ప్రభుత్వం ప్రకారం, లేహ్‌లోని నల్లా జిల్లాలోని స్టోక్ గ్రామం నుండి హిమానీనదం కరిగివచ్చిన నీటిని ఇప్పుడు నేరుగా ఇగూ–ఫే నీటిపారుదల కాలువలోకి మళ్లిస్తున్నారు. దీనివల్ల దాదాపు 12 గ్రామాలకు నీరు అందడంతో పాటు, ఇంతకుముందు కాలువలో నీటి కొరత కారణంగా ఎండిపోయిన 1000 ఎకరాలకు పైగా బీడు భూములకు నీటిపారుదల సౌకర్యం మెరుగుపడుతుంది.

కేంద్రం ప్రణాళికను అమలు చేయడానికి, సింధు నదిలోకి అధిక పరిమాణంలో హిమానీనద జలాలు ప్రవహిస్తున్న ప్రదేశాలను గుర్తించేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా ఒక సమగ్రమైన, క్రమబద్ధమైన ప్రచారాన్ని ప్రారంభిం చారు. హిమానీనద జలాలను ఇప్పటికే ఉన్న కాలువలోకి మళ్లించడానికి గవర్నర్ గుర్తించిన తొలి ప్రదేశాలలో స్టోక్ గ్రామ నల్లా ఒకటి. లేహ్ సమీపంలోని స్టోక్ కాంగ్రి హిమానీనదం నుండి స్టోక్ నల్లాకు నీరు చేరుతుంది.

ఆగస్టు 14వ తేదీన, లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా ఆదేశాల మేరకు, నీటిపారుదల, వరద నియంత్రణ శాఖ వారు ఒక జేసీబీని ఉపయోగించి రెండు కందకాలు తవ్వి, హిమానీనదం నుండి వచ్చే నల్లా ప్రధాన నీటి కాలువలోని అదనపు నీటిని ఇగూ–ఫే కాలువలోకి విజయవంతంగా మళ్లించారు.

స్టోక్ నల్లా ప్రతిరోజూ సుమారు 36.6 క్యూసెక్కుల నీటిని, అంటే 90 మిలియన్ లీటర్ల వరకు, మోసుకెళ్తుంది, ఇది చివరికి సింధు నదిలో కలుస్తుంది.

అంతేకాక, మోదీ ప్రభుత్వ ‘జల్ జీవన్ మిషన్’ కింద లడఖ్‌లోని అనేక గ్రామాలకు ఇప్పుడు కుళాయి ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్తాన్‌ల మధ్య సింధు జలాల ఒప్పందం రద్దు అయినప్పటి నుండి, మోదీ ప్రభుత్వం దేశీయ అవసరాల కోసం ఈ నదుల నీటిని వినియోగించుకోవడానికి అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేసింది.



## గల ముఠా పట్టివేత

పయోగించే రెండు కట్టర్లు, నాలుగు పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వలసదారులు ఇలాంటి నేర కార్యకలా పాల్లో తరచుగా పట్టుబడుతున్నారనే ఆరోపణలు పెరుగుతున్నాయి. దేశ ప్రజల ఆస్తులను ధ్వంసం చేయడం, దొంగతనాలకు పాల్పడటం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# కర్రెగుట్టపై జాతీయ జెండా రెపరెపలు



దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఐదు దశాబ్దాలపాటు జాతీయ జెండాను ఎగురవేయడానికి భయపడిన ప్రాంతాలు ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ ప్రాంతానికి వెళ్లడానికి అధికారులు, రాజకీయ నాయకులు కూడా జంకేవారు. అటువంటి ప్రాంతంలో జాతీయ జెండా ఎగురవేయడం ఒక వార్త కావడంలో ఆశ్చర్యం లేదు. కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పుణ్యమా అని అటువంటి పలు ప్రాంతాలలో ప్రజలకు జాతీయ జెండా ఎగురవేసే అవకాశం లభించింది.

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలో గల కర్రెగుట్ట కొండల ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉండేది. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) నియంత్రణలో ఉన్న అత్యంత భారీగా మందుపాతరలు అమర్చిన ప్రాంతాలలో ఇది ఒకటి. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో భద్రతాదళాలు కూడా అటు వెళ్లేందుకు జంకేవారు. అయితే, ఈసారి స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఛత్తీస్‌గఢ్– తెలంగాణ వైపుగా 650 అడుగుల ఎత్తున ఉన్న కర్రెగుట్ట కొండల ప్రాంతంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనేక దశాబ్దాలుగా కర్రెగుట్ట మావోయిస్టులకు సురక్షిత అడ్డాగా ఉండటంతో, ప్రభుత్వ అధికారులకు అందుబాటులో లేకుండాపోయింది.

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌లో, అనేకమంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మరణించడమో లేక భద్రతాదళాల ఎదుట లొంగిపోవడమో జరగడంతో ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి మార్గం సుగమం అయింది. అందులో తొలి అడుగుగా కర్రెగుట్ట కొండల పాదాల ప్రాంతమైన పామనూరు నుంచి తాత్కాలికంగా అభివృద్ధి చేస్తున్న రహదారిని ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా సరిహద్దుల వరకు దాదాపు 20 కిమీలు పొడిగించారు. తొలిసారిగా, డీజీపీ ఆనంద్ నేతృత్వంలోని వివిధ శాఖల అధికారుల బృందం, సీఆర్‌పీఎఫ్, ఇంటెలిజెన్స్, అటవీ శాఖల సీనియర్ అధికారులతో కలిసి, కాన్వాయ్‌లో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రోడ్డు నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. గతంలో, ఉన్నతాధికారులు దట్టమైన అడవికి చేరుకోవడానికి, గగనతలం నుండి వీక్షించడానికి హెలికాప్టర్లను ఉపయోగించేవారు.

# రాహుల్ ఆదర్శమైతే ఇంతేనా?



సంవత్సరానికి 40 లక్షల రూపాయలు సంపాదించే వరుడి నుంచి పెళ్లి ప్రతిపాదనను ఒక మహిళ తిరస్కరించడం ఆన్‌లైన్‌లో చర్చకు దారితీసింది. కాబోయే, వరుడు రాహుల్ గాంధీని తన ఆదర్శంగా ఎంచుకోవడం తనకు ఆమోదయోగ్యం కాలేదని ఆమె స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయాన్ని ఎక్స్‌లో పంచుకుంటూ, ఆ వ్యక్తి మంచి జీతం తీసుకుంటున్నా, అందంగా ఉన్నా, "మంచి కుటుంబానికి" చెందినవాడైనా, అతని ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ చూసిన తర్వాత తాను ముందుకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నానని ఆరోహి రెడ్డి చెప్పింది.

ఆరోహి రెడ్డి 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో చేసిన ఈ వాదనతో, వివాహ నిర్ణయాలలో రాజకీయ, సైద్ధాంతిక విశ్వాసాల పాత్రపై సోషల్ మీడియాలో చర్చ ప్రారంభమైంది.

ఇటీవల ఆమెకు "చూడటానికి అందంగా" ఉండే, సంవత్సరానికి రూ.40 లక్షలు సంపాదించే, "మంచి కుటుంబానికి" చెందిన ఒక వ్యక్తి నుండి పెళ్లి ప్రతిపాదన వచ్చింది. అయితే, ఆమె ఒకే ఒక కారణంతో ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు చెప్పారు: అతని ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌లో రాహుల్‌గాంధీని తన రోల్ మోడల్‌గా పేర్కొన్నాడమే అతడికి ప్రతికూలమైంది. "వరుసగా ఓడిపోయేవాడు" అంటూ తానే వర్ణించిన వ్యక్తిని ఆదర్శంగా భావించే వారి తెలివితేటలను రెడ్డి ప్రశ్నించారు. అంతేకాక, అటువంటి వ్యక్తి 'బానిసత్వం, దేశ వ్యతిరేక, హిందూ వ్యతిరేక' భావజాలాన్ని తన పిల్లలకు నూరిపోస్తారని ఆమె ఆరోపించారు.

తనకు డబ్బు, రూపం లేదా విజయవంతమైన వృత్తి కంటే దేశం, తన "సనాతన ధర్మం" చాలా ముఖ్యమని ఆమె అన్నారు.

"గర్వపడే జాతీయవాది అయిన హిందువుగా, నేను అలాంటి వ్యక్తిని నా జీవిత భాగస్వామిగా ఎన్నటికీ అంగీకరించలేను," అంటూ ఆమె ఎక్స్‌పై తన భావాలు పంచుకున్నారు.

కథ

# మొలకెత్తిన

## గుమ్మడి రవీంద్రనాథ్

దేశంలోని అతిపెద్ద బ్యాంక్ చైర్మన్–మేనేజింగ్ డైరెక్టర్‌గా వేణు శ్రీరామ్ పదవీ విరమణ చేసాడా రోజు. అంత పెద్ద హోదాలో రిటైరైన ఆయనను, పలు కార్పోరేట్ సంస్థలు తమ పాలక మండలిలో డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించమని అభ్యర్థించాయి. 'చెస్ బోర్డుపై ఉన్నంతవరకే రాజు, మంత్రి, బంట్రోతు అన్న భేదాలు. ఆట ముగిసాక అన్నీ ఒకే డబ్బాలోకి వెళ్లిపోవలసిందే!' అనే మాట శ్రీరాంకి వర్తించలేదు. పదవిలో ఉన్నప్పుడే కాదు, పదవీ విరమణ తర్వాత కూడా ఆయన విలువ తగ్గలేదు. కానీ వెతుక్కుంటూ వస్తున్న ఆ పదవులన్నిటినీ తృణప్రాయంగా వదిలేసాడు భార్య రుక్మిణికోసం!

శ్రీరామ్ పెళ్లిచూపుల్లో రుక్మిణిని తొలిసారి చూసినప్పుడు ఆమె అద్భుత సౌందర్యానికి ముగ్ధుడై పోయాడు. ఆ క్షణమే ఆమెతో ప్రేమలో పడిపోయాడు. ఆమెతో వివాహమైన కొద్దిరోజులకే అతనికి అవగతమైపోయింది. ఆమె సౌందర్యానికే రూపాత్మక నిర్వచనం కాదు, సహానుభూతికీ నిలువెత్తు నిదర్శనం అని. సాటిమనిషి కష్టాన్నీ, దుఃఖాన్నీ తనవిగా భావించే మంచితనం రుక్మిణిది. మంచితనమంటే మనసు లోపల జాలిపడిపోవడం మాత్రమే కాదు. చేయందించి, చేతనైన సాయంచేసి ఆదుకుంటుంది. శ్రీరాం అలా కాదు. ఎప్పుడూ కంఫర్ట్ జోన్‌లో ఉండా లనుకుంటాడు. పుట్టినరోజునాడో, పెళ్లిరోజునో అనాథ శరణాలయానికి కొంత డబ్బు విరాళంగా ఇస్తే అదే మానవత్వం అనుకుంటాడు. రుక్మిణేమో ప్రతిదినం చిన్నదో పెద్దదో ఒక అలవాటులా ఏదో ఒక మంచి పని చెయ్యాలి అంటుంది. జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలనే ధ్యాస తప్ప ఇతరుల కష్టం గురించి ఆలోచించే సమయం లేదతనికి. తనలోని మానవత్వ పరిమళాలను భర్తలోనూ నింపాలని చాల ప్రయత్నించింది రుక్మిణి.

ఉద్యోగబాధ్యతలు అనే సాకుతో తప్పించుకునే వాడు శ్రీరామ్. 'సాటి మనిషి' అన్న మాటకు ఆమె అర్థం వేరు. తనతో సమాన స్థాయిలో ఉన్నవారి తోనో,తనకన్నా ఉన్నత స్థానంలో ఉన్నవారితోనో సహానుభూతితో మెలగడం కాదు.. తన కన్నా క్రింది స్థాయిలో ఉన్నవారితోనూ, అసలు ఏ స్థాయీ లేనివారితోనూ అంతే కరుణతో చేయందిస్తుంది రుక్మిణి. సహానుభూతి విషయంలో ఇద్దరి స్వభావాల్లో వ్యత్యాసమున్నా వాళ్లు అన్యోన్య దంపతులు. భార్యంటే ప్రాణం. అమెకూ భర్తంటే ఎనలేని అనురాగమే. దైనందిన జీవితంలో నిత్యం దయతో కూడిన ఏదో ఒక మంచిపని చెయడమనే విషయంలో తప్ప, భర్త గురించి ఏ చిన్ని అసంతృప్తీ లేదామెకు.

* * *

ఆ రాత్రి పది గంటలప్పుడు...పడకగదిలోకి ప్రవేశించి, పక్కన చేరిన భర్తతో "చాలా సంస్థలు రా–రమ్మని పిలుస్తున్నాయిగా మిమ్మల్ని. పదవిలో ఉన్నప్పటికంటే కూడా ఇప్పుడు ఇంకా బిజీగా మారిపోతారు కాబోలు తమరు!" అంది రుక్మిణి ఆమె కళ్లల్లోకి చూసి చిరునవ్వు నవ్వాడు రామ్. "అవును. బిజీగానే ఉండబోతున్నాను"...అని ఆగి, "..కానీ నువ్వనుకున్నట్టు కాదు. నువ్వు నా నుంచి ఆశిస్తున్నట్టు!" అన్నాడు.

"అంటే?"

"అంటే.. నేనూ నీలా దయతో కూడిన చిన్నిచిన్నిపనులు చేద్దామనుకుంటున్నాను రేపటి నుంచి. ఇన్నేళ్లుగా ఉద్యోగంలో ఎదగాలనే ఆరాటంలో, పరుల కష్టాల్ని చూసి స్పందించలేదు. ఇక నుంచి 'సాయం' అందిస్తాను. 'బాధ'ను అర్థం చేసుకోగలుగుతున్నామంటే మనం జీవించి ఉన్నామని అర్థంట. అదే 'ఇతరుల బాధ'ను అర్థం చేసుకోగలిగితే మనం మనిషిగా జీవిస్తున్నట్టట! ఇక నుంచి మనిషిగా 'జీవించడం'లో బిజీగా ఉంటాను రుక్కూ!" భర్త మాట వినగానే, రుక్మిణి కళ్లల్లోకి చటుక్కున చెమ్మ ఊరింది.!

* * *

మర్నాడు ఉదయపు నడక కోసం సముద్ర తీరానికి (బీచ్) వెళ్లాడు శ్రీరామ్. తూర్పున లేత ఎండ అరుణకాంతితో సముద్రం పైపడి మెరుస్తోంది. తన పక్కనే నడుస్తున్న వ్యక్తిని చూసి పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు రామ్. అతనెవరో రామ్‌కి తెలియదు. పూర్తిగా అపరిచితుడు. ఆ వ్యక్తికి ఆశ్చర్యంగా ఉన్నా, ఊహించని ఆ చిరునవ్వుకి



# విత్తనం

తెలీకుండానే సంతోషం అనిపించింది. బదులుగా అతనూ రామ్‌ని చూసి నవ్వాడు. అలా ముక్కూ ముఖం తెలీని వ్యక్తిని చూసి చిరునవ్వు నవ్వడంలో కూడా ఒక ఆనందం ఉంటుందని మొదటిసారి తెలిసింది రామ్‌కి.

నడక పూర్తైన తర్వాత, బీచ్‌లో అస్తవ్యస్తంగా పడిఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి చెత్త వేసేందుకేర్పాటు చేసిన డబ్బాలో వేసాడు రామ్. తిరిగి ఇంటికి బయలుదేరాడు. అతను నివాసముండే గేటెడ్ ఫ్లాట్లకు పక్కనే ఒక చిన్న అపార్ట్మెంట్ ఉంటుంది. దానిపేరు అమూల్య రెసిడెన్సీ. దాని గేటుదగ్గర పదేళ్ల వయసున్న పాప ఏడుస్తూఉండటం కనిపించింది. ఆ రెసిడెన్సీకి వాచ్‌మన్‌గా పనిచేస్తున్న అంజయ్య కూతురు ఆ పాప.

"ఎందుకేడుస్తున్నావు పాపా?" దగ్గరకెళ్లి అడిగాడు శ్రీరామ్. బదులేమీ చెప్పకుండా ఇంకా ఏడుస్తూనే ఉంది. అప్పుడు అంజయ్య "తనాడుకునే బొమ్మకారు పాడైపోయింది. కొత్తది కొనివ్వమని ఏడుస్తోంది. డబ్బుల్లేవమ్మా అంటే అర్థం చేసుకోడం లేదు సార్" చెప్పాడు.

"నీ పేరేంటి తల్లీ"అంటూ వెనుక చక్రం ఒకటి విరిగిపోయిన ఆ టాయ్ కారుని చేతిలోకి తీసుకున్నాడు రామ్.

"శ్రీదేవి" బుగ్గల మీది కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పిందా పిల్ల.

చదివిన చదువుతో సంబంధంలేని బ్యాంకింగ్ ఉద్యోగంలో అత్యున్నత స్థానానికెదిగిన శ్రీరామ్, మొదటిసారి తన బీటెక్ పట్టాకి పని కల్పించాడు. "స్క్రూడ్రైవరుందా?" అని అంజయ్యని అడిగి, తీసుకుని, ఒక సీసా మూతని, విరిగిపోయిన చక్రం స్థానంలో అమర్చాడు. చిన్నగా నవ్వుతూ "నీ కారుని రిపేర్ చేశాను. ఇప్పుడు ఆడుకో" అన్నాడు శ్రీదేవితో.

ఇక ఎప్పటికీ పనిచేయదేమో అనుకున్న తన కార్, బ్యాటరీతో మునుపటిలాగానే నేల మీద పరిగెడుతుంటే ఆ పసిపాప కళ్లు ఆనందంతో మెరిసాయి. "నా పేరు వేణు శ్రీరామ్. మీ పక్కనే ఉంటాం" అంటూ ఆ చిన్నిపిల్ల చేతిని ఆప్యాయంగా అందుకుని కరచాలనం చేశాడు. దాంతో అ పిల్ల ఉబ్బి తబ్బిబ్బైపోతూ "థాంక్ యూ సార్" అంది సంతోషంతో.

* * *

ఇల్లు చేరాక, స్నానం ముగించి భార్య వడ్డించిన అల్పాహారం తింటూ,"ఆహా! ఎంత కమ్మగా ఉందో రుక్కూ"అని భార్య చేతివంటని మెచ్చుకున్నాడు రామ్. "ఇన్నేళ్ల కాపురంలో ఏనాడైనా నా వంటకి వంక పెట్టారా మీరసలు! ఎప్పుడూ పొగడ్డమేగానీ" అంది రుక్మిణి మురిసిపోతూ.

"ప్రపంచంలో అందరికన్నా దీ బెస్టు, స్వీటెస్టు భార్యవి నువ్వు" చెప్పాడు గర్వంగా. అప్పుడామే భర్తకు చేరువగా వచ్చి, "ఈరోజు ఉదయపు నడక సమయంలో మీరు చేసిన మంచి పనులకు నా కానుక" భర్త బుగ్గ మీద 'ప్చ్' అని ముద్దు పెట్టి వంటింట్లోకి పరుగెట్టింది రుక్మిణి.

* * *

అదేరోజు మధ్యాహ్నం. పొద్దున్న చేసిన ఆ చిన్ని పనుల వల్ల లభించిన సంతృప్తి రామ్ గుండెని ఇంతకు ముందెరగని ఒక అనుభూతితో నింపేస్తోంది. ఇంకా ఏదో చేయాలనిపిస్తుంటే, అతనికి ఆరో అంతస్తులో ఉండే మధుసూదనరావు గారు గుర్తొచ్చారు. అయన విశ్రాంత శాస్త్రవేత్త. కేంద్ర పరిశోధన సంస్థలో ముఖ్య శాస్త్రవేత్తగా పనిచేసి పదవీ విరమణ చేసారు. ఆరునెలల క్రితం ఆయన భార్య మరణించింది. వారికి సంతానం లేదు. కింద పార్కుల్లో తరచూ కనిపిస్తుండే ఆయన,భార్య మరణం తర్వాత పూర్తిగా ఇంటికే పరిమితమైపోయారు. ఒంటరితనపు నరకం కుంగదీస్తోంది ఆయన్ను. ఆయన్ను ఒకసారి పలకరించి రావాలనుకున్నాడు రామ్. అలాంటి వారికి, ఒక పలకరింపు కూడా ఎంతో సాంత్వననిస్తుంది. లిఫ్ట్‌లో ఆరో అంతస్తుకి వెళ్లి, మధుసూదనరావు ఫ్లాట్ తలుపు గంట మోగించాడు. తలుపు తెరుచుకోలేదు. ఎందుకో భయంవేసింది రామ్‌కి. చాలాసేపటికి తలుపు తెరుచుకుంది. ఎదురుగా రావుగారిని చూడగానే, వేణు మనసు కుదుటపడింది. ఆయన శ్రీరాంవేణుని గుర్తుపట్టారు. ఆయన భార్య మరణించినప్పుడు, రుక్మిణి ప్రోద్బలంతో కర్మకాండల సమయంలో దగ్గర ఉన్నాడు రామ్.

"మీరా, ర..రండి" అని ఆయన చెప్పగానే, లోపలికి వెళ్లాడు రామ్. ఆ క్షణం మధుసూదనరావు 'మామూలు'గా లేరు.. ఏదో తేడాగా ఉన్నారని పించింది రామ్‌కి. కొద్ది క్షణాల్లోనే ఆ తేడా ఏమిటో తెలిసిపోయింది. అంతే. టక్కున ఆయన చేతిలోని చరవాణిని లాగేసుకున్నాడు రామ్!

* * *

"మీ ఆధార్‌ని, సుదాఖత్ ఖాన్ అనే నేరగాడు దుర్వినియోగం చేసాడు. కంబోడియా,మయన్మార్ దేశాలకు మానవ అక్రమరవాణా చేస్తున్న కేసులో మీ పేరు అనుమానితుల జాబితాలో ఉంది" అంటూ సీబీఐ అధికారి మధుసూదన రావుని మూడు రోజులుగా డిజిటల్ అరెస్టులో ఉంచాడు.

"మీ మేలు జన్మలో మర్చిపోలేను శ్రీరామ్ గారూ!మీరు రావడం ఒక్క నిమిషం ఆలస్యమైనా నేను నా రిటైర్మెంట్ డబ్బు మొత్తాన్ని ఆ సైబర్ నేరగాళ్ల అకౌంట్లకి బదిలీ చేసేసిఉండేవాడ్ని" రామ్ చేతులు పట్టుకుని చెప్పారు మధుసూదన రావు.

"ఈ సమయానికి నేను రావడం కేవలం కాకతాళీయం సర్. ఈ తరహా సైబర్ నేరాల గురించి నాకు కొంత అవగాహన ఉంది. మీరు ఏదో లైవ్ వీడియో కాల్ లో ఉన్నట్లు నాకనుమానం వచ్చింది. అందుకే ముందు ఆ కాల్ కట్ చేసి, సైబర్ నేర



పోలీసుకి సమాచారమిచ్చాను" చెప్పాడు రామ్. తన కంటే వయసులో పెద్ద ఐన ఆయన తనకు చేతులు జోడించి నమస్కరిస్తుంటే వారిస్తూ!

✻ ✻ ✻

పదిహేనేళ్లు కాలగర్భంలో కరిగిపోయాయి.

రుచికరమైన చిరుతిళ్లను ఫ్రిజ్‌లో దాచుకుని, అవి అయిపోయే వరకూ మాటిమాటికీ ఫ్రిజ్ తలుపు తెరిచి వాటిని ఆరగిస్తూ ఉంటారు మనుషులు. కానీ, ఉడుతలు అలా కాదు. ఆహారం దొరకని సమయంలో తిందామని, కొన్ని గింజల్నీ, విత్తనాల్నీ భూమిలో పెట్టి దాచుకుంటాయి. కానీ తర్వాత వాటిని ఎక్కడ దాచిందీ గుర్తుపెట్టుకోలేవు. అలా మర్చిపోయిన ఆ 'చిరుతిండే', క్రమంగా మొలకెత్తి వృక్షాలుగా మారి పోతాయి. లక్షల చెట్లు అలా ఎదిగినవే. ఉడుతల మతిమరుపు కూడా మానవాళికి ఒక వరంగా మారుతుంది 'పచ్చదనాల' రూపంలో.

ఈ పదిహేనేళ్ల కాలం, శ్రీరామ్‌కీ ఒకింత మతిమరపుని తెచ్చిపెట్టింది. అల్జీమర్స్ ప్రారంభ దశ. పొరుగు వాడి బాధనూ, దుఃఖాన్నీ తనవిగా భావించి సాయం అందించే పనులకు ఆ వ్యాధి అతనికేమీ ఆటంకం కాలేదు! కానీ అతని ఆరోప్రాణం రుక్మిణి మాత్రం గత రెండు నెలలుగా అచేతనావస్థలో ఉంటోంది. వైద్య పరికరాలే ఆవిడను ప్రాణాలతో నిలబెడుతున్నాయి. కోమాలాంటి స్థితి.

ఆ రోజు, తీవ్రంగా గాయపడ్డ ఒక వీధి శునకానికి ప్రథమచికిత్స చేసి బ్లూక్రాస్ వాళ్ల సంరక్షణలో వదిలి వస్తూ అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయింది రుక్మిణి. ఆవిడ ఊపిరితిత్తుల్లో నీరు చేరినట్లు ఎక్స్‌రేలో కనపడింది డాక్టర్ గణేష్‌కి. సాధారణ ఇన్ఫెక్షన్ అనుకున్నది కాస్తా తీవ్రంగా మారిపోయింది. ఎన్ని మందులు వాడుతున్నా పరిస్థితి మెరుగుపడటం లేదు. ఆసుపత్రి బెడ్ మీద చైతన్య రహితంగా పడిఉన్న భార్య ముఖాన్నే చూస్తూ ఉన్నాడు రామ్. ఆరోజు అంబులెన్స్‌లో ఆసుపత్రికి వస్తుంటే, "వేణు! ఒకవేళ నాకేదైనా ఐతే, నా శరీరాన్ని ప్రయోగాల కోసం వైద్యకళాశాలకు దానం చేసెయ్యాలి. గుర్తుంది కదా! ప్లీజ్.." అంటూ భర్తని వేడుకుంది రుక్మిణి స్పృహ కోల్పోయే ముందు. అది జ్ఞాపకాని కొచ్చి కన్నీళ్లుబికి వచ్చాయి. అప్పుడే అతని ఫోన్ కంపించింది. చూస్తే ఒక సందేశం కనిపించింది తెలియని సంఖ్య నుండి.

"సర్, నమస్కారం!

చాలా ఏళ్ల క్రితం, విరిగిపోయిన ఒక బొమ్మ కారుకు మరమతు చేసి, 'విరిగిన' వాటి విలువ గురించి నేర్పారు. ఇప్పుడు నేను 'క్వాంటమ్-కృత్రిమ మేధ' చదువు పూర్తి చేశాను. నా విద్యను, సాటి మనుషుల జీవితాలను 'మెరుగు' పరచడానికి ఉపయోగించాలని ఆశిస్తున్నాను.

–శ్రీదేవి



పీ యస్: ఆ కారు ఇంకా పనిచేస్తోంది!

✻ ✻ ✻

యథాలాపంగా నాటిన ఒక విత్తనం మొలకెత్తి, చెట్టుగా ఎదిగి నలుగురికి నీడనివ్వబోతున్నంత ఆనందం కలిగింది రామ్‌కి. రుక్మిణి తీవ్ర అనారోగ్యంతో వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడుతూ ఉందని తెలియగానే హుటాహుటిన వచ్చేసింది శ్రీదేవి!

✻ ✻ ✻

క్యూటీ! అంటే...క్వాంటమ్ టెక్నాలజీ! సాంకేతికతలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్న ఒక అధునాతన వ్యవస్థ ఇది. అత్యంత క్లిష్టమైన సమస్యల్ని, ఊహకు అందనంత వేగంతో పరిష్కరించగల సామర్థ్యమున్న సరికొత్త పరిజ్ఞానం. శ్రీదేవి వచ్చి డాక్టర్ గణేష్‌తో మాట్లాడి రుక్మిణికి అందిస్తోన్న చికిత్సకి 'క్వాంటమ్ సాంకేతికత' జతకలిపింది! ఈసారి 'క్వాంటం సెన్సర్లు' సాయంతో రుక్మిణికి ఎంఆర్ఐ చేసింది శ్రీదేవి. ఇమ్యునోహిస్టో కెమిస్ట్రీతో పాటు జన్యు పరీక్షలూ మరల జరిగాయి. 'క్యూటీ'తో కృత్రిమమేధను అనుసంధానించేందుకు వసంత్ అనే మరొక శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు గణేష్‌ని కలిసాడు. శ్రీదేవి, గణేష్, వసంత్... ముగ్గురూ బృందంగా మారి క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధల సాయంతో రుక్మిణి అనారోగ్యం తాలూకు అసలు కారణం కనిపెట్టారు! వ్యాధి నిర్ధారణలో మాత్రమే కాదు మందుల సిఫారసులో కచ్చితత్వాన్ని కూడా 'క్యూటీ'తో సాధించడం ఎలాగో శ్రీదేవికి తెలుసు. అంతేకాదు, నూతన ఔషధాల రూపకల్పనకూ ఈ సాంకేతికత ఎలా ఉపయోగించవచ్చో కుడా తెలుసు!! సరిగ్గా రుక్మిణి జన్యు పదార్థానికి తగ్గట్టుగా ఒక ప్రత్యేకమైన ఔషధాన్ని, ఫార్మసిస్టుల ద్వారా తయారు చేశారు. రెండు నెలలుగా వెంటిలేటెడ్ రోగిగా పడి ఉన్న రుక్మిణిలో మొదటిసారి ఒక సానుకూల మార్పు కనిపించింది. రెండురోజుల్లోనే ఆవిడకు అందిస్తున్న ప్రాణవాయువు ఆవశ్యకత శాతం తగ్గింది! ఆ ముగ్గురి ముఖాలూ మెరిశాయి. నూతన సాంకేతికతతో ఒక ప్రయోగం చేశారు వాళ్లు. క్రమంగా కోమాలోకి వెళ్లి, ఆపై బహుళ అవయవ వైఫల్యంతో మరణిస్తుందని అనుకున్నాడు డాక్టర్ గణేష్. అలాటి రోగి కోలుకోవడం ఒక అద్భుతమేనెమో. నాలుగో రోజు వెంటిలేటర్ తొలిగించేసారు!!

✻ ✻ ✻

రుక్మిణి ఆసుపత్రి నుంచి విడుదలై ఇంటికి వెళుతున్న రోజు..

"శ్రీదేవి!నేను ఒట్టి దేహాన్నే. నా ప్రాణం మాత్రం నా భార్యే. ఆ ప్రాణం ఈ దేహాన్ని విడిచిపోకుండా చేశావమ్మా! నీకెలా కృతజ్ఞత తెలపాలో తెలీడంలేదు తల్లీ" అన్నాడు రామ్ 'చెట్టంత' ఎదిగిపోయిన శ్రీదేవిని చూస్తూ.

"మన చుట్టూ ఉన్న వారి పట్ల సహానుభూతి చూపే మీలోని మానవత్వం తాలూకు 'అలల ప్రభామం' సర్ ఇదంతా.మానవీయ స్పర్శ అనే గులకరాయిని సమాజం అనే సరస్సులో వేశారు మీరు. ఆ చిన్ని స్పర్శ ఎందరినో ప్రభావితం చేసేసింది. నీటి పైన 'అలల శ్రేణి'లా చాలా దూరం వ్యాప్తి చెందిందది. ఆరోజు మీరు మధుసూదనరావు గారికి చేసిన సాయం ఆయనలోనూ మానవతను తట్టిలేపింది. సైబర్ నేరగాళ్ల పాలుకాబోతున్న ఆయన డబ్బుని మీరు కాపాడారు. మీ మంచితనపు 'అలల ప్రభావం'(రిపుల్ ఎఫెక్ట్) ఆయన పైనా పడింది. మీ ప్రేరణతో, ఆ డబ్బుకి ఒక సార్థకత తేవాలనుకున్నారు. నేను చదువుకో గాలిగానంటే, దానికి కారణం, ఆయన ఆర్థిక సాయం అందుకున్న ఐదుగురు పేద విద్యార్థుల్లో నేనొకర్ని కావడం!" శ్రీదేవి చెబుతున్నది సంభ్రమంతో వింటున్నాడు రామ్.

ఆర్ద్రతతో రుక్మిణి గుండె బరువెక్కింది. సరిగ్గా అప్పుడే డాక్టర్ వసంత్ ఆ గదిలోకి వచ్చారు. "సర్! మీకు నేను గుర్తుండకపోవచ్చు. కానీ నేను మిమ్మల్ని మర్చిపోలేదు. చాలా ఏళ్ల క్రితం బీచ్ దగ్గర నడుస్తున్నప్పుడు, నేనెవరో తెలీకపోయినా పలకరిస్తున్నట్టు చిరునవ్వు నవ్వారు నన్ను చూసి. తర్వాత సముద్రతీరంలోని చెత్తనూ, ప్లాస్టిక్ వ్యర్థాలను తీసి శుభ్రం చేసారు. నేను దాన్ని గమనించానా రోజు! మీ నవ్వు ఆరోజంతా నాలో ఉత్తేజాన్నినింపింది"

శ్రీదేవీ, వసంత్ ఇద్దరూ రామ్‌కి రెండువైపులా చేరి ఆత్మీయంగా కౌగిలించు కున్నారు. వెదురులా ఉన్న తన్ను 'వేణువు'ని చేసిన భార్య వంక ఆర్తితో చూస్తున్నాడు 'వేణు'శ్రీరాం! కన్నీటి తెరలు అడ్డుపడ్డ కళ్లతో భర్తను చూస్తోంది రుక్మిణి.

వసంత్ చెప్పింది రామ్‌కి గుర్తురాలేదు. అదేకాదు, ఈ పదిహేనేళ్లుగా చేస్తున్న దయతో కూడిన మంచిపనులేవీ కుడా గుర్తులేవు. కానీ అవన్నీ, ఉడుతలు మర్చిపోయిన విత్తనాల్లా ఎక్కడెక్కడో మొలకెత్తి, మహావృక్షాలుగా ఎదిగి పదిమందికీ నీడనిస్తాయని తెలుస్తోంది! ★




# జమ్మూ-కశ్మీర్‌లో క్రికెట్ పరిమళాలు!

హిమగిరుల రాష్ట్రం జమ్మూ-కశ్మీర్‌లో క్రికెట్ పరిమళాలు వీస్తున్నాయి. కొద్దిమాసాల క్రితం వరకూ సరిహద్దు భూభాగంలో ఉగ్రవాదం, బాంబుపేలుళ్లు, ఉద్రిక్త వాతావరణం లాంటి సమస్యలతో సహవాసం చేసిన యువత క్రికెట్ ఆడుతూ, క్రికెట్ చూస్తూ, జాతీయ క్రికెట్‌లో రాష్ట్రం సాధించిన విజయాలు చూస్తూ గాల్లో తేలిపోతున్నారు.

జమ్మూ-కశ్మీర్ పేరు వినగానే ఒకప్పుడు సరిహద్దు ఉగ్రవాదుల దుశ్చర్యలు, బాంబు పేలుళ్లు, నిరంతర కర్ఫ్యూతో అశాంతి వాతావరణమే కనిపించేది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల చొరవ, పూనికతో రాష్ట్ర హోదా పొందిన ఈ హిమగిరిసొగసుల రాష్ట్రం దశ, దిశ ఒక్కసారిగా మారిపోయాయి. సైనికదళాల ప్రేరణ, భారత క్రికెట్ నియంత్రణమండలి పట్టుదలతో క్రీడా స్ఫూర్తి వెల్లివిరుస్తోంది. ప్రధానంగా క్రికెట్‌తో అనుబంధం పెంచుకొని తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు.

**భారత, ఐపీఎల్ జట్లలో కశ్మీరీ క్రికెటర్లు...**

జమ్మూ-కశ్మీర్‌లోని ప్రతిభావంతులైన పలువురు యువక్రికెటర్లు ఐపీఎల్ ఫ్రాంచైజీ జట్లతో పాటు భారత జట్టులో చోటు సంపాదించుకోగలుగుతున్నారు. 2008-2023 మధ్యకాలంలో దేశవాళీ క్రికెట్‌లో ఉనికిని చాటుకొన్న ఆఫ్ స్పిన్ ఆల్ రౌండర్ పర్వేజ్ రసూల్ 2014లో బాంగ్లాదేశ్ ప్రత్యర్థిగా వన్డే మ్యాచ్, 2017లో ఇంగ్లండ్ ప్రత్యర్థిగా టీ-20 మ్యాచ్ ఆడటం ద్వారా చరిత్ర సృష్టించాడు. భారతజట్టులో చోటు సంపాదించిన జమ్మూ-కశ్మీర్ తొలి క్రికెటర్‌గా రికార్డుల్లో చేరాడు.

ఆ తరువాత మెరుపు ఫాస్ట్ బౌలర్ ఉమ్రాన్ మాలిక్ 2022, 2023 సీజన్‌లలో భారత్ తరపున వన్డే, టీ-20 మ్యాచ్‌ల్లో పాల్గొనడం ద్వారా ఆ రాష్ట్ర క్రికెట్ ఘనతను చాటి చెప్పాడు. ఆ పరంపరంలోనే ప్రస్తుత తరం ఫాస్ట్ బౌలర్ అకిబ్ నబీ, శ్రీలంకతో ముగిసిన రెండుమ్యాచ్‌ల (2026 టెస్టు లీగ్) సిరీస్‌లో పాల్గొన్న భారతజట్టులో సభ్యుడిగా ఉన్నాడు. పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్, అబ్దుల్ సమద్‌లు ఐపీఎల్‌లో వివిధ ఫ్రాంచైజీలకు సైతం ప్రాతినిథ్యం వహించారు.

**రంజీట్రోఫీ టైటిల్‌తో సంచలనం...**

ముంబై, ఢిల్లీ, కర్ణాటక, మధ్యప్రదేశ్, బెంగాల్, రాజస్థాన్, విదర్భ, తమిళనాడు, సౌరాష్ట్ర లాంటి దిగ్గజ జట్లను అధిగమించి, ప్రతిష్ఠాత్మక రంజీట్రోఫీని జమ్మూ- కాశ్మీర్ తొలిసారిగా నెగ్గింది. పరస్ డోగ్రా నాయకత్వంలోని జమ్మూ-కశ్మీర్ జట్టు అందరి అంచనాలు తలకిందులు చేస్తూ, 2025-26 సీజన్ రంజీ టైటిల్‌ను సొంతం చేసుకొంది.

మూడుసార్లు విజేత, అపారఅనుభవంతో పాటు కెఎల్ రాహుల్, కరుణ్ నాయర్ లాంటి పలువురు దిగ్గజ ఆటగాళ్లతో కూడిన కర్ణాటక జట్టుతో జరిగిన టైటిల్ సమరంలో అంతగా పేరు, అనుభవం లేని పలువురు యువఆటగాళ్లతో కూడిన జమ్మూ- కశ్మీర్ జట్టు సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించి, సరికొత్త విజేతగా అవతరించింది.

**రంజీట్రోఫీ చరిత్రలో 10వ జట్టుగా...**

నవానగర్ మహారాజా సర్ రంజిత్ సింగ్‌జీ స్మారకార్థం 1934లో ప్రారంభమైన రంజీట్రోఫీకి తొమ్మిది దశాబ్దాలకుపైగా చరిత్రే ఉంది. ప్రస్తుత సీజన్‌లో తలపడిన మొత్తం 38 జట్లలో జమ్మూ-కశ్మీర్‌కు కేవలం 67 సంవత్సరాల చరిత్ర మాత్రమే ఉంది. పటిష్టమైన క్రికెట్ పునాది, ఏ మాత్రం చరిత్ర ఈ జట్టు గత దశాబ్దకాలంలో బలమైన దేశవాళీజట్లలో మేటిగా గుర్తింపు తెచ్చుకొంది. అయితే తొలి విజయం కోసం 1982 వరకూ వేచి చూడాల్సి వచ్చింది. తన 99వ మ్యాచ్‌లో కానీ తొలిగెలుపు రుచిచూడలేని జమ్మూ- కాశ్మీర్ జట్టు 346వ మ్యాచ్‌లో విజేతగా నిలువగలిగింది. కశ్మీర్ జట్టు 1960 నుంచి 2026 వరకూ ఆడిన 346 మ్యాచ్‌ల్లో 47 విజయాల రికార్డుతో నిలిచింది.

ఈ విజయంలో ప్రధానపాత్ర వహించిన ఓపెనర్ శుభం పుందిర్‌కు మ్యాన్ ఆఫ్ ది ఫైనల్స్, మొత్తం సీజన్లో 60 వికెట్లు పడగొట్టిన అకిబ్ నబీకిప్లేయర్ ఆఫ్ ది టోర్నీ పురస్కారాలు దక్కాయి. జట్టుకు బీసీసీఐ ట్రోఫీతో పాటు రూ.5 కోట్లు నజరానాగా బహుకరించింది.

**సీపీఎల్ టీ-20తో నూతనోత్తేజం...**

దేశంలోని మిగిలిన రాష్ట్ర క్రికెట్ సంఘాలకు తీసిపోని రీతిలో జమ్మూ-కశ్మీర్ క్రికెట్ సంఘం సైతం యువక్రికెటర్ల సత్తాను వెలుగులోకి తీసుకురావడం కోసం 2026 సీజన్ నుంచే సీపీఎల్ (ద చీనార్ ప్రీమియర్ లీగ్) పేరుతో తొలిసారిగా నిర్వహించిన టీ-20 లీగ్ సరికొత్త స్ఫూర్తినే నింపింది.

జమ్మూ, కశ్మీర్, లడక్ ప్రాంతాలకు చెందిన మొత్తం 79 జట్లు తలపడిన ఈ టోర్నీని 112 మ్యాచ్‌లుగా నిర్వహించారు. జమ్మూ-కశ్మీర్‌లోని నవతరం క్రికెటర్లకు ఈ లీగ్ వేదికగా నిలవడంతో పాటు సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. శ్రీనగర్, అనంతనాగ్, కుప్వారా, కార్గిల్, బారాముల్లా వేదికలుగా నిర్వహించిన ఈ లీగ్ సమరంలో శ్రీనగర్, బారాముల్లా, బుద్గావ్, సోపోర్, షోపియాన్, అనంతనాగ్, కుప్వారా, కార్గిల్, లే, ద్రాస్ ప్రాంతాలకు చెందిన క్రికెటర్లు సైతం ఈ లీగ్‌లో పాల్గొనటం ద్వారా తమ ప్రతిభను చాటుకోగలిగారు.

**లడాక్ లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం!**

ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో లడాక్‌లోని లే నగరంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించాలని ఆ ప్రభుత్వం భావిస్తోంది. అక్కడికి 20 కిలోమీటర్ల దూరంలోని తిక్సాయ్- రణబీర్ పూర్ ప్రాంతంలో, సముద్రమట్టానికి 11వేల 800 అడుగుల (3600 మీటర్లు) ఎత్తులో 40వేల సీటింగ్ సామర్థ్యంతో రూ.100 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టేడియం నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# గ్రామవికాస్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం



**పాలకొల్లు :** ఆగస్ట్ 23న గ్రామవికాస్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం గవరపేటలో జరిగింది. 52 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో పాలకొల్లు ఖండసంఘచాలక్ కలిదిండి నరసింహారాజు, విభాగ్ సంయోజక్ చింతాకుల గోపాలకృష్ణ, పశ్చిమగోదావరి జిల్లా సహసంయోజక్ సాధనాల శ్రీనివాస్, విశ్వమానవ గోవేదిక ఓల్డ్ ఏజ్ హోమ్ అధ్యక్షులు మల్లుల సురేష్, డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరి, గ్రామవికాస్ గ్రామ సంయోజక్ యల్లపు చంద్రశేఖర్, సహసంయోజక్ కాండ్రేకుల గాంధీ, తూర్పుగోదావరి జిల్లా సావలంబి ప్రముఖ్ కలగ సతీష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.






**భాగ్యనగర్ :** ఆగస్టు 23న ఆరోగ్యభారతి తెలంగాణ ప్రాంత మహిళా కార్యకర్తల శిక్షణ భాగ్యనగర్ ఎస్వీ పూజ హాస్పిటల్ నందు జరిగింది. 50 మంది మహిళలు పాల్గొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, తరుణ వయస్కులు గురవుతున్న చెడు అలవాట్లు, సీజన్‌లో వచ్చే వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తల గురించి, చిన్న పిల్లల క్యాన్సర్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాంత అధ్యక్షుడు డాక్టర్ రామ్‌సింగ్, క్షేత్ర సంఘటన కార్యదర్శి కుమారస్వామి, ప్రాంత కార్యదర్శి రమేష్ గౌడ్, డాక్టర్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.




**పాలమూర్ :** శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఆగస్ట్ 23న పాలమూర్‌లోని సరస్వతి శిశుమందిర్ ఆవాస విద్యాలయంలో జరిగిన ఖేల్‌కూద్ పోటీలలో భాగ్యనగర్ నాదర్‌గుల్ విద్యాభారతి విజ్ఞాన కేంద్ర పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని 283 పాయింట్లు సాధించి, ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. విజేతలకు విద్యాభారతి విజ్ఞానకేంద్ర మేనేజ్‌మెంట్ పతకాలు విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్ అందజేశారు. పాఠశాల వైస్ ఛైర్మన్ బుసు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి విష్ణువర్ధన్‌రాజు, మెంబర్ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపల్ కరుణాకర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# భారతీయ ధ్యాన పద్ధతులు

**భారతీయ సనాతన ధర్మ సంస్కృతి, ఆధ్యాత్మికత  కేవలం సిద్ధాంతాలకు పరిమితం కాలేదు. అది ఒక జీవన విధానం, నిరంతర సాధన. మానవుడు తన అంతరాత్మను మేల్కొలిపి, ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితిని చేరుకునేందుకు మన మహర్షులు ప్రకృతిలోని వివిధ జీవుల ప్రవర్తనను, సహజ గుణాలను గమనించి కొన్ని విశిష్టమైన సాధనలను రూపొందించారు. వాటిలో మీన సాధన, మృగ సాధన, మూడవది కూర్మ సాధన అత్యంత ముఖ్యమైనవి.**

ఈ మూడు సాధనలు మానసిక ఏకాగ్రతను, ఇంద్రియ నిగ్రహాన్ని, అంతర్ముఖ ప్రయాణాన్ని సూచిస్తాయి. వీటి గురించి కొంత చెప్పుకుందాం:

ఈ సాధనలను మానవులు తమ నిత్య జీవితంలో ఎలా అన్వయించుకోవాలో, ఎక్కడ చేయాలో చూద్దాం:

**1. మీన సాధన- చేప వంటి నిశ్చలత్వం, ఏకాంతం కలిగుండాలి.**

మీన సాధన అంటే ఏకాంత ధ్యానం. ప్రాపంచిక కోరికలు, ఆకర్షణలు అనే ఎండమావుల్లో పడకుండా, భగవత్ చింతన అనే అమృత జలంలో మనస్సును నిశ్చలంగా ఉంచాలి. బాహ్య ప్రపంచపు అల్లకల్లోలం మనస్సుకు అంటకుండా, ఒకే లక్ష్యంపై దృష్టి పెట్టడమే ఈ సాధన. సంసారమనే సాగరంలో మునిగి తేలుతున్నప్పటికీ, మాయ అనే నీరు మనస్సుకు అంటకుండా నిరంతర జ్ఞాననేత్రంతో మేల్కొని ఉండటమే మీన సాధన పరమార్థం.

దీనినిఎక్కడ చేయాలి? దీనిని ప్రశాంతమైన, ఏకాంతమైన ప్రదేశంలో – ధ్యాన మందిరం లేదా ఇంట్లోని ఒక నిశ్శబ్దప్రదేశంలో) కూర్చుని చేయాలి. సాధకుడు భగవంతునితో కనెక్ట్ అవ్వడానికి ఏకాంతం ఎంతో అవసరం.

**2. మృగ సాధన - లేడి వలె పవిత్రమైన శ్రవణం**

లేడి అత్యంత సున్నితమైన శ్రవణశక్తిని కలిగి ఉంటుంది. స్వల్ప శబ్దానికి కూడా అప్రమత్తమై ఎల్లప్పుడూ చురుగ్గా, భయరహితంగా ఉండేందుకు ప్రయత్ని స్తుంది. ఆధ్యాత్మిక మార్గంలో గురువు ఉపదేశాన్ని, సత్సంభాషణలను అత్యంత శ్రద్ధతో, ఏకాగ్రతతో వినడం–శ్రవణ భక్తిని–సూచిస్తుంది. మనస్సును ఎల్లప్పుడూ పవిత్రంగా, చురుగ్గా ఉంచుకోవడమే ఈ సాధన.

ప్రాపంచిక కోరికలనే వేటగాడి బారిన పడకుండా, సాధకుడు ఎల్లప్పుడూ తన బుద్ధిని లేడి వలె చురుగ్గా, అప్రమత్తంగా ఉంచుకోవాలి. అంతరంగ నాదాన్ని – అనాహత ధ్వనిని– వినడానికి ఈ సాధన ఉపకరిస్తుంది. మానవులు తమ చెవులను భగవంతుని లీలలు, గురువుల ఉపదేశాలు, సత్సంగాలు వినడానికి ఉపయోగించాలి.

దీనిని సత్సంగాలలో, గురువుల సన్నిధిలో, భజన కూటములలో లేదా ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగే చోట చేయవచ్చు. సమాజంలో ఉంటూనే మంచి విషయాలను మాత్రమే గ్రహించే ప్రదేశాలలో ఈ సాధన సాధ్యమవుతుంది.

**3. కూర్మ సాధన -తాబేలు వంటి ఇంద్రియ నిగ్రహం**

భారతీయ ఆధ్యాత్మికతలో తాబేలు (కూర్మము) ఒక గొప్ప ఉదాహరణ. భగవద్గీతలో కూడా శ్రీకృష్ణ పరమాత్ముడు స్థితప్రజ్ఞుని లక్షణాలను వివరిస్తూ కూర్మాన్ని ఉదహరించాడు. తాబేలుకు ఏదైనా ప్రమాదం పొంచి ఉందని తెలిసిన వెంటనే తన కాళ్లు, చేతులు, తలను లోపలికి ముడుచు కుంటుంది. దీనినే ప్రత్యాహారం అంటారు. అంటే బాహ్య ప్రపంచంలోని శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల వైపు పరిగెత్తే ఇంద్రియాలను (కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక, చర్మం) బలవంతంగా కాకుండా, వివేకంతో అంతర్ముఖం చేయడం.

**"యదా సంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశః"**

తాబేలు తన అవయవాలను దాచుకున్నట్లు, సాధకుడు ప్రాపంచిక విషయాల నుండి తన ఇంద్రియాలను ఉపసంహరించుకుని, ధ్యానంలో స్థిరపడటమే కూర్మ సాధన. ఇది ఆత్మసాక్షాత్కారానికి అత్యంత కీలకమైన అడుగు. రమణమహర్షి ఈ సాధన చేసి భగవద్దర్శనం పొందారు.

భారతీయ సంస్కృతిలోని ఈ మీన, మృగ, కూర్మ సాధనలు కేవలం శారీరక వ్యాయామాలు కావు; ఇవి మనస్సును నియంత్రించే అద్భుతమైన మార్గాలు.

మీన సాధన ద్వారా అచంచలమైన ఏకాగ్రతను,

మృగ సాధన ద్వారా నిరంతర అప్రమత్తతను, శ్రద్ధను,

కూర్మ సాధన ద్వారా ఇంద్రియ నిగ్రహాన్ని అలవరచుకోవచ్చు.

ఈ మూడింటిని సమన్వయం చేసుకుంటూ సాధన చేసినప్పుడు మానవుడు పశుత్వ స్థితి నుండి పరమాత్మ స్థితికి ఎదుగుతాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు.



**ఆదూరి హైమవతీ శ్రీనివాసరావు**
**పుట్టపర్తి**

# బాల జాగృతి



## తల్లిదండ్రుల సేవకు ప్రతీక.. | కథ



ఒకప్పుడు శ్రవణ కుమారుడు అనే బాలుడు ఉండేవాడు. అతని తల్లిదండ్రులు వృద్ధులు. వారికి చూపు కూడా లేదు. అయినప్పటికీ, శ్రవణుడు వారిని ఎప్పుడూ భారంగా భావించలేదు. తల్లిదండ్రుల సేవే తన జీవిత ధర్మంగా భావించాడు.

ఒకనాడు, అతని తల్లిదండ్రులకు తీర్థయాత్ర చేయాలనే కోరిక కలిగింది. తాము వృద్ధులు కావడంతో స్వయంగా నడవలేకపోయేవారు. ఆ కాలంలో ప్రయాణానికి సరైన సౌకర్యాలు కూడా లేవు. అయినా శ్రవణుడు వారి కోరికను నిర్లక్ష్యం చేయలేదు.

అతను ఒక బలమైన కర్రను తీసుకుని, దాని రెండు చివరలకు రెండు బుట్టలను కట్టాడు. ఒక బుట్టలో తండ్రిని, మరో బుట్టలో తల్లిని కూర్చోబెట్టాడు. ఆ కర్రను తన భుజాలపై మోసుకుని, వారిని తీర్థయాత్రకు తీసుకెళ్లడం ప్రారంభించాడు.

అడవులు, కొండ దారులు, ఎండ, వాన... ఇలా ఎన్ని కష్టాలు ఎదురైనా శ్రవణుడు వెనక్కి తగ్గలేదు. తల్లిదండ్రులకు దాహం వేస్తే నీళ్లు తెచ్చి ఇచ్చేవాడు. వారు అలసిపోతే వారికి విశ్రాంతి కల్పించేవాడు. వారి అవసరాలను చూసుకుంటూ, వారి సంతోషమే తన సంతోషంగా భావించేవాడు.

ఒకరోజు అతని తల్లిదండ్రులకు దాహం వేసింది. నీళ్లు తీసుకురావడానికి శ్రవణుడు సమీపంలోని నది దగ్గరకు వెళ్లాడు. అదే సమయంలో దశరథ మహారాజు వేట కోసం అక్కడికి వచ్చాడు.

శ్రవణుడు నదిలో నీళ్లు నింపుతున్నప్పుడు వచ్చిన శబ్దాన్ని, ఏదో జంతువు నీళ్లు తాగుతున్న శబ్దంగా దశరథుడు పొరబడ్డాడు. వెంటనే ఆ దిశగా బాణం వదిలాడు. ఆ బాణం శ్రవణుడిని తాకింది. అక్కడికి చేరుకున్న దశరథుడు, తాను చేసిన పొరపాటుకు తీవ్రంగా బాధపడ్డాడు.

ప్రాణాలు పోయే చివరి క్షణాల్లో కూడా శ్రవణుడు తన గురించి ఆలోచించలేదు. తన తల్లిదండ్రుల గురించే ఆలోచించాడు. "నా తల్లిదండ్రులు నా కోసం ఎదురు చూస్తున్నారు. దయచేసి వారికి నీళ్లు అందించండి" అని దశరథుడిని కోరాడు. తల్లిదండ్రుల పట్ల శ్రవణ కుమారుడు చూపించిన ప్రేమ, సేవ, బాధ్యత అతని జీవితాన్ని చిరస్మరణీయంగా మార్చాయి. ★

## మంచిమాట

ఇతరులను గౌరవించే నీ సంస్కారమే, సమాజంలో నీకు గౌరవాన్ని తీసుకొస్తుంది

## మెదడుకు మేత

వెయ్యి కళ్లున్నా ఒక్కటే చూపు.. ఏమిటది?

జవాబు : జల్లెడ

## పద్యం

నేర నన్నవాఁడు నెరజాణ మహిలోన
నేర్తునన్న వాఁడు నింద జెందు
ఊరుకున్న వాఁడె యుత్తమ యోగిరా
విశ్వదాభిరామ! వినురవేమ!

**భావం :** ఈ లోకంలో తనకు ఏ పనీ, విద్య పూర్తిగా రాదని అనుకుంటూ వినయంగా ఉండేవాడే తెలివిగలవాడు. 'నాకు అన్నీ తెలుసు అని విర్రవీగే వాడు అందరిలోనూ అపహాస్యం పాలై నిందలు ఎదుర్కొంటాడు. అనవసరమైన మాటలకు పోకుండా, మౌనంగా ఉంటూ తన పని తాను చేసుకుపోయేవాడే ఉత్తమమైన యోగి.

## శ్లోకం

అభివాదన శీలస్య నిత్యం వృద్ధోప సేవినః
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యా యశో బలమ్

**భావం :** నిత్యం వృద్ధులను సేవించేవారికి, నమస్కరించేవారికి ఆయుష్షు, విద్య, కీర్తి, బలం దినదినాభివృద్ధి చెందుతాయి.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| పొంగల్ | కేరళ |
| ఓణం | తెలంగాణ |
| బిహు | తమిళనాడు |
| బతుకమ్మ | మహారాష్ట్ర |
| గుడి పడ్వా | అసోం |

సమాధానాలు : పొంగల్–తమిళనాడు; ఓణం–కేరళ; బిహు–అసోం; బతుకమ్మ–తెలంగాణ; గుడి పడ్వా–మహారాష్ట్ర.

## శాస్త్రవేత్తలు

### జి.డి. నాయుడు

(మార్చి 23, 1893 – జనవరి 4, 1974)



గోపాలస్వామి దొరైస్వామి నాయుడు (జీడీనాయుడు) మన దేశానికి చెందిన ప్రముఖ ఆవిష్కర్త, పారిశ్రామికవేత్త, ఇంజినీర్. విద్యుత్, మెకానికల్ ఇంజినీరింగ్, రేడియో, ఫోటోగ్రఫీ వంటి అనేక రంగాల్లో ఆయన ప్రయోగాలు, ఆవిష్కరణలు చేశారు. స్వయంగా నేర్చుకుంటూనే, ప్రయోగాల ద్వారా కొత్త విషయాలను తెలుసుకోవడంపై ఆయనకు ఎంతో ఆసక్తి ఉండేది. దేశంలో పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధికి ఆయన చేసిన కృషి కారణంగా ఆయనను 'భారతదేశపు ఎడిసన్' అని కూడా పిలుస్తారు. మోటార్లు, విద్యుత్ పరికరాలు, యంత్రాలు వంటి అనేక రంగాల్లో ఆయన చేసిన ప్రయోగాలు, ఆవిష్కరణలు ప్రత్యేక గుర్తింపు పొందాయి.

## జనరల్ నాలెడ్జ్

1. మాల్గుడి డేస్ పుస్తకాన్ని ఎవరు రచించారు?
2. భారతదేశంలో అత్యంత పొడవైన నది ఏది?
3. 'జనగణమన'ను మొదటిసారిగా ఏ సమావేశంలో ఆలపించారు?

జవాబులు : 1. ఆర్.కె. నారాయణ్; 2. గంగా; 3. 1911లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ కలకత్తా సమావేశంలో.

## భక్తాగ్రేసరులు

### గరిమిరెడ్డి అచ్చమాంబ




గవిరి అచ్చమాంబ... కాలజ్ఞానం కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి ఒకనాటి యజమాని, అనంతర కాలంలో ప్రథమశిష్యురాలు. క్షేత్రదర్శనకు బయలుదేరిన వీరబ్రహ్మం బనగానపల్లి చేరి, ఆ రాత్రి ఒక ఇంటి అరుగు మీద విశ్రమించారు. మరునాటి ఉదయం ఆయనను గమనించిన ఇంటి యజమానురాలు అచ్చమాంబ ఆయన వివరాలు విని, ఆయన కోరికపై పశువుల కాచేపని అప్పగించింది. రవ్వలకొండ ప్రాంతంలో మేతకు తోలుకు వెళ్లిన పశువులు ఎటూ వెళ్లకుండా, వలయం గీసి కాలజ్ఞాన రచనలో నిమగ్నమయ్యేవాడు. ఒకరోజు అటుగా వచ్చిన అచ్చమాంబ, ఆయన ఏకాగ్రతగా రాస్తుండడం, పశువులు గీతలోపలే మసలే దృశ్యం చూసి ఆయనను మహాజ్ఞానిగా గ్రహించింది. ఇన్ని రోజులు ఆయనతో సేవలు చేయించుకున్నందుకు పశ్చాత్తాపం చెందింది. తనకు జ్ఞానబోధ చేయవలసిందిగా విన్నవించుకొంది. యాగంటిలో జ్ఞానబోధ పొందింది. ఆయన బోధనల ప్రచారానికి కృషి చేసింది. వీరబ్రహ్మేంద్రులు..అచ్చమ్మతో మాట్లాడిన ప్రదేశాన్ని నేటికీ స్థానికులు 'ముచ్చట్ల గుట్ట' అని వ్యవహరిస్తారు.



# వారఫలాలు

31 ఆగస్ట్ - 6 సెప్టెంబర్ 2026




సింహంభట్ల సుబ్బారావు

6300674054




**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆదాయానికి లోటు లేకుండా గడుస్తుంది. రుణబాధలు తొలగుతాయి. వ్యాపారులకు లాభాలు దక్కుతాయి. కొత్త పెట్టుబడులు సైతం సమకూరతాయి. ఉద్యోగులు తమ సత్తా, నేర్పుతో ముందడుగు వేస్తారు. పారిశ్రామికవేత్తలు, రచయితలు, కళాకారులకు గౌరవ పురస్కారాలు అందుతాయి. 31,1 తేదీలలో అనుకోని ఖర్చులు. శారీరక రుగ్మతలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

వాహనాలు కొనుగోలు చేస్తారు. ఆలోచనలు అమలుచేస్తారు. ఆస్తుల విషయంలో కొత్త అగ్రిమెంట్లు చేసుకుంటారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు మరింత అనుకూలత ఉంటుంది. లాభాలు సంతోషం కలిగిస్తాయి. ఉద్యోగులకు నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. పారిశ్రామికవేత్తలు, రచయితలు, కళాకారులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 5,6 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. దేవీఖడ్గమాల పఠించండి..



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆరోగ్యం మరింత మెరుగుపడుతుంది. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. కొత్త భాగస్వాములు జతకడతారు. ఉద్యోగాలలో విధి నిర్వహణలో అవాంతరాలు తొలగి ఊరట లభిస్తుంది. పైస్థాయి నుంచి అభినందనలు అందుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు రెట్టించిన ఉత్సాహంతో ముందడుగు వేస్తారు. 2,3 తేదీలలో వృథా ఖర్చులు. అనుకోని ప్రయాణాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఇంటి నిర్మాణాలపై మరింత దృష్టి పెడతారు. విద్యార్థుల యత్నాలు సఫలం. ఇంటిలో శుభకార్యాలు నిర్వహిస్తారు. అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వాహనసౌఖ్యం. మీ నిర్ణయాలు అందరూ హర్షిస్తారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు దక్కుతాయి. కళాకారులు, రచయితలు, క్రీడాకారులకు అనుకూల సమయం. 2,3 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. గణేశ్‌స్తోత్రాలు పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఆరోగ్యం మెరుగుపడి ప్రశాంత జీవనం సాగిస్తారు. వ్యాపారాలలో మరింతగా లాభాలు అందుతాయి. కొత్త భాగస్వాములు చేరతారు. ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి ప్రశంసలు అందుకుంటారు. రాజకీయవేత్తలు, కళాకారులకు సత్కారాలు, ప్రజాదరణ పెరుగుతుంది. 1,2 తేదీలలో దుబారా ఖర్చులు. ప్రయాణాలు సాగిస్తారు. శివాష్టకం పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వాహన సౌఖ్యం. విద్యార్థులకు పోటీపరీక్షల్లో విజయం. వ్యాపారులు అనుకున్న లాభాలు పొందుతారు. భాగస్వాములతో వివాదాలు సర్దుబాటు కాగలవు. ఉద్యోగుల శ్రమ ఫలిస్తుంది. విశేష గుర్తింపు రాగలదు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలు మరిన్ని విజయాలు సాధిస్తారు. 3,4 తేదీలలో అనారోగ్యం. శ్రమ తప్పదు. గణేశాష్టకం పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

అప్రయత్నంగా కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ఆస్తుల వ్యవహారం కొలిక్కి వచ్చి లబ్ధి పొందుతారు. వ్యాపారాలలో భాగస్వాముల నుంచి మరింత పెట్టుబడులు రాగలవు. ఉద్యోగాలలో కోరుకున్న పదోన్నతులు రావచ్చు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులకు పట్టింది బంగారమే. క్రీడాకారులు, రచయితల యత్నాలు సఫలం. 5,6 తేదీలలో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. శ్రీహయగ్రీవస్తుతి మంచిది.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

దీర్ఘకాలిక సమస్యల నుంచి బయట పడతారు. వేడుకలు నిర్వహిస్తారు. ఆరోగ్యసమస్యలు తీరతాయి. వ్యాపారాలు కొత్త పెట్టుబడులతో విస్తరిస్తారు, కొత్త అగ్రిమెంట్లు చేసుకుంటారు. ఉద్యోగులు విధి నిర్వహణలో అవాంతరాలు అధిగమిస్తారు. రాజకీయ వేత్తలు, కళాకారులకు సత్కారాలు జరుగుతాయి. 31,1 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో చికాకులు.. శ్రీగాయత్రీ ధ్యానం చేయండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆరోగ్యం మరింత మెరుగుపడుతుంది. వ్యాపారాలలో అనుకున్న లాభాలు అందుతాయి, విస్తరణలో అవాంతరాలు తొలగుతాయి. ఉద్యోగాలలో కోరుకున్న పదోన్నతులు రాగలవు. క్రీడాకారులు, పారిశ్రామిక వేత్తలకు అరుదైన అవకాశాలు దక్కుతాయి. 2,3 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. స్నేహితులతో వివాదాలు. మహాలక్ష్మి ప్రార్థన మంచిది.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

కొన్ని నిర్ణయాలు అందరూ ఆమోదిస్తారు. కాస్త రుగ్మతలు బాధించినా ఉపశమనం లభిస్తుంది. వ్యాపారాలలో క్రమేపీ లాభాల బాట పడతారు. ఉద్యోగాలలో కోరుకున్న పదోన్నతులు రాగలవు. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు సంతోషకరమైన సమాచారం. క్రీడాకారులకు విశేష గుర్తింపు. 3,4 తేదీలలో దూరప్రయాణాలు. బంధువిరోధాలు. రాఘవేంద్రస్వామి స్తోత్రాలు పఠించండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

వాహనాలు, గృహం కొనుగోలు యత్నాలు వాయిదా పడతాయి. వ్యాపారాలు కొంత అనుకూలించినా లాభాలు తగ్గడం నిరాశపరుస్తుంది. ఉద్యోగాలలో ఊహించని మార్పులు తథ్యం. పైస్థాయి వారి ఒత్తిడులు పెరుగుతాయి. రాజకీయవేత్తలకు విదేశీ పర్యటనలు వాయిదా పడవచ్చు. కళాకారులు, క్రీడాకారులకు ఒత్తిడులు. 2,3 తేదీల్లో శుభవార్తలు. ఆస్తిలాభ సూచనలు. లక్ష్మీస్తుతి మంచిది.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కొన్ని సమస్యలు తీరతాయి. ఆరోగ్యపరంగా ఇబ్బందుల నుంచి బయటపడతారు. వ్యాపారాలలో అనుకున్న రీతిలో విస్తరణ కార్యక్రమాలు పూర్తి చేస్తారు. కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో అధికారుల మెప్పు పొందుతారు. రాజకీయ వేత్తలు, కళాకారుల ఆశయాలు నెరవేరతాయి. రచయితలకు మంచి గుర్తింపు లభిస్తుంది. 5, 6 తేదీల్లో వృథా ఖర్చులు. బంధు విరోధాలు. ఆదిత్య హృదయం పఠించండి.

# పదరసం-579

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | 4 | 5 | | 6 | 7 |
| | | 8 | | | 9 | | | 10 | |
| 11 | 12 | | | 13 | | | 14 | | |
| | | | 15 | | | 16 | | | |
| 17 | | 18 | | | | 19 | | | 20 |
| | 21 | | 22 | | 23 | | | 24 | |
| 25 | | | | | | | 26 | | |
| | | | | 27 | | 28 | | | 29 |
| 30 | | 31 | 32 | | 33 | | | 34 | |
| 35 | | | | | 36 | | | | |

## ఆధారాలు

**అడ్డం**

1. పాలను తోడుపెడితే (3)
3. పాత కాలపు కొలమానం (3)
6. తండ్రి, జనకుడు (2)
8. ఆజ్ఞ, ఆదేశం (2)
9. సేవకురాలు (2)
10. నలుపు, బొగ్గు ..అటు నుంచి (2)
11. ప్రభువు (3)
13. పాడడం, పాట (2)
14. శివుని విల్లు పేరు (3)
15. భార్య (2)
16. తోబుట్టువు (3)
17. అంబ, తల్లి (3)
19. ఆడశిశువు (2)
21. మనవి, విజ్ఞాపన (3)
23. స్నానానికి వికృతి (2)
24. రంగు, వర్ణం (2)
25. అర్చన లాంటిదే (2)
26. పదును, శౌర్యం (2)
28. చల్లదనం, వణికించేది (2)
31. పరివారమే (5)
34. గట్టితనం, సారం (2)
35. సూచన (4)
36. పెండ్లి కుమారుడు (3)

**నిలువు**

1. అధరం (3)
2. రామయ్యను నది దాటించినవాడు (3)
4. ఇది ప్రదానమట (3)
5. కోపం, ద్వేషం (2)
6. లోభి (4)
7. అనురాగం, ఉత్కంఠ (3)
12. అష్టదిగ్గజ కవుల ఆస్థానం (6)
13. ఇంద్రజాలం (3)
14. తరువాత, అనంతరం (3)
16. మెట్టు (3)
18. నేటికి ముందు రోజు (2)
20. అరుగు,వేదిక (2)
22. బురద,అడుసు (2)
23. మాంగల్యం (2)
24. వేగం(2)
26. సుగ్రీవ అగ్రజుడు (2)
27. అంగార గ్రహం (2)
28 నూనె (3)
29. పెరుగు గారె (3)
30. ఆభరణం (2)
31. కార్యం, అక్కర (2)
32. ఏనుగే ...తిరగబడింది (2)
33. తొమ్మిదవ, నూతన (2)

## పదరసం - 578 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 భు | 2 జం | గం | | 3 హే | | 4 త | 5 రం | 6 గం | |
| 7 వ | ట | | 8 సీ | మం | 9 తం | | 10 పం | ప | కం |
| న | | 11 మా | సం | | డు | | | లు | |
| 12 వి | 13 న | త | | 14 అ | లం | 15 కా | రం | | 16 క |
| 17 జ | యం | | 18 చే | ప | | డు | | 19 హ | లం |
| యం | | 20 నూ | | 21 నిం | 22 గి | | 23 రే | | కా |
| | 24 తే | నె | | 25 ద | రి | 26 దా | పు | | రి |
| 27 వా | రు | | 28 కొ | | 29 జ | ర | | 30 గు | |
| రా | | 31 మి | ర | 32 ప | | 33 కు | బే | రు | 34 డు |
| 35 హి | మం | | 36 వి | లు | కా | డు | | 37 వు | తా |

నివాళి

# ఆత్మాభిమానానికి నిలువుటద్దం షావుకారు జానకి!

**వివాహం అయితే కథానాయికల కెరీర్‌కు ఫుల్ స్టాప్ పడినట్టే అంటారు జనాలు. కానీ వివాహం తర్వాత సినిమా రంగంలోకి కథానాయికగా అడుగుపెట్టి, భారతదేశంలోనే సుదీర్ఘ కాలం నటిగా రాణించిన నటీమణి 'షావుకారు' జానకి. తొలి చిత్రం పేరును ఇంటిపేరుగా మార్చుకున్న తొలి నటి కూడా ఆవిడే. ఆగస్ట్ 21వ తేదీ ఆమె తుదిశ్వాస విడిచినప్పుడు అందరి నోట వచ్చిన ఒకే ఒక్క మాట ఆత్మాభిమానానికి నిలువుటద్దం 'షావుకారు' జానకి అని!**

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో టేకుమళ్ల వెంకోజీరావు, శారదాదేవికి 1931 డిసెంబర్ 12న జన్మించింది జానకి. తండ్రి ఉద్యోగ రీత్యా పలు పట్టణాలకు వారి కుటుంబం ప్రయాణించి, చివరకు 1944కు మద్రాసులో స్థిరపడింది. రెండో ప్రపంచయుద్ధం జరుగుతున్న ఆ కాలంలో అందరూ మద్రాసు వదిలిపోతుంటే, వెంకోజీరావు కుటుంబం చిత్రంగా అదే సమయంలో ఆ నగరంలోకి అడుగుపెట్టింది. బహుశా ఏటికి ఎదురీదడం ఆమెకు తెలియకుండానే అక్కడే మొదలై ఉండొచ్చు. ఆంధ్ర మహిళాసభలో మెట్రిక్‌లో చేరిన జానకి 1945లో మద్రాసు ఆలిండియా రేడియోలో చిన్న పిల్లల కార్యక్రమంలో పలు నాటికలలో పాల్గొంది. ఆ తర్వాత కొద్ది రోజులకే అలనాటి దర్శకనిర్మాత బి.ఎన్. రెడ్డి నుంచి జానకి తన వాచకానికి ప్రశంసలు అందుకుంది. 'గుణసుందరి కథ' తీయబోతున్న ఆయన, జానకిని సినిమాల్లో నటిస్తావా?' అని అడిగినప్పుడు,ఆమె తండ్రికి భయపడి మౌనంగా ఉండిపోయింది. రేడియో ఇంజనీరు శంకరమంచి శ్రీనివాసరావును పెళ్లి చేసుకున్న ఆమె కుటుంబాన్ని నిలబెట్టుకోవడం కోసం బి.ఎన్. రెడ్డిని కలిసి సినిమా అవకాశాన్ని ఇవ్వండి' అని కోరింది. ఆ సమయంలో విజయ సంస్థ 'షావుకారు' సినిమాను నిర్మించే ఆలోచనలోఉండగా, ఆయన సిపార్సుతో వెళ్లిన జానకికి ఆ చిత్ర నిర్మాతల్లో ఒకరైన చక్రపాణి, దర్శకులు ఎల్.వి. ప్రసాద్ మేకప్ టెస్ట్ చేసి, ఆ సినిమాలో నాయికగా ఎంపిక చేశారు. అదే చిత్రంతో మహానటుడు ఎన్టీ రామారావు హీరోగా పరిచయం కాగా, ఆయనకు జానకి తొలి హీరోయిన్. అలాగే జానకికి ఎన్టీఆర్ తొలి కథానాయకుడు. ఆయన సరసన 'వద్దంటే డబ్బు, కన్యాశుల్కం, సొంతవూరు, జయం మనదే, కాడెద్దులు ఎకరం నేల, పెంపుడు కూతురు, సవతి కొడుకు, దేశద్రోహులు'' వంటి చిత్రాలలో నటించింది. నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావుతోనూ ఆమె పలు చిత్రాల్లో నటించి మెప్పించారు. అక్కినేని 'దేవదాసు'లో పార్వతి పాత్ర తొలుత వరించింది జానకినే. కానీ చివరి నిమిషంలో అది చేజారి పోయింది. ఆ సినిమా నిర్మాత డీఎల్ నారాయణ



తనను తొలగించినా, ఆ తర్వాత ఆయన నిర్మించిన 'కన్యాశుల్కం'లో బుచ్చెమ్మ పాత్రకు అడగగానే అంగీకరించి నటించారు. ఏ నిర్మాత అయిన తనకు సరిపడా వేషం ఇస్తే... దానిని అంగీకరించి చేసేవారామె. గతంలో ఆ నిర్మాతతో ఉన్న స్పర్థలను మనసులోకి తీసుకొచ్చేవారు కాదు. ఆమె నటించిన చాలా చిత్రాలు రీ-మేక్ అయినప్పుడు వేరే నటీమణులు వాటిని చేస్తుండేవారు. అయినా ఎప్పుడూ ఆ పాత్ర తనకు ఎందుకు ఇవ్వలేదని అడిగే మనస్తత్వం కాదు ఆమెది.

జానకి ప్రతిభకు తమిళ చిత్రాల ద్వారానే మంచి గుర్తింపు లభించింది 'జానకి త్యాగరాజకీర్తన లాంటిది. త్యాగరాజస్వామి తెలుగువాడైనా, ఆయన కీర్తనలకు తమిళులే ఎక్కువ ప్రాచుర్యం కల్పించారు. అలాగే ఆమె ప్రతిభకు తమిళంలోనే ఎక్కువ గుర్తింపు వచ్చింది'అని ప్రముఖ కవి, రచయిత ఆరుద్ర 'మంచికుటుంబం' శతదినోత్సవ సభలో అనడం అక్షరసత్యం. జానకి తమిళంలో రెండు సినిమాలు నిర్మించారు. బెంగాలీలో ఉత్తమ్ కుమార్ నిర్మించిన 'ఉత్తర్ ఫాల్గుణి' సినిమాను కె.బాలచందర్ దర్శకత్వంలో 'కావియ తలైవి' పేరుతో రీమేక్ చేశారు. బెంగాలీలో సుచిత్రాసేన్ తల్లీ కూతుళ్లుగా నటించిన ఆ పాత్రల్ని తమిళంలో జానకి పోషించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషలన్నింటిలోనూ కలిపి దాదాపు 400 చిత్రాలు చేశారు.ఆమె చివరగా నటించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే' 2023లో విడుదలయింది

'మన వ్యక్తిత్వాన్ని, సంస్కారాన్ని నిలబెట్టే అంశాల్లో వాయిస్ ఒకటి. 'మంచి కుటుంబం'లో నేను మాట్లాడిన ఇంగ్లీషు, 'సంసారం ఒక చదరంగంలో చిలకమ్మ పాత్ర యాస, 'గాంధీ పుట్టిన దేశం', 'మనుషులు మారాలి' లోని ఆ హావభావాలు ... ఇవన్నీ నన్ను ప్రేక్షకుల హృదయాల్లో నిలిచి పోయేలా చేశాయి' అని అనేవారు 'షావుకారు' జానకి.

90 ఏళ్లు దాటిన తరువాత (2022లో) 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు. తెలుగు చిత్రసీమలోనే కాదు భారతదేశంలోనే అత్యధిక సంవత్సరాలు నటజీవితం కొనసాగించిన నటిగా నిలిచారు. ఆమె పిల్లలు ఎవ్వరూ ఈ రంగంలోకి రాలేదు. అయితే పెద్ద కుమార్తె యజ్ఞ ప్రభ కుమార్తె వైష్ణవి అమ్మమ్మ అడుగు జాడల్లో నడుస్తూ పలు చిత్రాలలో నటించింది. జానకి 'సంసారం ఒక చదరంగం' చిత్రానికి గానూ ఉత్తమ సహాయ నటిగా నంది అవార్డును అందుకుంటే, మనవరాలు...కె. విశ్వనాథ్ రూపొందించిన 'శుభ సంకల్పం'లో పాత్రకు ఉత్తమ సహాయనటిగా నంది అవార్డును అందుకుంది.

కొత్తగా చిత్రసీమలో ప్రవేశించిన వారికి జానకి సరైన సలహాలు ఇచ్చి ప్రోత్సహించేవారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అనే సామెతను జానకి తు.చ. తప్పక పాటించారు. మద్రాసులో జానకి అందమైన భవంతులు కట్టుకున్నారు. జానకి ఇంట్లో షూటింగ్స్ జరుపుకున్న అనేక చిత్రాలు విజయ పథంలో పయనించాయి. ఆమె తోటి నటీమణులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడినా తుదిశ్వాస విడిచే వరకూ వ్యక్తిగత జీవితంలో ఒడుదొడుకులను ఎదుర్కొన్నా... ఆర్థికంగా మాత్రం ఎవరి దగ్గర చేయి చాచాల్సిన పరిస్థితిని మాత్రం జానకి ఎదుర్కోలేదు. చివరి వరకూ ఆత్మాభిమానం తోనే జీవించారు. అందుకు తానో ఉదాహరణగా నిలిచారు. **– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**




# 100 దేశభక్తి గీతాల గానం

ఆర్‌ఎస్‌ఎస్‌ను మనం రక్షించుకుంటే అది మనల్ని రక్షిస్తుంది. అన్యమతాలు మన ధర్మంమీద చేస్తున్న దాడి నుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే ఆర్‌ఎస్‌ఎస్‌ను మనందరం సమర్థించాలని కళారత్న, గానకోకిల, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కుమార సత్యనారాయణ అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ విజయవాడ విభాగ్ ఆధ్వర్యంలో సంఘ శత జయంతి సందర్భంగా దేశభక్తి భావాన్ని, సమాజ హితం కోసం పనిచేయాలనే స్ఫూర్తిని గీతాల ద్వారా సమాజంలో విస్తరించాలనే ఉద్దేశంతో "శత గానలహరి" పేరుతో కేబిఎన్ కళాశాలలో ఆగస్ట్ 23న జరిగిన 100 దేశభక్తి గీతాలాపన సభలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ ప్రసంగిస్తూ సంఘ శతాబ్ది సందర్భంగా సినీప్రముఖులను కలిసి సంఘ పాటలను చూపినపుడు, పాటల భావాన్ని విని ఆశ్చర్యపోయి కీరవాణి, ఆర్పీపట్నాయక్ మొదలైనవారందరు ఈ పాటలకు ట్యూన్ కట్టి రికార్డు చేసి ఇస్తామని వాగ్దానం చేశారన్నారు. తమ జీవితంలో ఎప్పుడు ఇలాంటి దేశభక్తి కలిగిన పాటలను వినలేదన్నారు. 'పాడుతా తీయగా' అనే టీవీ కార్యక్రమంలో 'మాదేనోయ్ భారతదేశం మాదే మాదే మాదే మాదేనోయ్' అని ఒక గాయకుడు పాడాడు. ఆ పాట విన్నటువంటి సినీ గాయకుడు ఎస్పీబాలసుబ్రహ్మణ్యం లేచి చప్పట్లు కొట్టి ఇంత అద్భుతమైన పాటను ఎవరు రాశారు అని అడిగారు. పాడిన వ్యక్తి నాకు తెలియదన్నాడు. 'ఇప్పటివరకు ఈ కార్యక్రమంలో పాడిన పాటలకు ఎవరు రాశారు, ఎవరు పాడారు, ఎవరు సంగీతం చేశారో తెలుసు కాని ఈ పాట ఎవరు రాశారు, సంగీతం ఎవరు ఏమీ తెలియదు ఎంత దురదృష్టం' అని ఎస్పీ అన్నారు. కాని సంఘంలో పాటలు రాసిన వ్యక్తి పేరు తెలిస్తే అతను దురదృష్టవంతుడు. సంఘ స్వయంసేవకులు తనకు కాక సంఘానికి పేరు రావాలని కోరుకుంటారు. ఒక పాట రాసి సంఘంలో పాడిన తరువాత అది తన పాటగా భావించకుండా ఉండడమే సంఘం గొప్పతనం. పాటలు రాస్తున్న, పాడుతున్న ప్రతి స్వయంసేవక్ భావన ఇది. దేశ స్వాతంత్ర్యం వచ్చి 50 సంవత్సరాల సందర్భంగా 1997లో 'నిర్మల సుర గంగాజల' అనే పాట స్వయంసేవకులే కాదు అన్ని పాఠశాలలలోని లక్షలాది విద్యార్థుల నాలుకపై నర్తించింది. కార్గిల్ యుద్ధానంతరం హైదరాబాద్ సమీపంలోని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ కార్యక్రమంలో జిల్లాపరిషత్ స్కూల్ విద్యార్థుల ద్వారా 'వందకోట్ల సైనికులం వందేమాతరం, మా జోలికి రావడం ఎవరితరం' అనే పాటను గానం చేస్తే ముఖ్యమంత్రితో సహా ఆశ్చర్యాన్ని ప్రకటించి, ఆనందపడ్డారు. సంఘ శాఖ అనేది చిన్న చిన్న ఆట పాటల కార్యక్రమాల స్వరూపమే కావచ్చు కాని దాని ద్వారా అమోఘమైన ఫలితం లభిస్తుంది. డాక్టర్‌జీ నడిచిన మార్గంలో మన జీవితాన్ని సార్థకం చేసుకుంటూ సాగుదాం.

కార్యక్రమం మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రారంభమై, మొత్తం 112 మంది గాయకులు కలిసి 100 దేశభక్తి గీతాలను నిరంతరాయంగా సుమారు మూడు గంటల వ్యవధిలో ఆలపించి పూర్తి చేశారు. రెండు నెలలుగా నిరంతర అభ్యాసం, సాధనతో నాలుగు భాషల్లో 100 దేశభక్తి గీతాలను పాడటం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

శాఖ ముఖ్య శిక్షక్ నుండి విభిన్న రకాల బాధ్యతలు నిర్వహించే కార్యకర్తల వరకు అందరూ కలిసి తన్మయత్వంతో, ఆనందంతో సాధన చేసి పాడిన గీతాల సమాహారమే ఈ "శత గాన లహరి". వయస్సు, బాధ్యత, అనుభవం వంటి భేదాలను అధిగమించి అందరూ ఒకే వేదికపై కలిసి గానం చేయడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకువచ్చింది.

"సంఘ శాఖకు మనము రావాలోయి" అనే పాటతో కార్యక్రమం ముగిసింది.



From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 46


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.150/-



వెల : ₹.60/-



వెల : ₹.270/-



వెల : ₹.120/-



వెల : ₹.120/-



వెల : ₹.120


వెల : ₹.80



వెల : ₹.250/-



వెల : ₹.60/-



వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.200/-



వెల : ₹.900/-



వెల : ₹.350/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687